జులై 2009

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 6 పేజీలు: 64 వెల: రూ. 20/-



## భవితకు భారమవుతున్న అధిక జనాభా



# రైతుల క్షేమమే లక్ష్యంగా సహకారం క్షేత్ర సంకల్పం



# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 6

జులై, 2009



ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**డి. రామకృష్ణ,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఆర్. అరుణ జ్యోతి**

**ఎన్. విజయ కుమార్**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**



*కాన్సెప్ట్, ప్లానింగ్,*
*ఎడిటింగ్, డిజైనింగ్*
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

**ఎ.ఎం.ఆర్. అపార్డ్**



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ & ఫ్యాక్స్ : 040-24080656

E-mail ID : peshicomamapard@ap.gov.in


# విషయ సూచిక


సంపాదకీయం ........ 2

నిరంతర పురోగతిలో 'అపార్డ్' ........ 3

స్వేచ్ఛా ప్రపంచంలో అడుగిడిన పాలమూరు కూలీలు ........ 4

నిరుపేద కుటుంబంలో వెలుగు నింపిన ఉపాధి హామీ పథకం ........ 5

వాస్తవరూపం దాల్చనున్న పంచాయితీరాజ్ సంస్థలకు అధికారాల బదిలీ... 6

ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచిన జీవనోపాధుల పెంపుదల కార్యక్రమం ........ 8

గ్రామాలకు ప్రాధాన్యం ఇచ్చిన కేంద్ర బడ్జెట్ ........ 9

పంచాయితీరాజ్ సంస్థల్లో జవాబుదారీతనం పెంచడం ఎలా? ........ 13

గురువులకు గురువు... జగద్గురువు శ్రీకృష్ణుడు ........ 15

సిద్ధమవుతున్న 'అభయహస్తం' ........ 17

'ప్రజలకు మంచిపాలన అందించడానికి పునరంకితమవుదాం' ........ 18

గ్రామీణాభివృద్ధి వికేంద్రీకృత ప్రణాళికీకరణ శిక్షణ ఎంతో ఉపయోగకరం . 23

ప్రగతికి బాటలు పరుస్తున్న మన పొదుపు సంఘాలు ........ 26

'అపార్డ్' లో వీడియో కాన్ఫరెన్సు, వెబ్‌సైట్ ప్రారంభం ........ 30

ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం అధ్యయనం ........ 31

దోషం లేని ఆషాఢం ........ 32

సహకార వ్యవసాయంపై సమాలోచనలు ........ 35

ఆ 195 గ్రామాలు... కడిగిన ముత్యాలు ........ 39

సహజ వనరుల అభివృద్ధిలో సర్టిఫికెట్ కోర్సు ........ 43

బీడు భూములను బంగారు భూములుగా మార్చిన ఇందిరప్రభ ........ 45

ఇందిరమ్మ చెరువుతో అదనపు పంటలు ........ 48

చాపకింద నీరు (కథ) ........ 49

వార్తల్లో 'అపార్డ్' ........ 55

ఐ.టి. సాయంతో సుపరిపాలన ........ 57

పంచాయితీ కార్యదర్శుల పనితీరుకి పదును ........ 60

సమగ్రాభివృద్ధి చెందిన గుంటిమడుగు వాటర్‌షెడ్ ........ 63

సుప్రసిద్ధుల వచన పచనం ........ 64

# సంపాదకీయం..

## భూ భారం తగ్గించుదాం !

'అతి సర్వత్ర వర్జయేత్‌' అని మన పెద్దలు ఏనాడో చెప్పారు. ఏదైనా అతి అనర్థదాయకమే. ఈ సూత్రం అన్ని కాలాలకు, అన్ని పరిస్థితులకు, అన్ని దేశాలకు, అందరు మనుషులకు వర్తిస్తుంది. మన దేశంలో జనాభా అనేది అతిగానే ఉంది కాబట్టి, అది మనకొక సమస్యగా మారి, మనను ఇబ్బంది పెడుతూనే ఉంది.

జనాభా ఇంత ఉంటే తక్కువ, అంత ఉంటే ఎక్కువ వంటి నిర్దిష్టమైన ప్రమాణాలేవీ ఉండవు. ఒక ప్రాంతంలో అందుబాటులో ఉన్న వనరులు- అంటే పరిశుభ్రమైన నీరు, గాలి, ఆహారం, వసతి సదుపాయాలు, వైద్య సదుపాయాలు, విద్యా సౌకర్యాలు, మురుగునీటి పారుదల సౌకర్యాలు వంటివి అక్కడ ఉన్న జనాభాకు సరిపడినంత ఉన్నాయా లేదా అనే అంశాన్నిబట్టి, ఆ ప్రాంతంలో జనాభా సరిగానే ఉందా లేక అధికంగా ఉందా అనేది నిర్ణయించాల్సి ఉంటుంది. అందువల్లనే మానవ ఆవాసానికి అనువుగా లేనటువంటి సహారా ఎడారి, అంటార్కిటికా వంటి ప్రాంతాలు ఎంత విశాలంగా ఉన్నప్పటికీ, అక్కడ ఉన్న కొద్దిపాటి జనాభాను మనం అధిక జనాభాగానే పరిగణించాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఆ కొద్దిపాటి జనాభాను పోషించే సామర్థ్యం ఆ ప్రాంతాలకు లేదు.

ఈ ప్రమాణంతో చూస్తే, ప్రపంచం మొత్తంమీద కానీ, భారతదేశంలోకాని జనాభా చాలా అధికంగా ఉంది. మానవుడు వ్యవసాయం అనేది చేపట్టకపోయి ఉన్నట్టయితే, ప్రపంచం మొత్తం మీద ఇప్పటి జనాభా కేవలం 5 లక్షలు మాత్రమే ఉండేదని నిపుణుల అంచనా. వ్యవసాయం వల్ల ఆహారం ఎక్కువ మొత్తంలో అందుబాటులోకి వచ్చి, జనాభా సంఖ్య బాగా పెరిగింది. వ్యవసాయం ప్రారంభమైన కొన్నాళ్లకు క్రీపూ. 8000 సంవత్సర ప్రాంతంలో ప్రపంచ జనాభా 50 లక్షలు ఉండేదని అంచనా. క్రీపూ. 1000 వరకు ఇందులో పెద్దగా మార్పులేదు. క్రీ.శ. 1 సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా మొత్తం 20 నుంచి 30 కోట్ల మధ్యలో ఉండేదని అంచనా. క్రీ.శ. 1700 వరకు ఈ జనాభా పెరుగుదల నెమ్మదిగా సాగుతూ వచ్చింది. క్రీ.శ. 1700 ప్రాంతంలో పారిశ్రామిక విప్లవంతో జనాభా పెరుగుదల బాగా ఊపందుకుని, 1804 నాటికి 100 కోట్లకు, 1939 నాటికి 230 కోట్లకు చేరింది. 1950 ప్రాంతంలో హరిత విప్లవంతో, ప్రపంచ జనాభా అనూహ్యంగా పెరిగి ప్రస్తుతం 670 కోట్లకు చేరుకుంది. ఇదే వేగంతో పెరిగితే, 2050 నాటికి 1100 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

ప్రపంచ జనాభా ఇట్లా పెరగడానికి చైనా, ఇండియా, మరికొన్ని దేశాలు ఎక్కువగా దోహదపడుతున్నాయి. ప్రపంచం మొత్తంలో అధిక జనాభా దేశాల వరసలో చైనా ముందున్నప్పటికీ, 'ఒకే బిడ్డ' విధానం ద్వారా తన జనాభా పెరుగుదలను బాగానే అదుపులో పెట్టుకోగలిగింది. ప్రస్తుత ధోరణుల ప్రకారం చూస్తే, 2050 నాటికి భారతదేశ జనాభా 170 కోట్లకు చేరుకుంటుందని, చైనా జనాభా 140 కోట్లకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచంలోని అన్ని దేశాలు 'ఒకే బిడ్డ' విధానాన్ని అవలంబిస్తే, అధిక జనాభా సమస్యను అధిగమించవచ్చని నిపుణులు అంటున్నారు.

ఇక భారతదేశం విషయానికి వస్తే, అధిక జనాభా మనకు పెద్ద సమస్యగానే ఉంది. దేశంలోని మొత్తం పిల్లల్లో సగంమంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. తాగునీటికి, సాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. జనాభాలో అనేకమందికి ఉపాధి లేదు. గృహవసతి లేదు. విద్యుత్ సదుపాయం లేదు. ఎంత విద్యుత్ తయారు చేసినా సరిపోవడం లేదు. ప్రభుత్వం ఉపాధిహామీ వంటివి ఎన్ని పథకాలు చేపట్టినా, నానాటికీ పెరుగుతున్న జనాభా ఒక సవాలుగానే ఉంది. కనీస అవసరాలైన స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం మనకు కొరతగానే ఉన్నాయి. సహజవనరులు, ఖనిజాలు తరిగిపోతున్నాయి. అడవులు అంతరిస్తున్నాయి. పర్యావరణం దెబ్బతింటున్నది. వాతావరణం మారిపోతున్నది. అధిక జనాభాతో అన్నీ సమస్యలే.

అందువల్లనే జులై 11న జరుపుకుంటున్న ప్రపంచ 'జనాభా దినం' సందర్భంగా ఒక ప్రతిన పూనుదాం. ప్రభుత్వ ఒత్తిడి లేకుండానే 'ఒకే బిడ్డ' విధానాన్ని అనుసరించాలని కృతనిశ్చయులమవుదాం. భారతదేశాన్ని జనాభా సమతుల్య దేశంగా మార్చుకుందాం.



# నిరంతర పురోగతిలో 'అపార్డ్'



**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, భూపరిపాలన తదితర రంగాల్లో రాష్ట్రంలో ఉన్న అత్యున్నత స్థాయి శిక్షణా సంస్థ ఎఎమ్ఆర్ – అపార్డ్. ప్రణాళికల రూపకల్పన, కార్యక్రమాల అమలు, శిక్షణ, పరిశోధన, విశ్లేషణ, సమాచార నిక్షిప్తీకరణ (డాక్యుమెంటేషన్), సమాచార వితరణ రంగాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం, ఇతర రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలకు అవసరమైన సహకారం అందిస్తున్న అత్యుత్తమ కేంద్రంగా ఈ సంస్థ విధులు నిర్వహిస్తోంది. పంచాయతీరాజ్ సంస్థల్లో ఎన్నుకున్న 2.61 లక్షల మంది ప్రతినిధులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విభాగంలో 50 వేల మంది అధికారుల శిక్షణా అవసరాలను సంస్థ తీరుస్తోంది.**

అపార్డ్‌లో ముఖాముఖి శిక్షణ, అందరికీ చేరువయ్యేందుకు అంచెలవారీ శిక్షణ, నిరంతర శిక్షణ కోసం ఉపగ్రహ ఆధారిత దూర విద్య వంటి కార్యక్రమాల ద్వారా 2.61 లక్షల మంది ఎన్నుకోబడిన ప్రతినిధులకు చేరువయ్యేందుకు ఎఎమ్ఆర్ అపార్డ్ బహుళ అంచెల పద్ధతి అవలంబిస్తుంది. గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ వట్టి వసంతకుమార్ జూన్ 9న 'అపార్డ్'ను సందర్శించి కొత్త సౌకర్యాలను ప్రారంభించారు.

## సైబర్ కారిడార్ ప్రారంభోత్సవం – వీడియో కాన్ఫరెన్స్

సమాచారం, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) ఉపయోగించి సామర్థ్య నిర్మాణం కారక్రమాలు నిర్వహించేందుకు ఎఎమ్ఆర్ అపార్డ్ వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టింది. ఈ సౌకర్యం ద్వారా అపార్డ్ –

1. అన్ని జిల్లా కేంద్రాలను అనుసంధానిస్తుంది.
2. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలను అనుసంధానిస్తుంది.
3. సామర్లకోట, బాపట్ల, కాళహస్తి, రాజేంద్రనగర్, హసన్‌పర్తిల్లో ఉన్న అపార్డ్‌కు చెందిన అయిదు విస్తరణ శిక్షణా కేంద్రాలను అనుసంధానం చేస్తుంది. విస్తరణ శిక్షణా కేంద్రాలతో అద్దె చెల్లింపు ప్రాతిపదికన తీసుకున్న టెలిఫోన్ ISDN లైన్లతో ఎన్ఐఆర్‌డి, ఎస్ఐఆర్‌డి వంటి ఇతర శిక్షణా సంస్థలతో ఐఎస్‌డిఎన్ లైన్ల ద్వారా అనుసంధానం చేస్తారు.

## అపార్డ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

ఎవరితోనయినా ఎక్కడయినా చేరువయ్యేందుకు, బటన్ నొక్కగానే ఉపయోగించటానికి అనువైన, ఇంటరాక్టివ్ సేవలను అందించేందుకు అపార్డ్ తన వెబ్‌సైట్‌ను రూపొందించింది. పలుకేంద్రాల్లో అమలవుతున్న శిక్షణా కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. నిజం చెప్పాలంటే ఒక యాత్ర తరహాలో ఈ వెబ్‌సైట్‌లో ప్రయాణం చేస్తూ అందుబాటులో ఉన్న మౌలిక సౌకర్యాలు, శిక్షణా వనరుల గురించి మనం తెలుసుకోవచ్చు. అపార్డ్ ప్రచురించిన పుస్తకాలు, శిక్షణా సామాగ్రిని ఎవరైనా ఉపయోగించుకునేందుకు ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. శిక్షణా క్యాలెండర్ కూడా వెబ్‌సైట్‌లో ఉంచుతారు. తద్వారా శిక్షణా కార్యక్రమాలకు పంపించవలసిన సిబ్బంది జాబితాను అన్ని డిపార్ట్‌మెంట్లు తయారు చేసుకోవచ్చు. తమకు కావలసిన శిక్షణా కార్యక్రమాన్ని ఎంచుకునేందుకు సిబ్బందికి వెబ్‌సైట్ అవకాశం కల్పిస్తుంది.

## సమగ్ర సహజ వనరుల అభివృద్ధిలో సర్టిఫికెట్ కోర్సు

గుంటూరులోని గ్రామీణ అధ్యయనం, పరిపాలన సంస్థ సహకారంతో ఎఎమ్ఆర్ – అపార్డ్ 2009 ఫిబ్రవరి మాసంలో సమగ్ర సహజ వనరుల అభివృద్ధిలో మూడు నెలల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించింది. 2009 జూన్ 9 నాటికి 22 మంది అభ్యర్థులు ఈ కోర్సు పూర్తి చేసుకున్నారు. అభివృద్ధి ప్రక్రియలో పాల్గొనేందుకు, సుస్థిర ప్రాతిపదికన సహజ వనరులను వినియోగించుకునేందుకు కమ్యూనిటీలకు సహాయపడే రీతిలో పలు అంశాల్లో నిష్ణాతులను తయారుచేయటమే ఈ కోర్సు ప్రధాన లక్ష్యం. గ్రామీణాభివృద్ధి, ఇందిరాక్రాంతి పథం, ఫించన్లు, ఎన్ఆర్ఇజిఎస్ శాఖల మంత్రి శ్రీ వట్టి వసంత్‌కుమార్ అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.


## 'అపార్డ్' పురోగతి

- అపార్డ్ ప్రాంగణంలో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 144 మంది వుండేందుకు వీలుగా 72 గదుల హాస్టల్ భవనం మంజూరయింది. ఈ భవన నిర్మాణం ఈ ఏడాది పూర్తవుతుంది.
- శ్రీకాళహస్తి, సామర్లకోట, బాపట్ల, రాజేంద్రనగర్, హసన్‌పర్తిలో ఉన్న ఐదు విస్తరణ శిక్షణా కేంద్రాల్లో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో అదనపు శిక్షణా సౌకర్యాలు కల్పిస్తున్నారు.
- దాదాపు 2.61 లక్షల మంది ఎన్నుకోబడిన ప్రతినిధులు, 50,000 మంది పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సిబ్బంది సామర్థ్య అభివృద్ధికి నిరంతర శిక్షణా కార్యక్రమాల రూపకల్పన
- ఈ ఏడాదిలో ఇ–లెర్నింగ్‌ను విరివిగా ఉపయోగించటం ద్వారా 'అపార్డ్' ఎక్కువ మందికి చేరువవుతుంది.
- ఈ ఏడాది వాటర్‌షెడ్స్‌కు 'అపార్డ్' జాతీయ వనరుల కేంద్రం కానున్నది.

**(అనువాదం – *డి. సుప్రశాంతి దేవి*)**

స్వేచ్ఛా ప్రపంచంలో అడుగిడిన

# పాలమూరు కూలీలు



**'వెట్టి చాకిరీ' బూర్జువా లక్షణానికి ప్రతీక. దశాబ్దాల క్రితం నాటి కాలంలో భూస్వాములు, అగ్రకులాల వారు తమ దగ్గర పనిచేసేవారికి లేదా గ్రామంలోని పేదలు, బలహీనవర్గాల వారికి అప్పులిచ్చి జీవితాంతం తమ వద్దే ఊడిగం చేయించుకునేవారు. తాత చేసిన అప్పు తండ్రి తీర్చలేక, తండ్రి చేసిన అప్పు కొడుకు తీర్చలేక కుటుంబం మారుతూ ఉన్నా వారి చెప్పుచేతల్లో మగ్గేవారు.**

కాలం మారింది. మనుషులూ మారుతున్నారు. 1976లో స్వర్గీయ ఇందిరాగాంధీ, 'వెట్టిచాకిరీ' నిర్మూలన చట్టాన్ని తీసుకుని వచ్చి దేశంలోకి లక్షలాది మంది వెట్టి కార్మికులకి స్వేచ్ఛా జీవితాల్ని ప్రసాదించారు.

అయినా, ఇంకా కొన్ని జిల్లాలలో ఈనాటికీ వెట్టి కార్మికులున్నారంటే ఆశ్చర్యం కలిగించకమానదు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలని సద్వినియోగం చేసుకోలేని అమాయకత్వం వారిది.

మహబూబ్‌నగర్ జిల్లా 'పాలమూరు' జిల్లాగా ప్రసిద్ధి చెందింది. భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా అనాదిగా ఈ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఏర్పడిన కరువు కాటకాల వలన ప్రజలు పనులు వెతుక్కుంటూ వలసలకు వెళ్లడం అలవాటయింది. ఇదే అదనుగా భావించిన కొంతమంది దళారులు, గుంపుమేస్త్రీలు పేదలను ఎరగా భావించి, వారికి కొంత డబ్బు అడ్వాన్సుగా ఇచ్చి సుదూర ప్రాంతాలకు తీసుకువెళ్ళి జీవితాంతం వారితో కూలీ పనులు చేయించుకుంటున్నారు.

ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల వద్ద ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో 12 మంది కూలీలు మరణించారు. కాలువ పక్కన ఒక విద్యుత్ స్థంభం ఏర్పాటు కోసం పనులు చేస్తుండగా, ఒక్కసారిగా మట్టి వీరిపై పడి 12 మంది కూలీలు అక్కడికక్కడే మరణించడం జరిగింది. వీరిలో 8 మంది మహిళలు, మిగతావారు పిల్లలు. వీరంతా మహబూబ్‌నగర్ జిల్లా నుండి వలస వెళ్ళిన కార్మికులు. ఆర్. ఆనందం అనే గుంపుమేస్త్రీ వీరినుండి గత అనేక ఏళ్లుగా పని చేయించుకుంటున్నాడు. చనిపోయిన వారిలో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని రేకులంపల్లి, చిన్న చింతకుంట మండలంలోని మద్దూరు గ్రామంలోని వారు ఎక్కువగా వున్నారు.

ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించింది. విచారణలో తేలిన విషయమేమంటే ఈ రకంగా గుంపుమేస్త్రీలు మహబూబ్‌నగర్ జిల్లాలో 958 మంది వున్నట్లు, సుమారు 42 వేల మందిని వలసల పేరుతో తీసుకెళ్లి, అక్కడ వెట్టిచాకిరి పనులు చేయిస్తున్నట్లు తేలింది.

1జూన్ 2009న ప్రభుత్వం 173 నంబరుతో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఉత్తర్వులు జారీచేస్తూ, వెట్టిచాకిరీని ప్రోత్సహిస్తున్న గుంపుమేస్త్రీలపై చట్టపరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని, వెట్టి కార్మికులుగా పనిచేస్తున్న వారందరినీ స్వేచ్ఛా జీవులను చేయాలని, వారందరికీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద అడిగినన్ని రోజులు పని కల్పించడంతో పాటుగా, వెట్టిచాకిరీ క్రింద పనిచేసే మహిళలను స్వయం సహాయక సంఘాల గ్రూపుల్లో చేర్చుకుని, పావలావడ్డీ ద్వారా వారందరికీ ఆర్థిక సహాయం కల్పించాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

అంతేగాదు గుంపుమేస్త్రీలు కూలీలకు ఇచ్చిన అడ్వాన్సు సొమ్మును కూడా ప్రభుత్వం రద్దు చేయించింది. కూలీల వద్ద మేస్త్రీలు తీసుకున్న దస్తావేజుల్ని, ప్రామిసరీనోట్లను రద్దు చేస్తూ గుంపు మేస్త్రీలపై చట్టపరమైన కొరడా ఝుళిపించింది. ఆదిలాబాద్ జిల్లాకు కూలీలను తీసుకెళ్ళిన రాచర్ల ఆనందం మేస్త్రీని అరెస్ట్ చేయడంతో పాటుగా, చనిపోయిన కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల చొప్పున మేస్త్రీ రాచర్ల ఆనందం నుండి అధికారులు కూలీల కుటుంబ సభ్యులకు ఇప్పించారు.

07 జూన్ 2009న మహబూబ్‌నగర్ జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ వట్టి వసంతకుమార్‌తో పాటుగా పౌర సరఫరా శాఖామాత్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు శ్రీ మందా జగన్నాథం, శాసనసభ్యులు శ్రీ గుత్తా దయాకర్‌రెడ్డి, జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ దామోదర్‌రెడ్డి రేకులంపల్లి, మద్దూరు గ్రామాల్లో పర్యటించి ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు అయిదు లక్షల రూపాయల చొప్పున చెక్కులను పంపిణీ చేసారు. మంచిర్యాల సంఘటన తరువాత ప్రభుత్వం వెంటనే స్పందించింది. అసలు మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంతమంది గ్రూపు మేస్త్రీలున్నారు, ఎంతమంది ఆయా గ్రామాల నుండి వలసలు వెళ్లారనే విషయమై అధికారులతో కూడిన బృందం 20 మండలాల్లోని ప్రతి గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించడం జరిగింది. 958 మంది గుంపు మేస్త్రీలున్నట్లు, 41,505 మంది ప్రజలు వలసలు వెళ్ళినట్లు తేలింది.

ప్రస్తుతం వలసలు వెళ్ళిన వారందరినీ వెనక్కు రప్పించి అందరికీ ఉపాధి హామీ పథకం కింద కోరినన్ని రోజులు పనులు కల్పించడంతో పాటుగా, వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, హాస్టల్ వసతి కల్పించడం, మహిళలను పొదుపు సంఘాల్లో చేర్పించి పావలావడ్డీ ద్వారా వారికి ఆదుకోవడం, వీరు గతంలో మేస్త్రీల వద్ద తీసుకున్న అప్పులన్నీ రద్దు చేయడం యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

– కె. మనోహరాచారి

## 'వెట్టి' నుంచి విముక్తి

# నిరుపేద కుటుంబంలో వెలుగు నింపిన ఉపాధి హామీ పథకం

**కరువు పీడిత ప్రాంతమైన కడపకి 60కి.మీ. దూరంలో వీరపునాయునిపల్లి అనే మండలం ఉంది. ఆ మండలానికి 5 కి.మీ దూరంలో మిట్టపల్లె అనే గ్రామానికి హరిజనవాడ ఉంది.. అందులో నివాసం వుండే ప్రజలు కూలీనాలీ చేసుకొని పొట్టపోసుకునే వారు. పని లేనప్పుడు వలసలు వెళ్ళేవాళ్ళు. అలాంటి వీరిని ప్రభుత్వం పేదవారిగా గుర్తించి పట్టాభూములు ఇచ్చింది.**

అలా లబ్ధిపొందిన వారిలో వీరయ్య, రాజమ్మ, పెద్దక్క, నర్సమ్మలకు ప్రభుత్వం 7.80 ఎకరాల భూమిని 3 సంవత్సరాల క్రితం ఇచ్చింది. ఈ భూమి చెట్లతోను, పొదలతోను, రాళ్ళతోను నిండి వుండి వ్యవసాయానికి అనుకూలించలేదు. అందులోను వీళ్ళ పరిస్థితి చూస్తే రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి కావటంతో ఇచ్చిన భూమిని సాగులోనికి తీసుకురావటం అనేది ఎండమావిలో నీళ్ళు వెతికినట్లుగా మారింది. దాంతో వీరికి ఇచ్చిన పట్టాలను నిర్లక్ష్యం చేసి, యథావిధిగా కూలిపని చేసుకొని కాలం వెళ్ళబుచ్చసాగారు. అదృష్టవశాత్తు ఉపాధిహామీ పథకం ద్వారా భూమిని సాగుచేసుకొనే అవకాశం రావటంతో వీరి ఆశకు జీవం పోసినట్లయింది. ఈ పథకం ద్వారా కంపలు తొలగించి, మొద్దులు తీసివేసి, రాళ్ళను ఏరి



కట్టలుగా పోసుకొని భూమిని చదును చేసుకున్నారు. కాని నీటి వసతి లేకపోవటంతో ఆశించిన రీతిలో పంటలు పండించలేకపోయారు.

అప్పుడు వీరందరూ కలసి చర్చించుకొని ఇంకా ఏదైనా పథకం ద్వారా లబ్ధిపొందవచ్చునేమో అని ఇతరులను సంప్రదించగా , యస్.సి.కార్పొరేషన్ ద్వారా బోరు సదుపాయం పొందవచ్చని తెలుసుకొని అర్జీ పెట్టుకున్నారు. యస్.సి. కార్పొరేషన్ వారు అనుమతించడంతో వీరందరు కలసి ఒక బోరు వేయించుకొని పంటలు పండించసాగారు.

దీపం వుండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి అన్నట్లుగా ఉపాధి హామీ పథకంలో భాగంగా పేదల భూములలో పండ్లతోటల పెంపకం చేపడుతున్నారని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అదనపు ప్రోగ్రాం అధికారి ద్వారా తెలుసుకొని అర్జీ పెట్టుకొనగా ప్రభుత్వ అనుమతించడంతో తమకున్న భూమిలో చీని మొక్కలు నాటుకున్నారు.

అంతరపంటలుగా వేరుశెనగ కూడా వేసుకున్నారు. ఈ అంతరపంటల ద్వారా 18 నుంచి 20 బస్తాలు ఒక ఎకరానికి పండించుకున్నారు. ఇప్పుడు తమకు ఉన్న భూమిలో వ్యవసాయంద్వారా సంవత్సరానికి వీరందరు రూ. 80,000/- నుండి రూ.90,000/-లు సంపాదిస్తున్నారు. ఒకప్పుడు రెక్కాడితేగాని డొక్కాడని వీరు ఇప్పుడు నలుగురికి కూలి కల్పించే స్థాయికి ఎదగడం అతిశయోక్తికాదు. కనుక కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు. పెద్దలు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా వీరందరి ఆశ నెరవేరి కృషి ఫలించింది. ఆర్థికంగా కూడా వీరి జీవితంలో చాలా మార్పు చోటు చేసుకుంది.

***వీరందరు ప్రభుత్వం నుండి .. ..***

- భూమి అభివృద్ధి పరుచుకొనటానికి రూ.40,000/-లు.
- యస్.సి.కార్పొరేషన్ నుంచి బోరు వేయించుకొనటాపికి రూ.20,000/-లు.
- ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లమొక్కల పెంపకానికి దాదాపుగా రూ.1,00,000/-లు వరకు లబ్ధి పొందారు.

***– జిల్లా నీటి యాజమాన్య సంస్థ,*** కడప

**భారతదేశంలో అట్టడుగున ఉన్న వ్యక్తి కూడా దేశంలోని అత్యున్నత వ్యక్తితో సమానంగా దేశానికి పాలకుడు కావాలన్నదే జాతిపిత మహాత్మాగాంధీ ఆశయం. గ్రామ స్వరాజ్యం ద్వారానే పూర్ణ స్వరాజ్యం సాధించగలమన్నది ఆయన నమ్మకం. ప్రతీ గ్రామ పంచాయితీ ఒక రిపబ్లిక్‌గా వ్యవహరిస్తూ తనకు కావలసిన అవసరాలను తనంతట తాను తీర్చుకుంటూ తనకు సాధ్యం కాని వాటి కొరకు మాత్రమే ఇతరుల మీద ఆధారపడే విధంగా పంచాయితీలను బలోపేతం చేయాలనేది మహాత్మా గాంధీజీ దృక్పథం.**

జాతిపిత మహాత్మా గాంధీజీ కన్న కలలను సాకారం చేయటానికి 1950 సం. లోనే రాజ్యాంగంలోని ఆర్టికల్ 40 ద్వారా బాటలు వేసిన భారత ప్రభుత్వం 1992లో 73వ రాజ్యాంగ సవరణ చేపట్టి 1993 ఏప్రిల్ 24 నుండి దేశవ్యాప్తంగా మూడంచల పంచాయితీరాజ్ వ్యవస్థను అమలులోనికి తీసుకువచ్చి దేశ పంచాయితీరాజ్ చరిత్రలో నూతన శకానికి నాంది పలకటమే కాక పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించింది.

☆ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని వివిధ స్థాయిలలోని పంచాయతీల మధ్య పంపిణీ చేయటానికి రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు

1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం అమలులోకి వచ్చిన ఫలితంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలకు సుమారు రెండు లక్షల అరవై వేల మంది ప్రాతినిథ్యం వహిస్తుండగా, వీరిలో 86 వేల మంది మహిళలు, సుమారు 48 వేల మంది షెడ్యూల్డు కులాలకు చెందినవారు, 24 వేల మంది షెడ్యూల్డు తెగలకు చెందిన వారుండటం ఒక విశేషాంశం. ఈ లెక్కన మన రాష్ట్రంలో 2001 జనాభా లెక్కల ప్రకారం ప్రతీ 290 మంది జనాభాకు ఒక ప్రజాప్రతినిధి ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

అంతే కాకుండా పంచాయితీరాజ్ సంస్థలను బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో జిల్లా ప్రణాళికా కమిటీ చట్టం (చట్టం 40/2004) చేసి 2007 అక్టోబరు నాటికి 22 జిల్లాలలో జిల్లా ప్రణాళికా కమిటీలను ఏర్పరచటం హర్షణీయ పరిణామం. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి జిల్లా పరిషత్తు అధ్యక్షుడిని ఈ జిల్లా ప్రణాళికా కమిటీకి అధ్యక్షుడిగా చేయటం, జిల్లా కలక్టరును మెంబరు సెక్రటరీగాను, జిల్లా పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు సభ్యులుగా అవకాశం కల్పిస్తూ, ఎం.ఎల్.ఎ/ ఎం.ఎల్.సి/ ఎం.పి.లు మొదలైన శాశ్వత ప్రత్యేక ఆహ్వానితులుగాను చేస్తూ చట్టం రూపొందించటం వంటి చర్యలు చేపట్టింది.

# వాస్తవరూపం దాల్చనున్న పంచాయితీరాజ్ సంస్థలకు అధికారాల బదిలీ

## పంచాయితీరాజ్ శాఖ మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ అధ్యక్షతన 10 మంది మంత్రుల సమావేశం

బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫారసుల కనుగుణంగా 1959 లో పంచాయతీ రాజ్ వ్యవస్థను ఆచరణలోకి తెచ్చిన రాష్ట్రాలలో రాజస్థాన్ తరువాత స్థానం మన రాష్ట్రానిదే. నాటి నుండి పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి పలు చర్యలను చేపట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణననుసరించి 1994 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టాన్ని అమలులోకి తీసుకొని వచ్చింది. దీని ఫలితంగా పంచాయతీ రాజ్ సంస్థలలో అనేక ప్రగతిశీల మార్పులు చోటు చేసుకున్నాయి. అవి:

☆ జిల్లా/ మండల/ గ్రామ స్థాయిలలో స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు

☆ గ్రామసభకు ప్రత్యేక గుర్తింపు

☆ షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించటం

☆ ప్రతి కేటగిరిలో మహిళలకు ప్రత్యేకించి 1/3వ వంతు సీట్లు

☆ నాయకత్వ స్థానాలలోనూ రిజర్వేషన్లు

☆ వార్డు సభ్యుడు, సర్పంచి, ఎంపిటిసి, జడ్.పి.టి.సి. సభ్యుల ప్రత్యక్ష ఎన్నికలు,

☆ ప్రతీ 5 సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహించటం కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు

ఆర్టికల్ 243 జి ప్రకారం రాజ్యాంగంలోని షెడ్యూలు 11లో పేర్కొన్న 29 అంశాలను పంచాయతీలకు బదలాయిస్తూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం షెడ్యూలు 1లో పేర్కొన్నప్పటికీ, ఈ అంశాలలో గ్రామపంచాయతీ/ మండల/ జిల్లాపరిషత్తుల మధ్య విధుల విభజన, నిధులు, సిబ్బంది బదలాయింపు స్పష్టంగా జరగలేదు. 2002 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అధికారాలు బదలాయించుతూ పలు ఉత్తర్వులు వెలువరించినప్పటికీ ఈ ఉత్తర్వులలో స్పష్టత లోపించటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో 2006 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖతో 29 అంశాలలో అధికారాల బదలాయింపు కోసం ఒక ఒప్పందం చేసుకొన్నది.

ఈ ఒప్పంద పత్రంపై అప్పటి కేంద్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖామాత్యులు శ్రీ మణిశంకర్ అయ్యర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి ఇరువురు సంతకాలు చేసారు. దీని ఫలితంగా

**అధికారాలు బదలాయించబడిన ప్రభుత్వ శాఖలు**

- ☆ గ్రామీణాభివృద్ధి
- ☆ వ్యవసాయం
- ☆ పశుసంవర్ధకం
- ☆ ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య,
- ☆ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం
- ☆ త్రాగునీరు
- ☆ వెనుకబడిన తరగతుల సంక్షేమం
- ☆ సాంఘిక సంక్షేమం
- ☆ ఫిషరీస్
- ☆ మహిళా శిశు సంక్షేమం

2006 సంవత్సరంలో 29 అంశాలకు సంబంధించిన అంశాలలో వివిధ పంచాయతీ రాజ్ సంస్థలు నిర్వహించవలసిన కార్యకలాపాల గుర్తింపు ప్రక్రియను ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ సహకారంతో చేపట్టి 10 ఈ క్రింద సూచించిన 10 శాఖలకు చెందిన వివిధ పథకాల మీద పంచాయతీ రాజ్ సంస్థలకు అధికారాలను, విధులను బదలాయించుతూ ప్రభుత్వం 2007లో ఉత్తర్వులు జారీ చేసింది.

పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాలు బదలాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల వల్ల –

- ☆ 10 శాఖల వార్షిక ప్రణాళికల తయారీ బాధ్యత పంచాయతీ రాజ్ సంస్థలకు బదిలీ
- ☆ రాష్ట్ర స్థాయి నుండి 10 శాఖలకు సంబంధించిన నిధులు నేరుగా పంచాయతీ రాజ్ సంస్థలకు బదిలీ
- ☆ 10 శాఖల పనితీరుని సమీక్షించడానికి, తనిఖీ చేయడానికి, పర్యవేక్షించడానికి
- ☆ పంచాయతీ రాజ్ సంస్థలకు అధికారాలు, పంచాయతీ రాజ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధులకు, అధికారులకు సామర్థ్యాల పెంపుదల శిక్షణ లభించనున్నాయి.

అయితే ఈ శాఖలు బదలాయించిన అధికారాలు, విధులు ఆశించిన క్షేత్ర స్థాయిలో అమలు జరగటంలేదు. అందుకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మళ్ళీ రెండవ విడత అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించిన అధికారాలు వాస్తవికంగా కార్యరూపం దాల్చేలా చేయటానికి పంచాయతీ రాజ్ శాఖామాత్యులు శ్రీ బొత్స సత్యనారాయణ నేతృత్వంలో 10 శాఖల మంత్రివర్యులతో, ముఖ్య కార్యదర్శులతో జూన్ 22న రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పరచి, ఈ 10 శాఖలలో వెలువరించిన ఉత్తర్వుల అమలులో గల ఇబ్బందులు, వాటిని అధిగమించటానికి తీసుకోవల్సిన చర్యల గూర్చి శాఖల వారీగా సుదీర్ఘంగా చర్చించారు.

బదిలీ చేసిన అధికారాలను, నిధులను వినియోగించాలంటే పంచాయతీరాజ్ సంస్థలు తమ సామర్థ్యాలను మార్పుకు అనుగుణంగా పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సమావేశం అభిప్రాయపడింది. సామర్థ్యాల పెంపుదలకు ప్రత్యేక ప్రణాళిక అమలు పర్చాలని కూడా నిర్ణయించారు. పంచాయతీ రాజ్ సంస్థలకు బదలాయించిన అధికారాలు అమలు అయ్యేలా చూడటానికి జిల్లాలో కలెక్టరు అధ్యక్షతన కమిటీలను ఏ ర్పాటుచేయాలని నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకొకసారి ఈ కమిటీ సమావేశమై తాజా పరిస్థితిని సమీక్షించాలని, తగుచర్యలు చేపట్టాలని తీర్మానించారు.

*చర్చల అనంతరం శాఖల వారీగా తీసుకొన్న ప్రధాన నిర్ణయాలు –*

- ☆ గ్రామ స్థాయిలో పాఠశాల విద్యాకమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించటం లేదని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గ్రామంలో విద్యా కమిటీని ఏర్పరచలేదని, అందువల్ల ఈ కమిటీని వెంటనే ఏర్పరచి గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రతినెల ఈ కమిటీల ను సమావేశపర్చాలని నిర్ణయం తీసుకోవటం జరిగింది. విద్యార్థుల నమోదు, హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల పారి శుధ్యం, త్రాగునీటి సదుపాయం తదితర అంశాలపై ఈ కమిటీ తప్పక సమీక్షించాలని నిర్ణయించారు. మండల విద్యాశాఖాధికారి ప్రతి మూడు నెలలకొకసారి తప్పనిసరిగా ఈ సమావేశాలకు హాజరు అయ్యేలా ఆదేశాలు జారీ చేయటానికి నిర్ణయించారు.
- ☆ గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా క్షేత్ర స్థాయిలో జరిగే పనుల ప్రతిపాదనలను జిల్లాస్థాయిలో ఖరారు చేయకుండా పంచాయతీ రాజ్ సంస్థల ప్రజాప్రతినిధులతో చర్చించి క్షేత్రస్థాయి నుండే తీసుకోవాలి. గ్రామాలలో త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించటం పంచాయతీల ప్రధాన బాధ్యతలు. ఈ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించటానికి కావలసిన శిక్షణను ప్రజాప్రతినిధులకు, అధికారులకు అందచేయటం జరుగుతుంది. బదిలీ అయిన అధికారాల మేరకు పంచాయతీరాజ్ సంస్థలు పనిచేసేలా ఇంజనీర్ ఇన్ ఛీఫ్, ప్రజారోగ్య విభాగం డైరక్టరుతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పరచి వీరి సూచనల మేరకు పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేస్తారు.
- ☆ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలు జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, వాటర్‌షెడ్ కార్యక్రమాలలో చేపట్టే పనులను గ్రామసభల ద్వారా గుర్తించాలి. పనుల ప్రగతిని ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులు సమీక్షించవచ్చు, పనుల పరిశీలన కూడా చేయవచ్చు. అధికారులు పూర్తి వివరాలను ప్రజాప్రతినిధులకు తెలియపర్చాలి. పనులు జరుగుతున్నప్పుడు ప్రజాప్రతినిధులు ఏవేని లోటుపాట్లు గుర్తించి అధికారులకు తెలియపరిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకొని, తీసుకొన్న చర్యలపై ప్రగతి నివేదికను ప్రజాప్రతినిధులకు అందచేయాలి.
- ☆ సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సంక్షేమ హాస్టళ్ళలో విద్యార్థుల అడ్మిషన్లను సమీక్షించటం, హాస్టలు పనితీరుని సమీక్షించటం, ఇతర కార్యక్రమాలను పర్యవేక్షించటం కోసం ప్రస్తుతం ఉన్న నియోజకవర్గ స్థాయి కమిటీ స్థానంలో మండల స్థాయిలో మండల పరిషత్తు అధ్యక్షుని ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పరచటానికి నిర్ణయం తీసుకొన్నారు. స్థానిక శాసన సభ్యులు ఈ కమిటీకి సలహాదారుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ సమావేశం తరువాత తుది జాబితాను మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ముందుంచాలి. ఈ కమిటీ తీసుకొన్న నిర్ణయాలలో ఏవేని లోటుపాటులున్నట్లయితే రెవెన్యూ డివిజనల్ అధికారికి అప్పీలు చేసుకోవచ్చు.
- ☆ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఉప అరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రుల పరిధిలో ఏర్పరచిన ఆరోగ్య కమిటీలు సక్రమంగా సమావేశాలు నిర్వహించుకోవటం లేదని గుర్తించారు. అందువల్ల, ఈ కమిటీ

# ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచిన జీవనోపాధుల పెంపుదల కార్యక్రమం

**ఖ**మ్మం జిల్లా, ఏన్కూరు మండలములోని గంగుల నాచారం గ్రామ నివాసి శ్రీమతి ముత్తులక్ష్మి, భర్త చిన్న వెంకటేశ్వర్లు. వీరికి ఇద్దరు పిల్లలు. బాబు 8వ తరగతి, పాప 6వ తరగతి చదువుతున్నారు. తల్లి మంగమ్మ వయసు 80 సంII రాలు. మొత్తం కుటుంబ సభ్యులు ఐదుగురు. వీరు షెడ్యూల్ తెగలకు చెందినవారు. ఈమె ఆదర్శ గ్రామసమాఖ్యలో కోశాధికారి, మండల సమాఖ్యలో ఇ.సి. మెంబర్.

భార్యా భర్తలు ఇరువురు కూలీ పనికి వెళుతుండేవారు. వీరికి రెండు ఎకరాల మెట్ట. ఒక ఎకరం మాగాణి భూమి వున్నది. వర్షాధార పంటలు మాత్రమే పండుతున్నాయి. వీరికి సొంతంగా ఒక ఆవు ఉంది. వీరు పొలంలో పనిచేసుకోవటంతోపాటు, ఇతర కూలీ పనులకు వెళ్ళి సంపాందించుకునేవారు.

ఉపాధి హామీ పథకంలో 60 రోజులు పనికి వెళ్ళి రూ. 5000లు సంపాందించుకున్నామని వీరు తెలియజేశారు. పిల్లల చదువులు, పెద్దలను పోషించటం, పంటలు సరిగా పండకపోవటం వలన ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతుండేవి. వీటిని అధికమించటానికి గాను, వాటర్‌షెడ్ పథకంలోని జీవనోపాధుల పెంపుదల కార్యక్రమంలోని నిధుల సహాయం, ఆదర్శ గ్రామ సమాఖ్య ద్వారా అప్పు పొంది గేదెలను కొనుగొలు చేయాలని ఆలోచించి, వాటర్‌షెడ్ పథకంలో ఏర్పాటు చేసిన శిక్షణలకు హాజరై, శిక్షణలో తెలియజేసిన అంశాలను దృష్టిలో ఉంచుకొని తన ఆలోచనను లక్ష్మి స్వయం సహాయక బృందంలో తెలియజేసింది.

ఇందుకు సభ్యులు సమ్మతించి, ఆదర్శ గ్రామ సమాఖ్యను గేదె కొనుగోలు కోసం, జీవనోపాధుల పెంపుదల క్రింద అప్పు మంజూరు చేయమని కోరారు. ఆందుకు ఆదర్శ వి.ఒ. ఇతర సభ్యులతో సంప్రదించి, అప్పు మంజూరు చేశారు. మొత్తం అప్పు రూ. 18000.00లు. ఇందులో గేదె కొనుగోలుకు రూ. 14200.00లు. మిగిలిన వాటిలో రూ. 1000.00లు దానాకు, రూ. 2000.00లు గడ్డి, రూ. 800.00 రవాణా, ఇతర ఖర్చులు అయినాయి. ఈ గేదెను జనవరి 2008లో కొనుగోలు చేసి, ఇప్పటివరకు నాలుగు వాయిదాలను చెల్లించారు. ఇంకనూ 16 వాయిదాలు చెల్లించవలసివున్నది.

గేదె రోజుకు ఉదయం 21/2 లీటర్లు, సాయంత్రం 1 1/2 లీటర్లు మొత్తం 4 లీటర్లు పాలు ఇస్తుంది. ఈమె ఇంటి అవసరాలకు 1 లీటరు పాలు ఉంచుకొని, మిగిలిన 3 లీటర్లను పాలకేంద్రానికి ఇస్తున్నట్లు తెలియజేసింది. నెలకు 90 లీటర్ల పాలను అమ్మటం ద్వారా రూ. 1700.00 అదాయం వస్తుందని చెప్పింది. గేదె వాయిదా పోను కొంత సొమ్ము ఇంట్లో అవసరాలు తీర్చుకోవటం వలన వారికి లాభదాయకంగా ఉందని చెప్పారు. ఈ అప్పు తీరిన వెంటనే మరొక గేదెను కొనుగొలు చేయటానికి సుముఖంగా వున్నామని తెలియజేశారు.

ఈ వాటర్‌షెడ్ పథకంలోని జీవనోపాధుల పెంపుదల కార్యక్రమాల ద్వారా తనలాంటి వారికి ఎంతో ఉపయోగం కలిగి వారి కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధించటానికి అవకాశం ఉంటుందని ఆమె ఆనందాన్ని వ్యక్తం చేసింది. ☆

సమావేశాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టటానికి నిర్ణయం తీసుకొన్నారు. జాతీయ ఆరోగ్య మిషను ద్వారా ఉపకేంద్రాలకు విడుదల అయ్యే నిబంధితంకాని నిధుల వినియోగాన్ని పర్యవేక్షించటం, నిధుల సక్రమ వినియోగాన్ని ప్రోత్సహించటం చేయాలని నిర్ణయించారు.

☆ మహిళా శిశు సంక్షేమ శాఖ విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వులతో అంగను వాడీ వర్కర్లు తమ ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లనుందనే అపోహకు గురయ్యారని, అటువంటి భయాలు పెట్టుకోనవసరం లేదని, అంగనువాడీ కార్యకలాపాలను సమీక్షించే అధికారాలను మాత్రమే ప్రస్తుతం బదలాయించటం జరిగిందనే విషయంపై మంత్రివర్గ బృంద సభ్యులు చర్చించారు. ఈ విషయాన్ని ప్రచారం చేయాలని, అపోహల ను తొలగించాలని నిర్ణయించారు.

☆ మత్స్య శాఖ ద్వారా అమలు జరిగే కార్యక్రమాల లబ్దిదారుల ఎంపిక కార్యాక్రమాలు గ్రామ సభ ద్వారా జరిగే విధంగా మరొక్క మారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు.

☆ వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ బదలాయించిన అంశాలలో వివాదాస్పదమైన అంశాలేమీ యధాతథంగా అమలు చేయవచ్చని నిర్ణయించారు.

పంచాయతీ రాజ్ సంస్థలకు మిగిలిన 19 శాఖల అంశాలకు సంబంధించిన విధులను, అధికారాలను బదలాయించటానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని పంచాయతీ రాజ్ శాఖామాత్యులు శ్రీ బొత్స సత్యనారాయణ తెలియచేసారు. దశల వారీగా అధికారాల బదలాయింపు చేపడతామని, తొలివిడతగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమానికి సంబంధించిన 5600 కోట్ల రూపాయల పనులను చేపట్టే పూర్తి బాధ్యతను అంటే ప్రణాళికలు రూపొందించటం మొదలు ప్రణాళికలు అమలు చేయటం, పథకం అమలు పర్యవేక్షించటం వంటి పనులను పంచాయతీ రాజ్ సంస్థలకు అప్పగించటం జరిగిందని, దశల వారీగా మిగిలిన శాఖలలో కూడా ఇదే విధంగా అధికారాల బదలాయింపు చేపడతామని ఆయన తెలియచేసారు. మంత్రివర్గ సహచరులతో తరచుగా సమావేశమై అధికారాల బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలియ చేసారు.

10 శాఖలలో బదలాయించిన అధికారాలను క్షేత్రస్థాయిలో ఉపయోగించుకొని గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సక్రమంగా చేరేలా పంచాయతీరాజ్ సంస్థలు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని ఆయన సూచించారు.

*– డా.వి. శివశంకర ప్రసాద్*
*జూనియర్ ఫ్యాకల్టీ, సిడిపిఎ, అపార్డు*

# గ్రామాలకు ప్రాధాన్యం ఇచ్చిన కేంద్ర బడ్జెట్

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రోజుకి రూ. 100 కూలి**

యూపీఏ ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టిన తరువాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లోనూ తను పంథాను కొనసాగించింది. గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేసింది. జాతీయ ఉపాధి హామీ పథకం, భారత్ నిర్మాణ్ వంటి కీలక పథకాలకు కేటాయింపులు గణనీయంగా పెంచింది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయలను మరింత అభివృద్ధి చేయాలని సంకల్పించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, మౌలిక వసతులను భారీ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. అంతర్జాతీయ ఆర్థికమాంద్యం ప్రభావం మన దేశంపై కూడా కొంతపడిన దృష్ట్యా, మన సమీకృత అభివృద్ధి పై దృష్టి కేంద్రీకరిస్తూ, సామాన్య ప్రజల సంక్షేమానికి బాటలు పరుస్తూ, ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో 6.7 శాతానికి తగ్గిపోయిన

## గ్రామీణ ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం

కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణ ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆరోగ్య మిషన్, బీమా యోజన, స్మార్ట్‌కార్డులు వంటి పథకాలకు భారీ నిధులు కేటాయించటం ద్వారా గ్రామీణ రంగానికి అధిక వాటా కల్పించారు. బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి రూ. 21,113.33 కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. గత బడ్జెట్‌తో పోలిస్తే, ఇది సుమారు రూ.4 వేల కోట్లకు పైగానే ఈ సారి పెరిగింది.

గ్రామీణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్ ఆర్ హెచ్ ఎం) కు రూ.2,057 కోట్ల మేర కేటాయింపులూ పెరిగాయి. 'అందరికీ ఆరోగ్యం' లక్ష్యసాధనలో ఈ పథకమే కీలకమని శ్రీ ప్రణబ్ ముఖర్జీ అభివర్ణించారు.

☆ ఆరోగ్య రంగంలో మౌలిక సౌకర్యాల అభివృద్ధి విషయంలో అట్టడుగున ౹ాన్న 18 రాష్ట్రాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. ఇందులో... అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, బీహార్, చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, జమ్మూకాశ్మీర్, మణిపూర్, మిజోరం, మేఘాలయ, మధ్యప్రదేశ్, నాగాలాండ్, ఒరిస్సా, రాజస్థాన్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లు ఉన్నాయి.

☆ ఉన్నత స్థాయి వైద్య సంస్థల్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంలో భాగంగా ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ తరహాలో దేశవ్యాప్తంగా మరో ఆరు వైద్య విజ్ఞాన కేంద్రాలను నెల కొల్పాలని నిర్ణయించారు. 2010-11 నాటికి ఇవి పని చేయటం మొదలు పెడతాయి. ఈ ప్రాజెక్టు కోసం రూ. 1,447.92 కోట్లు కేటాయించారు. పాట్నా, రాయ్‌పూర్, భోపాల్, భువనేశ్వర్, జోథ్‌పూర్, రిషికేష్‌లలో ఇవి ఏర్పాటవుతాయి.

☆ వినికిడి లోపం నివారణ, నియంత్రణ జాతీయ కార్యక్రమానికి (ఎన్‌పీపీసీడీ) రూ. 10 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా వచ్చే రెండేళ్లలో దేశంలోని 25 జిల్లాల్లో అమలు చేస్తారు. ఇందులో భాగంగా వినికిడి లోపాన్ని నివారించటం, సమస్యను తొలిదశలోనే గుర్తించటం, వినికిడి లోపానికి దారితీసే చెవి సమస్యల నిర్ధారణ, చికిత్స వంటివి ఈ కార్యక్రమంలో అమలు చేస్తారు.

☆ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నేతృత్వంలో వైద్య, నర్సింగ్, ఇతర శిక్షణ సంస్థల ఏర్పాటు కోసం రూ.100 కోట్లు కేటాయించారు. వీటిలో ప్రవేశాలకు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించారు.

☆ భారత వైద్య విధానం- ఆయుర్వేద వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఆయుష్ శాఖకు రూ. 734 కోట్లు కేటాయించారు.

☆ గత ఏడాది ప్రారంభించిన రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్‌ఎస్‌బీవై) కు నిధుల కేటాయింపును 40 శాతం పెంచారు.

☆ ఇన్‌ఫ్లూయెంజా టీకాతోపాటు 9 రకాల ప్రాణాధార మందుల పై సుంకాలను 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. ఈ వ్యాధుల్లో రొమ్ము క్యాన్సర్, హెపటైటిస్‌బీ, రుమాటిక్ ఆర్థ్రోటిస్ వంటివి ఉన్నాయి. వీటితోపాటు గుండె చికిత్సలో ఉపయోగించే కొన్ని పరికరాల పైనా 7.5 శాతం నుంచి 5 శాతానికి సుంకం తగ్గించింది. ☆

**ఆర్థికాభివృద్ధిని మళ్లీ 9 శాతానికి పునరుద్ధరించటం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ ప్రణబ్‌ముఖర్జీ ప్రకటించారు. ఆయన జులై 6వ తేదీన 2009-10 సంవత్సరానికి వెల్లడించిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఏటా కోటీ 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యమని చెప్పారు.**

దేశంలో 60 శాతం మంది ప్రజలు ఆధారపడి ఉన్న వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. ఈ ఏడాది 3.25 లక్షల కోట్ల రూపాయలను వ్యవసాయ రుణాలుగా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 2008-09 బడ్జెట్‌లో ప్రకటించిన రూ. 71,000 కోట్ల వ్యవసాయ రుణ మాఫీ పథకాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు తెలిపారు. నాలుగు కోట్ల మందికి ప్రయోజనం కల్పించిన ఈ పథకం ఈ ఏడాది జూన్‌తో ముగియగా, రుతుపవనాల్లో జాప్యం, వర్షాలు కురవటంలో ఆలస్యం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని డిసెంబర్ వరకూ పొడిగిస్తున్నట్లు వివరించారు. రుణాలు సకాలంలో తిరిగి చెల్లించే రైతులకు వడ్డీ ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో దాదాపు ఒకటిన్నర రెట్లు (144 శాతం) నిధులు పెంచారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 39,100 కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద కార్మికులకు దినసరి కనీస వేతనం రూ. 100 ఖచ్చితంగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయం, అటవీ, నీటి, భూవనరులు, గ్రామీణ రహదారులకు సంబంధించిన పనులను కూడా జాతీయ ఉపాధి హామీ పథకం కిందకు చేర్చాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఇందుకోసం తొలిదశలో మొత్తం 115 పైలట్ గ్రామాలను ఎంపిక చేయనున్నారు.

ఉపాధి హామీ పథకం విస్తరణకు సంబంధించిన వివరాలు, మార్గదర్శకాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సిద్ధం చేస్తుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 4.47 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని శ్రీ ప్రణబ్ ముఖర్జీ తెలిపారు. గ్రామీణ రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఆరు అంశాలను చేపట్టే భారత్ నిర్మాణ్ పథకానికి జరిపిన కేటాయింపులు కూడా గత ఏడాదితో పోలిస్తే 45 శాతం ఎక్కువని ఆయన తెలిపారు. సాగునీటి పథకాల వేగవంతానికి అదనంగా రూ. 1000 కోట్లు కేటాయించారు. జాతీయ గృహ నిర్మాణ బ్యాంక్ రూ. 2,000 కోట్లతో గ్రామీణ గృహనిర్మాణ నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు 74 శాతం నిధులు పెంచుతూ రూ. 1,740 కోట్లు కేటాయించారు. జులై నుంచి 12 లక్షల మంది జవాన్లు, జేసీఓలకు కొత్త పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం రూ. 4,000 కోట్లతో నిధిని ఏర్పాటు చేశారు. రైల్వేలకు రూ. 15,800 కోట్లు కేటాయించారు.

## కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

**కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ ప్రణబ్ ముఖర్జీ జులై 6, 2009 రోజున పార్లమెంటులో సమర్పించిన 2009-2010 బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేశారు.**

- గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ. 39,100 కోట్లు కేటాయింపు అంటే గత సంవత్సరం కంటే 144 శాతం ఎక్కువ. దీనితో 4.74 కోట్ల కుటుంబాలకు ఉపాధి కలుగుతుంది.
- ఈ పథకాన్ని 115 జిల్లాల్లో మిగిలిన గ్రామీణాభివృద్ధి పథకాలతో సమన్వయం చేయబడుతుంది.
- ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యువజన పథకం రూ. 100 కోట్లతో కొత్తగా ప్రారంభం.
- రైతు ఋణ మాఫీ పథకం పొడిగింపు.
- కిలో 3 రూపాయలకే బియ్యం/గోధుమలు - దారిద్ర్య రేఖకు దిగువ నున్న కుటుంబాలకు నెలకు 25 కిలోలు.
- ఆహార భద్రత (హామీ) బిల్లును త్వరలో ప్రచురించి అందరి సలహాలు తీసుకుంటారు.
- జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు రూ. 1500 కోట్ల కేటాయింపు.
- గ్రామీణ రోడ్లకు రూ. 1200 కోట్లు కేటాయింపు.
- రాజీవ్ గాంధీ గ్రామీణ విద్యుదీకరణకు రూ. 7000 కోట్ల కేటాయింపు.
- సత్వర సాగునీటి ప్రయోజన పథకానికి మరో వెయ్యి కోట్ల రూపాయలు
- గ్రామీణ గృహ నిర్మాణానికి జాతీయ గృహ బ్యాంకుకు రూ. 2000 కోట్లు.
- గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు కోసం రూ. 100 కోట్లు.
- వ్యవసాయ ఋణాలకు రూ. 2.8 లక్షల కోట్లు.
- రాష్ట్రీయ స్వాస్థిక బీమా యోజన పథకం క్రింద దారిద్ర్య రేఖకు దిగువనున్న అన్ని కుటుంబాలకు వర్తింపు.
- ప్రాథమిక విద్యకు రూ. 29,099 కోట్లు.
- సర్వ శిక్షా అభియాన్, మధ్యాహ్న భోజనానికి రూ. 13 వేల కోట్లు.
- మహిళా అక్షరాస్యత మిషన్ ఏర్పాటు చేసి వచ్చే మూడేళ్ళలో మహిళా అక్షరాస్యత శాతం గణనీయంగా పెంచేందుకు కృషి.
- గ్రామీణ ప్రాంతాల్లో 50% మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్చటం.
- ప్రతి పౌరుడికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో బహుళ ప్రయోజన కార్డులు.

*సేకరణ : డా॥ వి.ఎస్.వి.కె. శాస్త్రి*
*సెంటర్ హెడ్, మీడియా & పబ్లికేషన్స్*

## మన 'ఆరోగ్యశ్రీ' తరహాలో...

మన రాష్ట్రంలో అమలవుతున్న ఆరోగ్యశ్రీ పథకం తరహాలోనే పేద ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం వైద్యసేవలు పొందే అవకాశం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సైతం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేక హెల్త్ కార్డుల్ని అందిస్తారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు ఈ కార్డులు ఇస్తారు. 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 46 లక్షల కుటుంబాలకు ఈ బయోమెట్రిక్ స్మార్ట్ కార్డుల్ని పంపిణీ చేస్తారు. ఈ కార్డులతో ఎన్నో ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందే అవకాశం దక్కుతుంది. ఈ పథకం అమలుకు రూ. 350 కోట్లు కేటాయించారు. దారిద్ర్య రేఖ దిగువనున్న అన్ని కుటుంబాలనూ ఈ పథకం పరిధిలోకి తీసుకు రావాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పంగా శ్రీ ప్రణబ్ ముఖర్జీ చెప్పారు. ☆

## మన రెండు రూపాయల కిలో బియ్యం పథకంపై తగ్గనున్న భారం

ఆహార భద్రత కింద దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న తెల్లకార్డుదారులకు కిలో రూ. మూడుకే బియ్యం పంపిణీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఏడాదికి రూ. 278.80 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం ప్రయోజనం పొందే అవకాశం ఉంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న కిలో రూ.రెండు బియ్యం పథకంపై రాయితీ భారం తగ్గనుంది. రాష్ట్రంలో తెల్లకార్డుదారుల సంఖ్య 2.03 కోట్లు.

- గులాబీ కార్డుదారుల సంఖ్య 26 లక్షలు.
- రూ. 2 కిలో బియ్యం లబ్ధిదారుల సంఖ్య 1.83 కోట్లు.
- రెండు రకాల కార్డులకు కలిపి కేంద్రం ప్రతి నెలా సరఫరా చేస్తున్న బియ్యం 3.27 లక్షల మెట్రిక్ టన్నులు.
- తెల్లకార్డు దారుల కోసం సరఫరా చేసే బియ్యం టన్ను రూ. 5,650; గులాబీ కార్డుదారులకు ఇచ్చే బియ్యం ధర టన్ను రూ. 8,300.
- గులాబీ కార్డుదారులకు ఇచ్చే బియ్యాన్ని రాష్ట్ర సర్కారు తెల్లకార్డుదారులకు సరఫరా చేస్తోంది.
- కేంద్రం లెక్క ప్రకారం రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల సంఖ్య 40 లక్షలే.
- కేంద్రం వారికి ప్రతి నెలా సరఫరా చేసే బియ్యం 87,674 టన్నులు.
- కొత్తగా అమల్లోకి రాబోయే ఆహార భద్రత చట్టం కింద టన్ను బియ్యం రూ. 3 వేలకే సరఫరా చేయనుంది.
- ఈ మేరకు అంటే టన్నుకు దాదాపు రూ. 2,500 భారం రాష్ట్రంపై తగ్గే అవకాశం ఉంది. ఏడాదికి దీనివల్ల రూ. 278.80 కోట్ల భారం తగ్గుతుంది.
- రాష్ట్ర రాయితీ భారంలో దీన్ని తీసేస్తే గరిష్ఠంగా రూ.3,266 కోట్లను భరించాల్సి ఉంటుంది.
- రాష్ట్రంలో లబ్ధిదారులు ఎక్కువగా ఉన్నందున నెలకు 87 వేల మెట్రిక్ టన్నులు కాకుండా, రెండులక్షల మెట్రిక్ టన్నుల వరకు కిలో రూ.3 కు సరఫరా చేయాలని రాష్ట్ర సర్కారు కేంద్రాన్ని కోరుతోంది. ☆

### సామాన్య ప్రజల సంక్షేమం

జాతీయ ఆహార భద్రత చట్టం త్వరలో అమలు చేస్తామని, పేద కుటుంబాలకు నెలకు 25 కిలోల బియ్యం, గోధుమలను కిలో మూడు రూపాయలకే అందిస్తామని శ్రీ ప్రణబ్ ముఖర్జీ ప్రకటించారు. దారిద్ర్యరేఖకు దిగువన వాన్న కుటుంబాలన్నింటికీ రాష్ట్రీయ స్వస్తి బీమా (ఆరోగ్య బీమా) అమలు చేస్తామని చెప్పారు. దేశాన్ని మురికివాడల రహిత దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో త్వరలో రాజీవ్ అవాస్ యోజన పథకం ప్రవేశపెడతామన్నారు. ఆరేళ్ల వయసులోవున్న పిల్లలందరికీ 2012 సంవత్సరానికల్లా సమీకృత శిశు అభివృద్ధి సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు.

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద కేటాయింపులను రూ.12,000 కోట్లకు పెంచుతున్నామని, స్వర్ణ జయంతి స్వరోజ్‌గార్ యోజన పథకం పేరును. జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకంగా మారుస్తున్నట్లు శ్రీ ప్రణబ్ ముఖర్జీ తెలిపారు. ఈ పథకం ద్వారా పేదరిక నిర్మూలన పథకాలను మరింత శ్రద్ధగా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటారు. ఇందుకు తగ్గట్టుగానే రానున్న ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో కనీసం 50 శాతం మంది స్వయం సహాయక గ్రూపుల్లో చేరేలా ప్రయత్నాలు చేస్తారు. గ్రామీణ వృత్తి కళాకారుల నైపుణ్యాన్ని పెంచేందుకు బెంగాల్, రాజస్థాన్‌లలో మెగా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు.

### అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత

అసంఘటిత రంగమే దేశంలోని మొత్తం కార్మిక శక్తిలో 92 శాతానికి ఉపాధిని కల్పిస్తోంది. ఏటేటా పెరుగుతున్న శ్రామిక శక్తిని ఇముడ్చుకుంటున్న రంగం కూడా అదే. అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత బిల్లు-2007కు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం కూడా లభించింది. నేతపని వారు, మత్స్యకారులు, మహిళలు. తాటిగీత పనివారు.తోళ్లు, చేతివృత్తుల కార్మికులు, ప్లాంటేషన్ కూలీలు, నిర్మాణ రంగ కూలీలు, గని పనివారు, బీడీ కార్మికులు, రిక్షా కార్మికులు తదితరుల కోసం ప్రభుత్వం ఇప్పటికే పలు సామాజిక భద్రతా పథకాలను ప్రారంభించింది. ఆ పథకాలకు కావాల్సిన నిధులను మంజూరు చేస్తామని శ్రీ ప్రణబ్ ముఖర్జీ తెలిపారు.

దేశంలో ఎస్సీ వర్గాల ప్రజలు 50 శాతం కంటే ఎక్కువ ఉన్న గ్రామాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో రూ. 44 వేల కోట్లు కేటాయించారు. 'ప్రధాన్ మంత్రి ఆదర్శ్ గ్రామ్ యోజన' ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఈ ఏడాది పైలెట్ ప్రాజెక్టు కింద వెయ్యి గ్రామాలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపడతారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. వంద కోట్లు కేటాయించారు.

### గ్రామీణ రోడ్లకు మహర్దశ

ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎమ్‌జీఎస్‌వై) పథకం కింద గ్రామీణ రహదార్ల అభివృద్ధికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 12,000 కోట్లు కేటాయించారు. ఇది, గత ఏడాది బడ్జెట్ (అంచనా) కంటే 59 శాతం ఎక్కువ. ఇందులో రూ. 1,067 కోట్లను ఈశాన్య భారతం కోసం ప్రత్యేకించారు.'భారత్ నిర్మాణ్' కింద 1,46,185 కిలోమీటర్ల రోడ్లను నిర్మించాలని తలపెట్టినట్టుగా ఆర్థికమంత్రి శ్రీ ప్రణబ్ తెలిపారు. వెయ్యికి పైగా (ఆదివాసి లేదా కొండ ప్రాంతాలలో 500కు పైగా) జనాభా ఉన్న అన్ని గ్రామాలకు, 2009 నాటికి, అన్ని కాలాలలోనూ నిలిచే రహదార్లను నిర్మించాలనే సంకల్పంతో 'భారత్ నిర్మాణ్'ను ప్రారంభించారు. ఆ బృహత్ పథకంలో భాగంగా ఉన్న ఆరు పథకాలలో పీఎమ్‌జీఎస్‌వై ఒకటి. పొలం

నుంచి మార్కెట్టుకు రహదారి సంబంధాలను నెలకొల్పే లక్ష్యంతో ఇప్పటికే ఉన్న అనుబంధ మార్గాలను 1,94,132 కి.మీ.ల మేరకు ఆధునీకరించడానికి బడ్జెట్‌లో మరో రూ. 48,000 కోట్ల కేటాయించారు.

ఇవిగాక, నాబార్డ్‌కు అనుబంధంగా ఉన్న గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి ద్వారా పీఎమ్‌జీఎస్‌వైకి రూ. 6,500 కోట్లు అందించాలని నిర్ణయించారు. పీఎమ్‌జీఎస్‌వై కింద వివిధ రాష్ట్రాలలో రెండు విదేశీ సహాయ ప్రాజెక్టులు అమలవుతున్నాయి. గ్రామీణ రహదార్ల రంగం ప్రాజెక్ట్-1, గ్రామీణ రహదార్ల రంగం ప్రాజెక్ట్-2 అనే ఆ రెండు ప్రాజెక్టులకు వరుసగా ఆసియా అభివృద్ధి బ్యాంకు ఆర్థిక సాయం అందిస్తున్నాయి.

### గ్రామాల విద్యుత్‌కు అదనంగా ఏడు వేల కోట్లు

గ్రామీణ ప్రాంతాల విద్యుదీకరణకు ఉద్దేశించిన పథకం రాజీవ్‌గాంధీ గ్రామీణ్ విద్యుదీకరణ యోజన (ఆర్‌జీజీవీవై) కు ఈ ఏడాది బడ్జెట్‌లో అదనంగా రూ. ఏడు వేల కోట్లు కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 27 శాతం ఎక్కువ. దేశంలో విద్యుత్తు సౌకర్యం లేని గ్రామాల్లోని ప్రతి ఇంటికీ విద్యుత్తు అందించేందుకు 2005లో ఆర్‌జీజీవీవైను ప్రారంభించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ అందిస్తారు.

90 శాతం నిధులను ప్రభుత్వం గ్రాంట్‌గా అందిస్తే, మిగిలిన పది శాతాన్ని ఈ పథకానికి నోడల్ ఏజన్సీగా పనిచేస్తున్న గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ రుణ రూపేణా అందజేస్తుంది. ఆర్‌జీజీవీవై కింద ఇప్పటివరకూ 47,826 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. 22.93 లక్షల బీపీఎల్ కుటుంబాలకు విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. 130 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు.

– ఆర్.కె.

## అర్ధ రూపాయి వడ్డీకే రైతులకు రుణాలు

రుణాలు సకాలంలో చెల్లించే రైతులకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త ప్రోత్సాహకాలు ప్రకటించింది. రుణాలపై చెల్లించే వడ్డీలో ఒక శాతం వరకూ సబ్సిడీ కల్పించింది. ఫలితంగా రైతులకు అర్థరూపాయి వడ్డీకే రుణాలు లభించనున్నాయి. రుణాలు సకాలంలో చెల్లించలేని రైతులకు రూ. మూడు లక్షల వరకూ ఏడు శాతం వడ్డీతో రుణాలివ్వడాన్ని కొనసాగిస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. "స్వల్పకాలిక పంట రుణాలు సకాలంలో చెల్లించే రైతులకు ఈ ఏడాది వడ్డీరేట్లలో ఒక శాతం సబ్సిడీ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపేందుకు సంతోషిస్తున్నాను. దీనివల్ల ఆరు శాతం వడ్డీకే రైతులకు రుణాలు లభిస్తాయి" అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రణబ్ ముఖర్జీ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా తెలిపారు.

రైతు రుణాల సబ్సిడీని భరించేందుకు మధ్యంతర బడ్జెట్‌లో కేటాయించిన మొత్తానికి అదనంగా ఈ బడ్జెట్‌లో రూ. 411 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రణబ్ ప్రకటించారు. వడ్డీరేట్లపై సబ్సిడీని ప్రకటించడంతో పాటు ప్రణబ్ ముఖర్జీ రైతులకు అందుబాటులోకి రానున్న రుణాల లక్ష్యాన్ని కూడా గణనీయంగా పెంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ. 3.25 లక్షల కోట్లు రుణాలుగా ఇవ్వాలని నిర్ధారించారు. ఇది గత ఏడాది కంటే రూ. 38 వేల కోట్లు అధికం.

### సాగునీటి రంగానికీ పెరిగిన కేటాయింపులు

2009-10 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం సాగునీటి, రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకాలకు కేటాయింపులూ గణనీయంగా పెంచింది. ఏఐబీపీ కింద సాగు నీటి ప్రాజెక్టులకు రూ. వెయ్యి కోట్ల అదనంగా (మధ్యంతర బడ్జెట్ కేటాయింపులకు) కేటాయిస్తున్నట్లు ప్రణబ్ తెలిపారు. ఇది గత ఏడాది బడ్జెట్ అంచనాల కంటే 75 శాతం ఎక్కువ కావడం గమనార్హం. వ్యవసాయ రంగంలో రాష్ట్రాల పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఆర్‌కేవీవై పథకానికి గత ఏడాది కంటే 30 శాతం అదనంగా రూ. 3,165 కోట్లు కేటాయించారు. ప్రణాళికా కేటాయింపులు పెరగడం వల్ల వ్యవసాయ రంగంలో 2004-2008 మధ్య కాలంలో ఏటా నాలుగు శాతం వృద్ధిరేటు చేసుకునేందుకు 2009-10లోనూ ఇది కొనసాగుతుందని ప్రణబ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఎరువుల సబ్సిడీలో మార్పులు

ఎరువుల వాడకంలో సంతులనాన్ని సాధించే ఉద్దేశంతో ప్రభుత్వం, ఎరువులపై ఇచ్చే సబ్సిడీలలో మార్పులు చేర్పులకు శ్రీకారం చుట్టింది. పోషకాల ఆధారిత సబ్సిడీలు ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి శ్రీ ప్రణబ్ ముఖర్జీ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ధరల ఆధారిత సబ్సిడీలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం తీసుకుంటున్న తాజా చర్యల ఫలితంగా వినూత్న ఎరువులు చౌకగా అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నట్లు శ్రీ ప్రణబ్ తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న ధరల నియంత్రణ పద్ధతి కింద, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కీలకమైన ఎరువులను అమ్ముతున్నందుకు పరిహారంగా ఉత్పత్తి ప్రాతిపదికగా సబ్సిడీలను చెల్లిస్తున్నారు.

ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ రిటైల్ ధరకు అమ్మితే, పోషక పదార్థాల కోసం ఎరువుల ఉత్పత్తిదారులు చేసే వాస్తవ వ్యయంలో కేవలం 15 శాతం మాత్రమే సబ్సిడీ ద్వారా తిరిగి వస్తోందని అధికారిక అంచనా. ప్రభుత్వం ఇప్పుడు ఎరువుల ధరల నియంత్రణకు స్వస్తి పలికి, ఎరువులపై సబ్సిడీని అందిస్తుంది. ముందు ముందు ఈ సబ్సిడీని నేరుగా ఎరువులను ఉపయోగించే రైతులకే అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2008-09 సంవత్సరంలో ప్రభుత్వం ఎరువుల రంగానికి అందించిన సబ్సిడీలు 1,17,000 కోట్ల రూపాయలకు చేరాయి. అంతకు ముందటి ఏడాది అవి 45,659 కోట్ల రూపాయలు మాత్రమే. ☆

# పంచాయితీరాజ్ సంస్థల్లో జవాబుదారీతనం పెంచటం ఎలా?

**భారత రాజ్యాంగం 73వ సవరణ ముందు, పంచాయితీ రాజ్ సంస్థలు కొంచెం అటు ఇటుగా ఏజన్సీ పాత్రను పోషిస్తుండేవి. ప్రస్తుతం రాజ్యాంగం (ఆర్టికల్ 243-జి) 'బదలాయింపు' కల్పిస్తోంది. అంటే పంచాయితీరాజ్ సంస్థలను స్వయం పాలనా సంస్థలుగా బలోపేతం చేయటం జరుగుతోంది.**

*తద్వారా ఈ సంస్థలు . . .*

☆ తమ నిర్ణీత రంగాల్లో ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ప్రణాళికల రూపకల్పన చేసుకోవటానికి.

☆ తమ నిర్ణీత రంగాల్లో ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయాలకు సంబంధించిన కార్యక్రమాల అమలు వంటి రెండు లక్ష్యాల కోసం స్వయంపాలన సంస్థలుగా పంచాయితీరాజ్ సంస్థలు పని చేసేందుకు ఈ అధికారాల బదలాయింపు వీలు కల్పిస్తుంది.

*పంచాయిత్‌రాజ్ సంస్థల ఉద్దేశాలు*

☆ ప్రజాస్వామిక వికేంద్రీకరణ ఆధారంగా ప్రాచుర్యం గల పరిపాలన కోసం సంస్థాగత నిర్మాణాన్ని అందించటం

☆ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించటం.

పంచాయిత్‌రాజ్ సంస్థలకు అధికారాలు, నిధుల బదలాయింపులో వీటి కార్యనిర్వాహక బాధ్యత గణనీయంగా పెరుగుతుంది. దీనికి ఒక వైపు పంచాయిత్‌రాజ్ సంస్థల సామర్థ్య నిర్మాణం, మరోవైపు అవి జవాబుదారులుగా వుండేలా చేయటం అవసరమవుతుంది.

సమర్థంగా సేవలు అందేలా చూసేందుకు పంచాయత్‌రాజ్ సంస్థల పనితీరును దగ్గరనుండి పర్యవేక్షించాలి. క్షేత్ర స్థాయి ప్రణాళిక మీద నిపుణుల కమిటి నివేదిక ప్రకారం పంచాయితీరాజ్ సంస్థలకు జవాబుదారీతనం బాధ్యతలో దిగువ పేర్కొన్న ప్రాథమిక అంశాలు ఉండాలి.

☆ పంచాయితీలు కార్యకలాపాలు, సమావేశాల నిర్వహణకు సంబంధించి పంచాయిత్ రాజ్ చట్టం, నిబంధనలు.

☆ ప్రణాళికల ఆమోదం, లబ్దిదారుల ఎంపిక, ప్రణాళిక అమలు పర్యవేక్షణ, చెల్లింపుల ఆమోదం తదితర అంశాల్లో గ్రామ సభలకు అధికారాలు కల్పించటం.

☆ సామాజిక తనిఖీకి సంస్థాగత నిర్మాణం

☆ పంచాయితీల అకౌంటింగ్, బడ్జెట్‌కు స్పష్టమైన వ్యవస్థ

☆ సమాచార హక్కు, నిర్ణీత వ్యవధిలో సమాచారాన్ని బహిర్గతం చేయటం.

☆ అంబుడ్స్‌మెన్ తరహా అథారిటీ కోసం చట్టపరమైన చర్యలు.

అయితే స్థానిక సంస్థల సాధారణ జవాబుదారీ చట్టంలో దిగువ పేర్కొన్న (5) అంశాలు వుంటాయి.

**1) ప్రణాళిక, బడ్జెటింగ్ 2) నిర్వహణ లక్ష్యాలు**

**3) అకౌంటింగ్, పర్యవేక్షణ, నివేదిక సమర్పణ**

**4) బహిర్గత పరిశీలన 5) సామాజిక తనిఖీ**

***1. ప్రణాళిక, బడ్జెటింగ్*** : స్థానిక ప్రాంతాన్ని సమీకృతంగా, భాగస్వామ్య రీతిలో సమన్వయంలో అభివృద్ధి చేయటమే ప్రణాళిక లక్ష్యం. ఒక ప్రణాళికలో పరస్పరంగా ఒకదాని మీద ఒకటి ఆధారపడే రీతిలో పలు కార్యక్రమాలు ఉంటాయి. అందుబాటులో ఉన్న వనరులు అత్యధికంగా వినియోగమయ్యేందుకు సరైన ప్రణాళిక అవకాశం కల్పిస్తుంది. నిర్ణీత కాల వ్యవధిలో పంచాయిత్‌రాజ్ సంస్థలు రూపకల్పన చేసిన కార్యక్రమాల అమలుకు వనరులను ఎలా ఏటాయించాలి అనేది ఖరారు చేసే అభ్యాసమే (ప్రక్రియ) బడ్జెటింగ్. దీర్ఘ కాలిక ప్రాధాన్యాలను గుర్తించి వాటిని ఆశించిన మేర ఫలితాలతో అనుసంధానం చేసేందుకు పంచాయిత్‌రాజ్ సంస్థల్లో ప్రణాళికా ప్రక్రియ తోడ్పడుతుంది.

ఆర్థిక, ఆర్థికేతర నిర్వహణ, సమాచారాన్ని సమగ్రంగా ఉపయోగించుకునే బడ్జెట్‌నే పనితీరు ఆధారిత బడ్జెటింగ్ అంటారు.

***పంచాయిత్ రాజ్ సంస్థలు దిగువ పేర్కొన్న అంశాలను చేపట్టేందుకు–***

☆ ఆర్థిక కార్యకలాపాలు, నిర్వహణ పనితీరు మధ్య స్పష్టమైన సంబంధం ఏర్పాటు చేయడం

☆ ఉన్నతాధికారులు, ప్రజలకు ఆర్థిక సమాచారానికి సంబంధించిన సమగ్ర వివరాలను తెలపటం

☆ ప్రజా సేవ దృక్పధంతో పనితీరు స్పృహ కల్పించేందుకు తోడ్పడటం

☆ పారదర్శకతను పెంపొందించటం

అందువలన పంచాయిత్‌రాజ్ సంస్థల వార్షిక ప్రణాళికలను నిర్వహణ బడ్జెట్‌తో కలిపి ఒకే ఒక డాక్యుమెంటుగా రూపొందించవలసిన అవసరముంది.

☆ ప్రణాళికల్లో 'వాస్తవికత' ఉండేలా చూడటం

☆ ఆర్థిక, నిర్వహణ పనితీరు మధ్య జవాబుదారీతనం

☆ ఆమోదం పొందిన ప్రణాళికలకు బడ్జెట్ సమాచారం అంటే ఆదాయం, మూలధన వ్యయాలను అనుసంధానం చేయడం.

**2. నిర్వహణ లక్ష్యం :** సమర్థమైన సేవలందించేందుకు పంచాయితీరాజ్ సంస్థలు తాము చేపట్టిన కార్యకలాపాల నుండి ఆశించిన ఫలితాలు ఖచ్చితంగా గుర్తించాలి. ఇందుకు నిర్వహణ లక్ష్యాలను స్పష్టం చేయటం, సాధించిన విజయాలను కొలిచేందుకు 'మాట్రిక్స్' ను నిర్దేశించటం వుంటాయి. పంచాయత్‌రాజ్ సంస్థలకు, పంచాయిత్‌రాజ్ సిబ్బందికి నిర్వహణ లక్ష్యాలు ఉండాలి.

☆ ఆర్థిక కార్యకలాపాలు, నిర్వహణ పనితీరు మధ్య స్పష్టమైన సంబంధాన్ని నిర్వహణ లక్ష్యాలు ఏర్పాటు చేస్తాయి.

☆ ప్రభుత్వ కార్యకలాపాలతో సంబంధం ఉన్న భౌతిక సమాచారాన్ని సమగ్ర రూపంతో అందిస్తాయి.

☆ పారదర్శకత పెంపొందించటం

☆ నిర్వహణ తనిఖీకి వీలు కల్పించడం,

అందువలన, పంచాయిత్‌రాజ్ సంస్థల నుండి పారదర్శకమైన వాస్తవికమైన ప్రస్తుత నిర్వహణ సమాచారాన్ని ఐ.సి.టి ఉపకరణాల ద్వారా రాబట్టుకునేందుకు ఆ సంస్థలలో నిర్వహణ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన అవసరముంది.


అదే విధంగా కార్యక్రమాల లక్ష్యాలు ఏవిధంగా నేరవేరుతున్నాయి, సమర్థమైన ఆర్థిక నైపుణ్య రీతిలో కార్యక్రమాలు అమలువుతున్నాయో లేదా నిర్ధారించేందుకు నిర్వహణ ఆడిట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా కార్యక్రమాలు, కార్యకలాపాలను అంచనా వేయవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు, వాటి ప్రయోజనాలు మెరుగైన రీతిలో లబ్ధిదారులకు చేరేందుకు కొన్ని నిరిష్ట సమాచార అవసరాలు వుంటాయి. పౌరులకు మెరుగైన, సమ్మిళితమైన రూపంలో సేవలందించేందుకు ఒక చక్కటి సాధనంగా ఐ.సి.టి (సమాచారం మరియు కమ్యూనికేషన్ టెక్నాలజి)ను పరిగణించాలని 2004 డిసెంబర్‌లో జరిగిన పంచాయితీరాజ్ మంత్రుల 7వ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. అందువలన పంచాయితీ రాజ్ సంస్థల పనితీరును దగ్గర నుండి పర్యవేక్షించటానికి ఐ.సి.టిని గ్రామస్థాయి వరకు విస్తరించేందుకు కృషి జరుగుతోంది.

**3. అకౌంటింగ్, పర్యవేక్షణ, నివేదిక సమర్పణ (రిపోర్టింగ్) :** సమగ్రమైన, జాప్యంలేని ఆర్థిక సమాచారం అందుబాటులో ఉండటం నైపుణ్యమైన మేనేజ్‌మెంట్‌కు చాలా అవసరం. సేవల నాణ్యత, నిధుల వినియోగం పర్యవేక్షణకు ఆర్థిక సమాచారం ఉపయోగపడుతుంది. పంచాయితీరాజ్ సంస్థల్లో సరైన అకౌంటింగ్ వ్యవస్థ ద్వారా బడ్జెట్ అమలు పర్యవేక్షణ, ఆర్థిక నియంత్రణ నిర్వహణకు వీలవుతుంది.

11వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే పంచాయిత్‌రాజ్ సంస్థల్లో కొత్త అకౌంటింగ్ వ్యవస్థను ఆమోదించింది. సిఎజి రూపొందించిన అకౌంట్స్ ఫార్మెట్లను అమలు చేసేందుకు స్వీకరించింది. ఎలక్ట్రానిక్ పద్ధతిని కొత్త అకౌంటింగ్ వ్యవస్థ నిర్వహణకు హైదరాబాదులోని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సాఫ్ట్‌వేర్ ప్యాకేజీని అభివృద్ధి చేసింది.

అడిట్, ఉన్నతాధికారులకు క్రమం తప్పకుండా సమర్పించేందుకు ప్రామాణిక రూపంలో అకౌంట్లను, ఆదాయం, ఖర్చులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రస్తుతం పంచాయిత్‌రాజ్ సంస్థలు క్రోడీకరించవలసి వుంటుంది.




**4. బహిర్గత పరిశీలన :** ప్రభుత్వ నిధులు గరిష్ట రీతిలో సమర్థంగా ఖర్చయ్యేలా చూసే బాధ్యత స్థానిక సంస్థల కార్యనిర్వాహక అధికారులదే.

జవాబుదారీ పాత్రను నెరవేర్చేందుకు పంచాయిత్‌రాజ్ సంస్థలు తమ అకౌంట్లను ఆడిట్ చేయించాలి. తద్వారా తమ కార్యాకలాపాలు ఖచ్చితమైనవని పూర్తయినవనే హామీ ఇవ్వగలగాలి.

ఆమోదించిన ప్రమాణాలను అతిక్రమించిన కేసులు, దుబారా, వ్యవస్థ లోపాలు లోటుపాట్లు మొదలైన వాటిని వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత బహిర్గత తనిఖీకి వుంటుంది. ప్రజలకు జవాబుదారీగా వుండేందుకు ఉన్నతాధికారులకు తనిఖీ ఉపయోగపడుతుంది.

స్థానిక సంస్థలు ప్రస్తుతం స్వపరిపాలనా సంస్థలయినందు వలన రాజ్యాంగ నిబంధనలు సూచించిన మేరకు రాష్ట్ర తనిఖీ విభాగం డైరక్టర్ విధులను పెంచవలసి వుంటుంది. పంచాయిత్‌రాజ్ సంస్థల్లో ఆర్థిక నిర్వహణను మెరుగుపరిచేందుకు సరైన అకౌంటింగ్ ఆడిటింగ్ ప్రమాణాల ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలి.

**5. సామాజిక తనిఖీ:** స్థానికంగా సేవలు వితరణను మెరుగుపరచటానికి సామాజిక తనిఖీ వ్యవస్థను సంస్థాగతం చేయవలసిన అవసరముంది. దిగువ పేర్కొన్న రెండు సూత్రాల మీద నైపుణ్యమైన సామాజిక తనిఖీ వ్యవస్థ ఆధారపడివుంది.

☆ సిటిజన్ చార్టర్ల ద్వారా సేవా ప్రమాణాలను ప్రజలకు తెలియపరుస్తారు.

☆ సేవలందించటం పూర్తవుతూనే వాటికి సంబంధించిన సమాచారాన్ని క్రమబద్ధంగా పౌరులకు తెలియపరచాలి.

సామాజిక తనిఖీ పౌరుల అవగాహనను పెంచుతుంది. పలు పథకాల అమలు క్రమబద్ధీకరణను కూడా ప్రభావితం చేస్తుంది.

సామాజిక తనిఖీపై తీసుకున్న కార్యాచరణ నివేదిక ఒక నిర్ణీత వ్యవధికి సంబంధించి వుండాలి. అలాగే ఆ నివేదికను ప్రజల మధ్యకు తీసుకువెళ్ళాలి. అధికారిక తనిఖీకి ముఖ్యమైన అనుబంధంగా చేయగలిగితే సామాజిక తనిఖీ సార్థకం అవుతుంది.

**ఎం.డి. తఖ్యుద్దీన్**

*అనువాదం : సుప్రశాంతి దేవి. డి*

# గురువులకు గురువు...
# జగద్గురువు శ్రీకృష్ణుడు



**భారతీయ సంప్రదాయంలో ప్రతి పండుగ వెనుకా ఓ ఆధ్యాత్మిక రహస్యం, దానితో పాటు సమాజానికి ఓ ఉపదేశం దాగి ఉంటుంది. అయితే దురదృష్టవశాత్తూ చాలా మంది పండుగ అనగానే పిండివంటల తిండి ధ్యాసలోనో, లేదా, ప్రత్యేక కార్యక్రమాల పేరిట వచ్చే వినోద కార్యక్రమాల మీదనో దృష్టిని కేంద్రీకరించి అసలు పండుగ అనే దాని ప్రాముఖ్యాన్ని గుర్తించలేకపోతున్నారు. దాంతో పెద్దలు మనకి అందించిన సంప్రదాయపు ఆస్తిని మనం దుర్వినియోగ పరచడంతో పాటు ఆ ఆస్తిని ఏమీ ఇయ్యలేని విధంగా తరువాతి వాళ్లని చేయడమే కాక, 'పండుగ' అనేగానే 'ఓ ఆట విడుపురోజు – కాలక్షేపం చేయదగిన రోజు' అనే తీరులో దాన్ని మార్చివేసాం. ఇది చెప్పలేనంత నేరం, మళ్లీ మాటాడితే ఘోరం కూడా. ఈ నేపథ్యంలో 'గురు పూర్ణిమ' గురించి కొంత ముచ్చటించుకుందాం!**

### మొదటి గురువు 'అమ్మ'

'గురు పూర్ణిమ' అంటే గురువుని ఆరాధించవలసిన పూర్ణిమ అనేది సామాన్యార్థం. ఆ క్రమంలో మొదటి గురువు ఎవరికైనా 'అమ్మ' మాత్రమే. లోకంలో ఉండే గురువులంతా తమ తమ శిష్యుల్ని తమ మాటకి అనుగుణంగా తీర్చిదిద్దుకుంటూండే వాళ్లవుతూంటే, మొట్టమొదటి గురువైన అమ్మ మాత్రం శిష్యునికి అనుగుణంగా తానుంటుంది.

*ఎలాగట?*

తన గర్భంలోనున్న శిశువుకి ఏది కావలిస్తే దాన్ని ఆమె ఇష్టంతో స్వీకరిస్తుంది. ఎన్నడూ తినని మట్టి, సుద్ద, పులుపు. . . వంటి పదార్థాలని ఎంతో రుచికరంగా ఆమె తింటుంది గర్భిణిగా ఉన్నకాలంలో. ఎందుకని? లోనున్న వానికి ఏం కావాలో? శరీరానికి ఏది తక్కువ శాతంలో ఉందో దాన్ని వాడు అడుగుతూ ఉంటే వాడి కోసం తాను ఇష్టంగా తింటూంటుంది.

*మరి ఇలాంటి గురువుని ఎక్కడ చూడగలం?*

అర్జునుడు లాంటి శిష్యుల్ని రక్షించడానికి ద్రోణుడూ మొదలైన గురువులు కొన్ని యుద్ధ రహస్యాలని చెప్పి శిష్యుల క్షేమాన్ని కోరితే, అమ్మ మాత్రం తన ప్రాణాలని పణంగా పెట్టి శిశువుని లోకానికి అందిస్తోంది. ఇలా ప్రాణభిక్షని పెట్టే గురువైన తల్లికి ఎన్ని కృతజ్ఞతాంజలులని సమర్పించగలం?

శిశువుని కన్న పిమ్మట తాను మూడంకె వేసుకుని బిడ్డ పక్కలో పడుకుని శరీర సుఖనిద్రని కూడ త్యాగం చేయడమే కాక, వేసవిలో ఎక్కడ శిశువు గొంతు ఎండిపోతుందోనని ఎప్పటికప్పుడు మెలకువ తెచ్చుకుంటూ కంఠంలో నీటిని చుక్కలుగా పట్టిస్తూ శిశువుకి జీవితాన్ని అందించిన ఆ గురువైన తల్లికి ఋణగ్రస్తులమైన మనం తీర్చాల్సిన ఋణం ఎన్ని జన్మలకి తీరుతుందో ఆ విషయాన్ని ఎలా చెప్పగలం? ఇలా అడుగడుగునా రక్షించే తల్లి ప్రథమ గురువు.

### ద్వితీయ స్తు పితా మతః!

తల్లి మొదటి గురువైతే అంతటి భద్రతలో పెరిగిన ఈ శిశువుకున్న జ్ఞాననేత్రాన్ని ఎవరు తెరిపించగలరా? అని ఆలోచించి సరైన గురువు కోసం వెదికి ఆయన సమక్షానికి చేర్చే తండ్రి ఎవరున్నారో ఆయన రెండవ గురువు. అందుకనే 'ద్వితీయః – తల్లి తరువాతి గురువుగా, పితా –తండ్రి, మతః తు చెప్పడం సరైనది' అనే పై వాక్యం పుట్టింది.

పిల్లల్ని కనడమే కాక వాళ్ల యోగక్షేమాల్నీ, విద్యాబుద్ధుల్నీ కూడా గమనించే తండ్రి గురువుల్లో రెండవ స్థానానికి చెందిన వాడౌతున్నాడు.

రాక్షస జాతికి చెందిన హిరణ్యకశిపుడు కూడా తన పుత్రుడైన ప్రహ్లాదుణ్ణి చండుడు, అమర్కుడనే ఇద్దరు గురువుల వద్ద చేర్చడమే కాక, తన పిల్లవాని చదువు ఏ స్థాయిలో ఉందో స్వయంగా వెళ్లి రెండుమార్లు పరామర్శించాడంటే జాతి ఏదైనా సరే తండ్రి రెండవ గురువేనన్న మాట.

క్షత్రియ జాతికి చెందిన వారికి మాత్రమే విలువిద్యని నేర్పే పాఠశాల అని తెలిసినా హిరణ్యధన్వుడనే ఎఱుకలరాజు తన పుత్రుడైన ఏకలవ్యుణ్ణి ద్రోణుని వద్దకి తీసుకునే వెళ్లాడు. ఆయన తాననుకున్నట్లుగానే ఏకలవ్యుణ్ణి 'క్షత్రియ జాతికి చెందినవాడు కా'డనే కారణంతో పాఠశాలలో ప్రవేశానికి అంగీకరించలేదు. పుత్రుని కోసం అలా అసాధ్యమని తెలిసినా ప్రయత్నించే తండ్రి ఎంత గొప్పవాడు!

తండ్రి ఒక్క విద్యకి మాత్రమే కాక బుద్ధి విషయంలో కూడ గురువే ఔతాడు. ఆ తండ్రి తన పుత్రుని నడవడిక విషయంలో జాగ్రత్త వహించాడా పుత్రుని జీవితం నందనవనమౌతుంది. అలా కాక ఉపేక్షించినా, తానై ఆ పుత్రుణ్ణి త్రోవ తప్పించినా వాడి బతుకు కీకారణ్యమౌతుంది.

భీమునికి విషాన్నాన్ని పెట్టి తీగలతో శరీరాన్ని కట్టి నదిలో తోయించాడని వినగానే 'నీ పుత్రుణ్ణి జాగ్రత్తగా చూసుకోవలసిం'దని సూచించాడు విదురుడు.

దుర్యోధనుడు పాండవుల్ని లక్కయింటిలో తగులబెట్టదలిచాడనే వార్త తెలియగానే విదురుడు

**జులై 7 గురు పూర్ణిమ**

ధృతరాష్ట్రునితో 'పుత్రుణ్ణి తోవలో పెట్టుకోవలసిం'దని మందలించాడు.

అలాగే ఉత్తర గోగ్రహణానికి నిష్కారణంగా పాండవుల మీదికి దూకబోయేవేళ 'మంచిది కాదనీ– తాచుపాములని ఉసిగొల్పి పగబట్టేలా చేసుకుంటున్నా' వనీ హెచ్చరించాడు విదురుడు.

పాండవుల రాజ్యాన్ని జూదంతో పూర్తిగా హరిస్తూన్న వేళ 'నీ పుత్ర నాశనం కాగల'దని తీవ్రంగా చెప్పాడు విదురుడు.

పాండవపత్ని అయిన ద్రౌపదిని తన తొడమీద కూర్చోవలసిందిగా ఆమె భర్తల సమక్షంలోనే పల్కుతూ తన తొడని చేతితో చరుస్తూ చూపించిన వేళ విదురుడు 'సమూలంగా హస్తినాపురమే దగ్ధమౌతుం'దన్నాడు.

ఇన్ని చెప్తున్నా ధృతరాష్ట్రుడు ఒకే మాట అన్నాడు విదురునితో, 'పని గట్టుకుని నా దుర్యోధనుని మీద చాడీలని చెప్పడమే నీ పనా?' అని. చేసేది లేక విదురుడు మౌనంగానే ఉండిపోయాడు. చివరికి విదురుడన్నట్లు కౌర వంశం పూర్తిగా తుడిచి పెట్టుకుపోనేపోయింది.

తల్లి తరువాత స్థానం గురుత్వంలో ఏ తండ్రిదో ఆ తండ్రి తన పుత్రుణ్ణి తీర్చిదిద్దుకోనూగలడు. ఇక ఏమాత్రమూ బాగుపడనంతగా నాశనాన్నీ చేయగలడు. అంతటి గురుతర స్థానం తండ్రిది. వ్యసనపరులూ, మోసకారులూ. . . ఇలా దోషగ్రస్తులైన తండ్రుల పిల్లలు చక్కగా ఉంటారని ఆశించడం గగనకుసుమమే.



కాబట్టి తనని చక్కగా తీర్చిదిద్ది ఉంటే, ఆ తండ్రికి ఈ గురుపూర్ణిమ వేళ కృతజ్ఞతతో నమస్కరించవల సిందే.

**మూడవ గురువు ఉపాధ్యాయుడు**

ఉపాధ్యాయుడూ, గురువూ అనే రెండు మాటల్నీ సమానార్థకాలుగా వాడుతూ ఉంటాం. అది సరికాదు. ఉపాధ్యాయుడు వేరు. గురువు వేరు.

'ఉప –తన సమీపానికి శిష్యుణ్ణి రప్పించుకుని, అధ్యాయః – చదువుని చెప్పి పంపేవాడు' ఉపాధ్యాయుడు. ఆయన బాధ్యత ఎంతవరకూ పాఠాన్ని చెప్పి తనకి ఇచ్చిన పాఠ్య ప్రణాళికని సకాలంలో ముగించానా? లేదా? అని పరిశీలించుకోవడమే తప్ప విద్యార్థి బుద్ధికి సంబంధించీ, నడవడికకి సంబంధించీ ఏ విషయాన్నీ పట్టించుకోకపోవడం. కాబట్టి ఒట్టిగా పాఠాన్ని చెప్పి పంపించివేసే ఉపాధ్యాయుని వల్ల విషయం తెలియడమే తప్ప అంతకు మించిన ప్రయోజనం ఉండబోదన్న మాట. మనం ఈ రోజుల్లో ఉపాధ్యాయుల్నే చూస్తున్నాం. అందుకే శిష్యులు కూడ ఇలాంటివారిని ఆదివారాల్లోనూ, సెలవు రోజుల్లోనూ గురువుగా కనీసం భావించడం లేదు కూడ. అంటే ఎదురుబొదురుగా, అది కూడ పాఠాలు చెప్పుకునే చోట మాత్రమే గురుభావన. ఆ ప్రదేశం, సమయం, కాలం దాటితే ఈ గురుశిష్య సంబంధం హుళక్కే. ఈ తీరువారికి నమస్కరించడం నిష్ప్రయోజకమే.

***ఉపాధ్యాయునికి మీది వాడు 'గురువు'***

చదువనేది మూడు విధాలుగా ఉంటుందట. మొదటిది 'కుక్కుటాండన్యాయ విద్య'ట.

కోడి తన గుడ్డుని పొదిగే సందర్భంలో తన కాలూ గోళ్లూ... ఇలా ఏమీ తన గుడ్డుకి తగులకుండా ఉండేలా చూసుకుంటూ అతిశ్రద్ధగా పొదుగుతుంది. ఇక్కడ మొత్తం బాధ్యత తల్లికోడిదే తప్ప గుడ్డుకేమీ ఉండదు– లేదు కూడా. అలాంటి 'కుక్కుటాండ న్యాయానికి ఉదాహరణ ఒకటి నుండి ఐదు వరకూ చదువుకునే పిల్లలు. ఈ పిల్లలకి ఆకలి వేసినా, కాలకృత్యాల అవసరమున్నా, మానసికభయం వేసినా, తల్లి మీద బెంగవచ్చినా. . . అంత బాధ్యతా ఆ గురువుదే. అందుకే ఏ పిల్లవాని మనస్తత్వమెలాంటిదో తెలుసుకునేందుకు వీలుగా ఓ ఇరవయ్యేళ్ల క్రితం ఒకే ఉపాధ్యాయుడు ఒక తరగతికి ఉంటూండేవాడు. ఎవణ్ణి మందలించాలో, ఎవణ్ణి కొట్టి తోవకి తేవాలో. . . వంటివన్నీ ఆయనకే తెలిసిన కారణంగా క్రమశిక్షణ లోపం అనే నేరం పాఠశాల మీద ఉండేదికాదు.

ఇక రెండవది 'మార్జాల కిశోర న్యాయవిద్య'. పిల్లి తన పిల్లల్ని నోట కరుచుకుని వెళ్తూంటుంది. మెడ వెనుక ఉన్న చర్మాన్ని నోట కరుచుకుని చెట్లు గోడలు దూకుతూ వెళ్తూంటుంది తల్లి పిల్లి. ఇక్కడ కూడ రక్షణ బాధ్యత తల్లిదే తప్ప పిల్ల పిల్లిది కానే కాదు. ఆరు నుండి పదవ తరగతి వరకూ కూడ విద్యార్థి రక్షణ బాధ్యత గురువుదే. అది విద్యలో కావచ్చు, బుద్ధిలో (పాఠశాలలో ఉన్నంతసేపు) కావచ్చు, బాధ్యత గురువుదే.

ఇక మూడవది 'మర్కట కిశోర న్యాయవిద్య'. తల్లి కోతి తన పిల్లని 'తన నడుముని గట్టిగా పట్టుకోవలసిందిగా మౌనంగా చెప్తుంది'. అంతే! ఆ తల్లి కోతి చెట్లుల్ని దాటినా, వేగంగా పరుగెత్తినా, గోడల్ని ఎక్కినా, దూకినా పడకుండా తనని తాను రక్షించుకోవాల్సిన బాధ్యత పిల్ల కోతిదే. పదవ తరగతి దాటాక తనకంటూ కొన్ని ఆలోచనలూ, నిర్ణయాలూ, అభిప్రాయాలూ పిల్లలకొస్తాయి. కాబట్టి నడవడికలో రక్షించుకోవల సినది తనని తానే. ఈ సమయంలో తల్లిదండ్రుల అనుబంధం ఆ పిల్లవానితో బాగా ఉన్నట్లయితే వాడు చెడిపోయే అవకాశముండదు. లేని పక్షంలో వాడికి అబ్బని వ్యసనమంటూ ఉండదు. ఈ మూడు దశలలోనూ ఉపాధ్యాయునికి పై మెట్టున నిలిచేవాడు గురువే. అందుకే సరైన గురువున్న చోట పిల్లవాణ్ణి చేర్చాలి– ఆయనతో అనుబంధాన్ని పెంచాలి.

**చివరి గురువు ఆచార్యుడు**

విద్యార్థి చదువు పూర్తయ్యేంత వరకూ బాధ్యత వహించి ఆ మీదట తన బాధ్యత అయిందని తనకి తానే తప్పుకునేవాడు గురువయితే, జీవితాంతం శిష్యుణ్ణి కంటికి రెప్పలా కాపాడేవాడు ఆచార్యుడు. తన శిష్యుడైన అర్జునుని కంటే మించిన విలువిద్య కలవాడు మరొకడుండరాదని గ్రహించి ఏకలవ్యుణ్ణి అర్జునునితో సమానుణ్ణి కానీయకుండా కుడిబొటన వ్రేలిని గురుదక్షిణగా గ్రహించాడు.

***కృష్ణం వందే జగద్గురుమ్***

గురుపరంపరలో తల్లీ, తండ్రీ ఆ మీదట ఉపాధ్యాయుడూ, ఆ వెనుక గురువూ, ఆయన తర్వాత ఆచార్యుడూ ఓ క్రమంలో కన్పిస్తుంటే అన్నిచోట్లా ఉండే గురువులకి గురువు అంటే జగద్గురుడు శ్రీకృష్ణపరమాత్మన్న మాట.

'గురు పూర్ణిమ' అనగానే సాయిబాబా ఉత్సవాలు సాగుతూండడంతో 'గురువంటే సాయిబాబా అనుకోకూడదు. సాయిబాబా కూడ ఒక గురువు కావచ్చునేమో కాని, సాయిబాబా మాత్రమే గురువు కాదు. కాబట్టి 'గురు పూర్ణిమ' అనగానే ఈ పై వారికి మాత్రమే నమస్కరించాలి.

***– డా॥ మైలవరపు శ్రీనివాసరావు***





# సిద్ధమవుతున్న 'అభయ హస్తం'

**ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'అభయహస్తం' పథకం అమలుకు సిద్ధమైంది. నవంబర్ ఒకటి నాటికి కోటి మంది మహిళలకు పెన్షన్ బాండ్లు అందించే లక్ష్యంతో జూన్ 22న ప్రారంభమైన సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ జూలై 21 వరకు కొనసాగనున్నది.**

ఈ పథకం కింద రోజుకు రూపాయి లెక్కన నెలకు 30 రూపాయలు చెల్లించే మహిళలకు 60 సంవత్సరాల వయస్సు దాటగానే వారు పథకంలో చేరిన వయస్సును బట్టి ప్రతినెలా 500 రూపాయల నుంచి 2,200 రూపాయల పెన్షన్ లభిస్తుంది. అలాగే ప్రమాదబీమా సౌకర్యం, వారి పిల్లలకు చదువుకోవడానికి ఏటా ఆర్థిక సాయం అందుతుంది. మహిళా సంక్షేమానికి దోహదపడే ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఈ భాగస్వామ్య పెన్షన్ (అభయహస్తం) పథకంలో జూలై నెల 21వ తేదీలోగా వీలైనంత ఎక్కువ మంది సభ్యులను చేర్పించాలని నిర్ణయించారు. దరఖాస్తుల పరిశీలన, కంప్యూటరీకరణ సెప్టెంబర్ 10 కల్లా పూర్తి చేసి, అక్టోబర్ 10 నుంచి సభ్యుల వద్ద డబ్బు వసూలు చేపట్టాలని నిర్ణయించారు. అర్హులైన మహిళలందరికీ పెన్షన్ పథకం వర్తించేలా చర్యలు తీసుకోనున్నారు. నవంబర్ ఒకటో తేదిన కోటిమందికి పెన్షన్ బాండ్లు పంపిణీ చేసేలా గ్రామీణాభివృద్ధి శాఖ సన్నాహాలు చేస్తోంది.

## రూ. 365 కోట్ల బడ్జెట్

ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో 365 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడమే గాక, మొదటి త్రైమాసికానికి సంబంధించి 91 కోట్ల రూపాయలను విడుదల కూడా చేసింది. 18 సంవత్సరాల వయస్సున్న మహిళలంతా ఈ భాగస్వామ్య పెన్షన్ పథకంలో చేరడానికి అర్హులని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిన విషయం విదితమే. 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు వారు ప్రతిరోజూ ఒక రూపాయి తమ వాటాగా జమచేస్తే, ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని వారి ఖాతాలో జమ చేస్తుంది. ఇలా జమ చేసిన మొత్తం నుంచి వారికి 60 సంవత్సరాల తరువాత ప్రతినెలా పెన్షన్ చెల్లిస్తారు.

పొదుపు ప్రారంభించే సమయానికి సభ్యుల వయస్సును బట్టి పెన్షన్ ఎంత వస్తుందనే విషయం నిర్ధారిస్తారు. 18 సంవత్సరాల వయస్సు నుంచి పెన్షన్ పథకంలో కొనసాగిన మహిళలకు 60 సంవత్సరాల తరువాత ప్రతినెలా 2,200 రూపాయల చొప్పున పెన్షన్‌గా ఆమె బతికి ఉన్నంతకాలం చెల్లిస్తారు. సభ్యురాలు సహజ మరణం పొందితే 30 వేల రూపాయలు ఆమె నామినీకి అందజేస్తారు. ప్రమాదంలో మరణిస్తే 75 వేల రూపాయల ఇస్తారు. ఒకవేళ సభ్యురాలికి శాశ్వత అంగవైకల్యం ఏర్పడిన పక్షంలో 75 వేల రూపాయలు, పాక్షిక అంగవైకల్యానికి 35 వేల రూపాయలు చెల్లిస్తారు.

సభ్యురాలి కుటుంబంలో తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి సంవత్సరానికి 1,200 రూపాయలు చెల్లిస్తారు. పథకం నుంచి సభ్యులు తమంతట తాముగా విరమించుకుంటే అప్పటివరకు వారు జమచేసిన మొత్తంతో పాటు వడ్డీ కలిపి చెల్లిస్తారు. అప్పటివరకు ప్రభుత్వం చెల్లించిన మొత్తాన్ని మాత్రం చెల్లించరు. ఒకవేళ సంఘ సభ్యత్వం నుంచి వైదొలగిన పక్షంలోనూ ఇదే నిబంధన వర్తిస్తుంది. జూన్ 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ అంశాన్ని కూడా ప్రధానంగా వివరించారు.

## అర్హులైన మహిళలందరికీ పెన్షన్

- కనీస వయస్సు 18 సంవత్సరాలు
- జూలై 21 వరకు స్పెషల్ డ్రైవ్... ముమ్మరంగా సభ్యత్వ నమోదు
- నవంబర్ ఒకటి నాటికి కోటి మంది మహిళలకు పెన్షన్ బాండ్లు
- సెప్టెంబర్ 10 కల్లా దరఖాస్తుల పరిశీలన, కంప్యూటరీకరణ పూర్తి...
- అక్టోబర్ 10 నుంచి అర్హుల వద్ద డబ్బు వసూలు ప్రారంభం
- 60 ఏళ్లు నిండిన తర్వాత పథకంలో చేరిన వారికి వయస్సును బట్టి నెలకు రూ.500 - రూ.2,200 పెన్షన్... ప్రమాద బీమా, పిల్లల చదువుకు తోడ్పాటు
- మధ్యలో వైదొలగితే సభ్యులు జమచేసిన మొత్తానికి వడ్డీ కలిపి చెల్లిస్తారు.

– వై. సరోజ

# “ప్రజలకు మంచి పాలన అందించడానికి పునరంకితమవుదాం”

## మంత్రులు, అధికారులు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి పిలుపు

**ప్రజలకు సుపరిపాలన అందించేందుకు పునరంకితం కావాలని, సమర్థవంతమైన ప్రజా పంపిణీ వ్యవస్థ (డెలివరీ మెకానిజం) వేళ్ళూనుకునేలా బాటలు వేయాలని, ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి జిల్లా కలెక్టర్లకు, ఐఏఎస్ అధికారులకు పిలుపునిచ్చారు. జూన్ 26, 27 తేదీల్లో ప్రభుత్వం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను నిర్వహించింది.**

ప్రభుత్వానికి జిల్లాల్లో కలెక్టర్లే రథసారథులని, ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతల నిర్వహణలో చిన్న పొరపాట్లు జరిగినా సహించబోమని, చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. సంక్షేమ పథకాల ఫలాలు, అభివృద్ధి సౌకర్యాలను సామాన్యులకు 100 శాతం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మారుమూల ప్రాంతాల్లో ఎలా అమలవుతున్నాయో ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు దసరా నుంచి మండలాల్లో, గ్రామాల్లో ఆకస్మిక పర్యటనలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.








గత ఐదేళ్ళ పాలనను ప్రజలు ‘వెరీగుడ్’ అని అనలేదని, ‘గుడ్. గో ఎహెడ్’ అని మాత్రం అని 60 శాతం మార్కులతో ఓట్లేసి గెలిపించారని, ఈ తీర్పుకు అనుగుణంగా కలెక్టర్లు, ఉన్నతాధికారులు, మంత్రులందరూ నిబద్ధులై జాగ్రత్తగా పనిచేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ రాజశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు.

### సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వారం

జిల్లా కలెక్టర్లందరూ ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తిగా కేటాయించాలని, ఈ సమయంలో అధికారిక పర్యటనలు, ఇతర కార్యక్రమాలు పెట్టుకోవద్దని, ఆయన స్పష్టంగా ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉండాలని, వారి నుంచి వచ్చే దరఖాస్తులు చెత్తబుట్టలో వేయవద్దని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి దరఖాస్తు పేదవాడి ఆక్రందన అని గుర్తుంచుకోవాలని, పరిష్కారం కాకపోతే, కారణాలు చెప్తూ ఉత్తరాలు రాయాలని ముఖ్యమంత్రి చెప్పారు. పేద ప్రజలు, ఇతరులు తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తే, సమస్య తీర్చవలసిందిగా అర్థిస్తే, ఫిర్యాదు పత్రాలు తీసుకుని తమ చుట్టూ తిప్పించుకోవటం, వారాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచటం చేయవద్దని ఆయన కోరారు. పేదల సమస్యలను త్వరగా పరిష్కరిస్తే, వారిలో సంతృప్తి స్థాయి చాలా అధికంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఇళ్ళు, ఫించన్లలాంటివి అర్హులకే అందాలని, ఏ ఒక్కరూ రాలేదనకూడదని, ఆరోగ్యశ్రీని ప్రపంచమంతా హర్షించిందని, జాతీయ ఉపాధి హామీ చట్టం అమలులో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని, దుర్వినియోగానికి అవకాశం ఇవ్వరాదని ఆయన ఆదేశించారు.

### అవినీతిపై నిఘా

జిల్లాల్లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అవినీతి, నిధుల దుర్వినియోగం జరగకుండా కలెక్టర్లు నిఘా ఉంచాలని, ఈ అంశంలో ఎటువంటి అలసత్వాన్ని సహించబోమని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రజల సొమ్మును వృధా చేసే హక్కు ఎవరికీ లేదని, అవినీతిపరులపై ఉక్కుపాదం మోపాలని, ఈ అంశాలలో ఎటువంటి రాజకీయ జోక్యం ఉన్నా పట్టించుకోవద్దని ఆదేశించారు. చిన్న అవినీతి



- ★ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటిస్తా
- ★ దసరా నుంచే ఆకస్మిక పర్యటనకు శ్రీకారం
- ★ చిన్న పొరపాట్లు జరిగినా సహించను
- ★ ప్రజా సమస్యలను పెండింగాలో వుంచొద్దు
- ★ నిధుల దుర్వినియోగంపై నిఘా వేయండి
- ★ అవినీతిపరులపై ఉక్కుపాదం
- ★ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలి
- ★ ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి
- ★ జనానికి అందుబాటులో ఉండండి
- ★ ధరల అదుపుపై దృష్టి సారించండి
- ★ సోషల్ ఆడిట్‌తో బోగస్‌కార్డుల ఏరివేత
- ★ నవంబర్‌లోగా ప్రక్రియ పూర్తి చేయండి
- ★ ఆ తర్వాతే అర్హులకు కొత్త కార్డులు
- ★ ఆరోగ్యశ్రీ సేవలకు సర్కారు ఆసుపత్రులు
- ★ పంటల బీమాకు గ్రామమే యూనిట్
- ★ జూలై 15 నుంచి 9 గంటల ఉచిత విద్యుత్
- ★ ప్రతి గ్రామానికీ మినరల్ వాటర్
- ★ ఆగష్టు 15 న 28 వేల గ్రామాల్లో ప్రారంభం
- ★ అక్టోబర్ 2 నుంచి సబ్సిడీ బియ్యం కోటా పెంపు
- ★ విలేజ్ మాల్స్‌గా రేషన్ దుకాణాలు

దృష్టికి వచ్చినా కఠినంగా వ్యవహరించాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో పొరపాట్లు, అవినీతికి తావుండకూడదని, నిత్యావసర వస్తువుల సరఫరా, గ్రామీణ ఉపాధి హామీ, స్కాలర్‌షిప్‌లాంటి వాటిలో అక్రమాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, తప్పుచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని ముఖ్యమంత్రి కోరారు.

### అక్రమ నిల్వలపై దాడులు

నానాటికీ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలపై కలెక్టర్లు దృష్టి సారించి, నియంత్రించాలని బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలను విజిలెన్స్‌దాడులు జరిపి నిర్ధాక్షిణ్యంగా సీజ్ చేయాలని, ఇంట్లో పట్టుకున్న నిల్వలు జాగులేకుండా బహిరంగ మార్కెట్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు ప్రజలకు తెలియడానికి ఎప్పటికప్పుడు పత్రికలకు, మీడియాకు సమాచారం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### మంచినీటి పథకాల్లో గిరిజన ప్రాంతాలకే మొదటి ప్రాధాన్యం

మంచినీటి పథకాలు కాకుండా కొత్తగా చేపట్టేవన్నీ గిరిజన ప్రాంతాల్లోనే ఉండాలని, అక్కడ పూర్తయిన తరువాతే ఇతర ప్రాంతాలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను, అధికారులను ఆదేశించారు.

ఇప్పుడు ఇస్తున్నది రక్షిత మంచినీరు కాదని, స్థానికంగా ఉన్న బోరు

## ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు అదనంగా రూ. 20 వేలు మంజూరు

ఇందిరమ్మ తొలివిడత లాగే రెండు మూడో విడతల్లో మంజూరై నిర్మాణాలు పూర్తికాని ఎస్సీ, ఎస్టీ ఇళ్ల లబ్ధిదారులకు ఊరట కలగనుంది. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఈ అంశంపై చర్చ జరిగింది. మొదటి విడతలో ఇళ్లు మంజూరైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇచ్చినట్లుగా ఒక్కో ఇంటికి అదనంగా రూ. 20 వేలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం నిర్ణయంతో రెండోవిడతలో నిర్మాణాల్లో ఉన్న 4,66,479 మంది ఎస్సీ, ఎస్టీ ఇళ్ల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. అలాగే మూడో విడతలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఉన్న 5,09,265 మంది లబ్ధి పొందనున్నారు. మొత్తం 9,73,744 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో ఇంటికి రూ. 20 వేల చొప్పున ప్రభుత్వంపై రూ. 1950 కోట్ల మేర అదనపు భారం పడనుంది. వీలైనంత త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు..

2015 నాటికి బియ్యం ధరలు 75 శాతం, గోధుమ ధర 120 శాతం పెరిగే ప్రమాదమున్నందున పేదవారి ఆదాయంలో 80 శాతం తిండికే ఖర్చు చేయాల్సిన అవసరం రావచ్చని ప్రపంచ ఆహార సంస్థ హెచ్చరిస్తోంది. ఈ మహాముప్పును ఎదుర్కోటానికి తక్కువ ఖర్చుతో 7, 8 రెట్ల అధిక దిగుబడినిచ్చే కూరగాయల పెంపకమొక్కటే మార్గమని 'బయో -ఇంటెన్సివ్ గార్డెనింగ్' గురు జాన్ జీవన్స్ అంటున్నారు. ఈ శాస్త్రీయ విధానాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఒక ఉద్యమంగా చేపట్టినప్పుడే ఆహార కొరతను కొంతవరకు ఎదుర్కొనడం సాధ్యమని ఆయన అంటున్నారు. ★

## గిరిజనులకు అటవీ హక్కులు కల్పించండి: సి.ఎం

అటవీ భూ చట్టానికి సంబంధించిన అంశాలను పూర్తి చేసి గిరిజనులకు చట్టపరమైన హక్కులు కల్పించాలని సిఎం ఆదేశించారు. ఈ కార్యక్రమ అమలుతీరుకు రాష్ట్ర బడ్జెట్‌లో 20 కోట్ల రూపాయల మేరకు నిధులు కేటాయించామని చెప్పారు. అటవీ హక్కుల కోసం మన్యం ప్రజలు ఎంతోకాలంగా పోరాటం చేసిన అంశాన్ని అయన గుర్తు చేశారు. యుపిఏ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమంతో గిరిజన జీవితాల్లో వెలుగునింపే అవకాశం ఉందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జులై నెలాఖరులోగా పట్టాల పంపిణీ పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ అటవీహక్కుల చట్టం- 2006 కింద దేశంలో మొట్టమొదటి సారిగా మన రాష్ట్రమే పట్టాలు పంపిణీ చేసిందని కూడా ఆయన తెలిపారు. కార్యక్రమం కుంటుపడకుండా త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ☆



నీళ్లేనని, అందరికీ సురక్షిత నీరు ఇవ్వటం సమస్య కాదని, రెండు లక్షల రూపాయలు వ్యయం చేస్తే, 300 నుంచి 400 కుటుంబాలున్న గ్రామానికి మినరల్ వాటర్ ఇవ్వొచ్చని, ప్రతి కుటుంబానికి ఈ మినరల్ వాటర్ అందించే కార్యక్రమాన్ని ఆగష్టు 15న ప్రారంభిస్తామని, వచ్చే ఏడాది నాటికి 50 నుంచి 60 శాతం ప్రజలకు మినరల్ వాటర్ అందిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### సహకార వ్యవసాయానికి ప్రాధాన్యం

రాష్ట్రంలో సహకార వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఇతర రాష్ట్రాలకు అది ఆదర్శం కావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో చిన్న కమతాలు ఎక్కువగా ఉన్నాయని, మొత్తం భూమి 1.1 కోట్ల కుటుంబాల చేతిలో ఉందని, భూమి తక్కువగా ఉండటంతో ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని, యంత్రాల వినియోగం, మార్కెటింగా, అన్నీ సమస్యలుగానే ఉన్నాయిని ముఖ్యమంత్రి వివరించారు. సహకార వ్యవసాయంలో పంటలు మాత్రమే కాక, పాడి, చేపల పెంపకం, పండ్లతోటలు, కూరగాయాల పంపెకం. . . ఇలా అన్ని ఉంటాయని, రైతుల అంగీకారంతో సహకార సంఘాన్ని నమోదు చేయాలని, ఒక గ్రామంలోని వెయ్యి ఎకరాల భూమి విలువ 10 కోట్ల రూపాయలు అనుకుంటే, అందులో ఆ మేరకు రైతుల వాటా ఉంటుందని, దీనికి సమానంగా ప్రభుత్వ వాటా ఉంటుందని, రెండూ కలిస్తే బ్యాంకుల నుంచి రుణం ఎక్కువగా తీసుకోవటానికి వీలుంటుందని, ఈ విధానం చైనా, వియత్నాం లాంటి చోట్ల విజయవంతమైందని, మొదట జిల్లాకు ఒకటి రెండు గ్రామాల్లో ఈ ప్రక్రియను ప్రారంభిద్దామని, 10,000 ఆవులతో ఒక పాల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి ఇజ్రాయిల్ ముందుకొచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.

### ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వాలి

జూన్ 27వ తేదీన జరిగిన కలెక్టర్లు, ఎస్.పి.ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జిల్లాల్లో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా మంత్రులు అడిగిన అభివృద్ధి పనులను విధిగా చేయాలని, వీలుకాని పక్షంలో కారణాలను వివరించాలని ఆయన చెప్పారు. ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లలో అనర్హుల ఏరివేత, బోగస్

## ప్రతి గ్రామానికి రక్షిత నీరు

గ్రామాలకు రక్షిత మంచినీరు (మినరల్ వాటర్), సహకార సేద్యం, రైతులకు జూలై 15 నుంచి 9 గంటలు ఉచిత విద్యుత్ కార్యక్రమాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్ రాజశేఖరరెడ్డి కలెక్టర్ల సదస్సులో ప్రకటించారు.

దేశ స్వాతంత్ర దినోత్సవం ఆగష్టు 15న తాగునీటి సమస్య ఉన్న 28,123 గ్రామాల్లో బాటిళ్ల ద్వారా రక్షిత మంచినీరు అందించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం అమలు చేసేందుకు అవసరమైన కార్యచరణ ప్రణాళికను సత్వరం సిద్ధం చేయాలని సీఎం కలెక్టర్లను అదేశించారు. 1500-2000 మంది ప్రజలు/300-400 కుటుంబాలు నివసించే గ్రామాలకు బాటిళ్ల ద్వారా రక్షిత మంచినీరు అందించడానికి రూ. 2 లక్షలకు మించి ఖర్చు కాదని వైఎస్ వ్యాఖ్యలు చేశారు.

ప్రతీ గ్రామానికీ రక్షిత మంచి నీరు అందించాలన్నది మన ముందున్న లక్ష్యమని నిర్దేశించారు. వచ్చే ఏడాది ఆగష్టు వరకు ప్రతీ జిల్లాల్లో 50- 60 శాతం గ్రామాలకు మినరల్ బాటిళ్ల ద్వారా రక్షిత మంచినీరు ఇచ్చే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న సహకార సేద్య విధానంతో రైతులు మంచి లాభాలు ఆర్జించవచ్చని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ☆

# ఇంటింటి సర్వేతో బోగస్ కార్డులకు స్వస్తి

రాష్ట్రంలో ఒక్క బోగస్ రేషన్ కార్డు కూడా ఉండరాదన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఐరిష్ డి డూప్లికేషన్, క్షేత్ర స్థాయి పరిశీలన (ఇంటింటి సర్వే) జరపడం ద్వారా బోగస్ కార్డులన్నింటినీ ఏరివేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే 'ఒకరికి ఒకే కార్డు' అన్న నినాదాన్ని తెరపైకి తెచ్చింది. ఈ విషయాన్ని అన్ని జిల్లాల యంత్రాంగానికి ప్రభుత్వం తెలియజెప్పింది. దీనికి కలెక్టర్ల సమావేశం వేదిక అయింది. తెల్లకార్డులు పొందిన అనర్హులను, ఒకటి కంటే ఎక్కువ చోట్ల తెల్లకార్డులను కలిగి ఉన్న వారిని గుర్తించాలని ప్రభుత్వం అధికారులను అదేశించింది. ఒక కుటుంబానికి ఒకే రేషన్ కార్డు, ఒక చోట మాత్రమే ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు తప్పు చిరునామాలతో ఉన్న వాటిని, ఇచ్చిన చిరునామాలో లేని కార్డులను తొలగించనున్నారు. అదే విధంగా చిరునామా మారిన వారికి అక్కడే కొత్త కార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. దీనివల్ల అసలైన లబ్ధిదారులెవ్వరూ నష్టపోరని ప్రభుత్వం అంచనా వేసింది. ఏరివేతకు సంబంధించిన మొత్తం ప్రక్రియ ఐదు దశలలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో దశకు 10 రోజుల చొప్పున మొత్తం 50 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు. ప్రతి దశలోనూ ప్రతి జిల్లాల్లోని 10 నుంచి 12 మండలాలలో ఏరివేత ప్రక్రియ పనులను పూర్తి నిర్ణయించారు.

## సోషల్ ఆడిట్‌తో ఏరివేత

రాష్ట్రంలో లక్షల్లో పేరుకుపోయిన బోగస్ రేషన్ కార్డులను ఏరివేయడానికి ప్రభుత్వం సోషల్ ఆడిట్‌ను చేపట్టనున్నది. సోషల్ ఆడిట్ కింద ప్రతీ మండలంలోనూ 20 టీములు ఈ ఆడిట్‌ను చేపడతాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఐదు దశల్లో నవంబర్ 15లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ల సమావేశంలో సూచించినట్లు రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ ధర్మాన ప్రసాదరావు తెలిపారు. దీనిపై జిల్లాల్లో అధికారులకు, సోషల్ ఆడిట్ సభ్యులకు అవగాహన కల్పించడానికి 400 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ కోసం నాలుగు ప్రశ్నలతో కూడిన ఒక నమూనాను రూపొందించామని, ఈ నమూనా అనుగుణంగా సోషల్ ఆడిట్ సభ్యులు వివరాలు సేకరించాలని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ జూన్30 నుంచి ప్రారంభమవుతుందని, అర్హులైన ప్రతి పేదవాడికి రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీలు అందాలని, అదే విధంగా అనర్హులను గుర్తించి ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని ముఖ్యమంత్రి కలెక్టర్లకు సూచించినట్లు ఆయన చెప్పారు. తర్వాతనే కొత్త కార్డులను అర్హులైన పేదలకు అందచేయాలని కలెక్టర్లకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టు కింద విజయనగరం జిల్లాలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తే ఆ జిల్లాలో ఐదు లక్షల తెల్లకార్డుల్లో నాలుగు శాతానికిపైగా బోగస్ కార్డులు బయటపడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ☆

రేషన్‌కార్డుల తొలగింపు, ఫిర్యాదుల దినం, పల్లె నిద్రలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

## శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో శాంతిభద్రతలపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జిల్లాల్లో నక్సలైట్ల కార్యకలాపాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్.పిలకు సూచించారు. తీవ్రవాద సమస్యను అధిగమించేందుకు జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. తీవ్రవాదం, ఉగ్రవాదం తీరుతెన్నులను ఈ సమావేశంలో స్లైడ్ల ద్వారా ముఖ్యమంత్రి వివరించారు. ఉగ్రవాద నిరోధక చర్యల కోసం ఏర్పాటైన 'ఆక్టోపస్' పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షిస్తూ, ఇదింకా పూర్తిస్థాయిలో పనిచేయటం లేదని వ్యాఖ్యానించారు.

రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రమంత్రులు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శ్రీ కె. రమాకాంతరెడ్డి, ప్రభుత్వ సలహాదారు, ఎం.పి. అయిన శ్రీ కె. వి. పి. రామచంద్రరావు, సీనియర్ ఐ. ఎ. ఎస్ . అధికారులు, కలెక్టర్లు, ఎస్. పి.లు పాల్గొన్నారు.

## హోంశాఖకు ముఖ్యమంత్రి ఆదేశాలు

- మహిళలు, యాసిడ్ దాడులు, ఆత్మహత్యలు, ర్యాగింగ్, వరకట్న వేధింపులను కచ్చితంగా అరికట్టాలి. ప్రతి ఫిర్యాదును పరిశీలించి న్యాయం చేయాలి. ఐదేళ్ళ కాలంలో నక్సలిజం అణచివేతలో ఎలాంటి ప్రగతి చూపించారో మహిళలపై జరుగుతున్న నేరాలను అడ్డుకునే విషయంలోనూ అదే తరహా ప్రగతి చూపించాలి.
- ప్రజల మనసెరిగి ప్రవర్తించాలి. ఉక్కుపాదంతో అణచివేయడం కంటే మానవత్వంతో వ్యవహరించాలి. పోలీసులు తమ స్నేహితులని ప్రజలు భావించేలా విధులు నిర్వహించాలి.
- ఆందోళనల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్పులకు దిగొద్దు.
- ముఠాకక్షలను అడ్డుకునే విషయంలో పార్టీలకు అతీతంగా కఠినంగా వ్యవహరించాలి.
- తీరప్రాంతాల నిఘా పటిష్ఠం చేయాలి. ఇప్పటికే ఏర్పాటుచేసిన ఆరు మెరైన్ పోలీస్‌స్టేషన్లూ సమర్థంగా పనిచేసేలా చూడాలి.
- రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ఇతర శాఖలతో కలిసి పని చేయాలి. ప్రతి జిల్లాలో రెండు మూడు బ్రీత్ ఎనలైజర్ల కేంద్రాలు ఏర్పాటు చేయాలి. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై నిఘా పెట్టాలి. తద్వారా 50 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి.
- వైట్‌కాలర్ నేరాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

## సిఎం తీసుకున్న ఇతర నిర్ణయాలు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఇకపై లబ్ధిదారులకు పావలా వడ్డీకే రుణాలు అందించాలి.
- ఈ కార్పొరేషన్లు ఇచ్చే రుణంలో సబ్సిడీ ఒకేలా ఉండాలి. తీసుకున్న రుణాలను లబ్ధిదారులు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. మూడు నెలల్లోగా అన్ని పట్టణాల్లో పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలి. భూసేకరణ ఆలస్యం కాకుండా చూడాలి.




- రాజీవ్ ఉద్యోగశ్రీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌సీ, ఎస్టీ యువతకు ప్రాధాన్యం ఇచ్చి శిక్షణ ఇవ్వాలి.
- 2009-2010లో 7.20 లక్షల మందికి శిక్షణ ఇచ్చి, ఇందులో 5.20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలి.
- ఆర్టీసీలో ఎస్‌సీ, ఎస్టీ డ్రైవర్ల ఖాళీలను భర్తీ చేయాలి.
- ప్రాజెక్టుల పునరావాసంపై దృష్టి సారించాలి. పూర్తయిన కాలనీల్లోకి నిర్వాసితులను తరలించాలి. అన్ని రకాల లబ్ధిని చేకూర్చాలి.
- గత ఏడాది 33 పాలిటెక్నిక్ కళాశాలలకు, ఈ ఏడాది 16 పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ కాలేజీలకు పది ఎకరాల చొప్పున భూమిని సేకరించి ఇవ్వాలి.
- అలాగే గత ఏడాది 55 డిగ్రీ కాలేజీలకు, ఈ ఏడాది 9 డిగ్రీ కాలేజీలకు అనుమతి లభించింది. ఐదు ఎకరాల చొప్పున భూమిని సేకరించి ఇవ్వాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఉభయగోదావరి జిల్లాలు, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో 11 మోడల్ కాలేజీల ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చింది. జిల్లా యంత్రాంగాలు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించాలి.
- ర్యాగింగ్‌పై కలెక్టర్లు కఠిన వైఖరిని అవలంబించాలి.
- 395 కస్తూర్బా కాలేజీల్లో భవనాల్లేని వాటికి తక్షణం భవనాల్ని నిర్మించాలి. స్థల సేకరణ చేయాలి.
- డీఎస్సీ ఫలితాలు జూన్ 30న విడుదల చేసి, విద్యార్థుల నిష్పత్తిని బట్టి 56 వేల మంది ఉపాధ్యాయుల నియమాకాన్ని వేగంగా పూర్తిచేయాలి.
- ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి పది లక్షల ఇళ్లు పూర్తి కాకుండా నిలిచిపోయాయి. ఇంటికి రూ. 20 వేలు ఖర్చు చేసి పూర్తిచేయాలి.
- గ్రామీణ ఉపాధి పథకం కింద ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, డ్రైన్లు నిర్మించాలి. ఇళ్ల కాలనీల కోసం తక్షణం భూసేకరణ చేపట్టాలి. దీనికి నిధులు కొరత లేకుండా చూడాలి.
- జేఎన్‌యూఆర్‌ఎం కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 12,523.70 కోట్లతో 2010 నాటికి 268 తాగునీటి ప్రాజెక్టుల ను పూర్తి చేయాలి.
- 18 పట్టణాల్లో చెత్తనిల్వ కేంద్రాల ఏర్పాటుకు భూమిని గుర్తించాలి. పట్టణాల్లోని ఎస్‌సీ, ఎస్టీ, మురికివాడల్లో కమ్యూనిటీ హాళ్లకు స్థలాన్ని సేకరించాలి.
- సిరిసిల్ల తరహాలో చేనేత మహిళకు ఇందిరా క్రాంతిపథం కింద రుణాలు ఇప్పించాలి.

*– రాధాకృష్ణ*

## 'విలేజ్ మాల్స్'గా రేషన్ దుకాణాలు

ఇకపై చౌక ధరల దుకాణాలలో ప్రభుత్వ అందించే సబ్సిడీ సరుకులతో పాటు ఇతర వస్తువులను కూడా విక్రయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న చౌక ధరల దుకాణాలను 'విలేజ్ మాల్స్' (గ్రామీణ అంగళ్లు')గా మార్చాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. వీటిద్వారా చౌక ధరల దుకాణాల డీలర్లలో అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా చూడాలన్నది ప్రభుత్వ ఆలోచన. సబ్సిడీ ధరలకు అందించే బియ్యం, చక్కెర తదితర నిత్యావసరాలేగాక మరికొన్ని ఇతర సేవలను, వస్తువులను చౌక ధరల దుకాణాలలో అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల డీలర్లు సబ్సిడీ సరుకులను నల్లబజారుకు తరలించే అవకాశం తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

అంతేగాక సబ్సిడీ నిత్యావసరాలతోపాటు ఇతర వస్తువులను కూడా రేషన్ దుకాణాలలో అందుబాటులో ఉంచడం ద్వారా గ్రామాలలో ప్రజలకు చాలా వరకు మేలు జరిగే అవకాశముంటుందన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రతిపాదనను వీలైనంత త్వరగా అమలులోకి వచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. గ్రామాలలోని చౌక ధరల దుకాణాలన్నింటిని విలేజ్ మాల్స్‌లుగా మలచాల్సిందిగా కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టమైన అదేశాలిచ్చింది.

# గ్రామీణాభివృద్ధి వికేంద్రీకృత ప్రణాళికీకరణ శిక్షణ ఎంతో ఉపయోగకరం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులలో, ఈ రంగాలలో ఉపాధి కోరుకొనే ఔత్సాహికులైన యువతీ యువకుల వృత్తి నైపుణ్యాలను, సామర్థ్యాలను మెరుగుపర్చే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబయి వారు సంయుక్తంగా 7 ఫిబ్రవరి 2009 నుండి నిర్వహించిన మూడు మాసాల గ్రామీణాభివృద్ధి వికేంద్రీకృత ప్రణాళికీకరణ సర్టిఫికెట్ కోర్సు 8 మే 2009న విజయవంతంగా ముగిసింది.

ఈ సందర్భంగా టిస్, డైరెక్టరు ప్రొఫెసర్. పరశురామన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలులో అనుభవజ్ఞులయిన ప్రభుత్వ సిబ్బందికి గ్రామీణాభివృద్ధి సిద్ధాంత పరికల్పనలపై అవగాహన కల్పించడానికి, మారుతున్న పరిస్థితులకనుగుణంగా సిబ్బందికి అవసరమయిన నిర్వహణా సామర్థ్యాలు, ప్రణాళీకీకరణ నైపుణ్యాలు అందచేయటానికి ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖతో చేసుకొన్న ఒప్పందంలో భాగంగా ఈ సర్టిఫికెట్ కోర్సును నిర్వహించామని అన్నారు. ఈ కోర్సు నిర్వహణలో అనుభవాల ఆధారంగా భవిష్యత్‌లో మరిన్ని మెరుగైన కోర్సులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలియచేసారు. సర్టిఫికెట్ కోర్సు ద్వారా నేర్చుకున్న మెళకువలను క్షేత్రస్థాయిలో అధికారులు ఉపయోగించి ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని ఆయన పిలుపునిచ్చారు. 'గ్రామీణాభివృద్ధి' అంశంపై త్వరలో దూరవిద్యా విధానం ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సును ప్రారంభించనున్నట్లు, ఆసక్తిగల్గిన వారు ఈ కోర్సును కూడా పూర్తి చేయ్యాల్సినదిగా ఆయన కోరారు. 'అపార్డు' ఇన్‌ఛార్జ్ కమీషనర్ తఖ్యుద్దీన్ మాట్లాడుతూ, 50 సంII రాష్ట్ర పంచాయతీరాజ్ చరిత్రలో ఉద్యోగులకు ఈ రకమైన సర్టిఫికెట్ కోర్సు ద్వారా శిక్షణ అందచేయటం ఇదే ప్రథమం. ఈ సర్టిఫికెట్ కోర్సుద్వారా శిక్షణ పొందిన అధికారుల సేవలను శాఖాపరంగాను, పంచాయితీరాజ్ సంస్థల ప్రజా ప్రతినిధుల సామర్థ్యాలను పెంపొందించుకోవటానికి ఉపయోగించు కొంటామని తెలియచేసారు. సి.డి.పి.ఏ సెంటర్ హెడ్ ఆర్.సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, కోర్సు శిక్షణ పొందినవారి సలహాల మేరకు కోర్సుల్లో శిక్షణాంశాలను మరింత మెరుగు పర్చుతామని తెలిపారు. అంతే కాకుండా కోర్సు శిక్షణ పొందినవారితో భవిష్యత్‌లో తరచుగా వర్క్‌షాపులు నిర్వహించి శిక్షణాంశాలు ఏ విధంగా పనిప్రదేశంలో ఉపయోగపడ్డాయో సమీక్షించనున్నట్లు తెలియచేశారు. కేంద్రప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖవారు రూపొందించిన జాతీయ సామర్థ్యాల పెంపుదల ఫ్రేమ్‌వర్క్‌ను అనుసరించి బి.ఆర్.జి.ఎఫ్ నిధులతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయడంజరిగిందని ఆయన తెలియచేశారు. టిస్ డైరక్టరు ప్రొ.పరశు రామన్ శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు ప్రదానంచేశారు.

టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబయి క్యాంపస్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో టిస్, డైరక్టరు ప్రొఫెసర్, పరశురామన్, అపార్డు ఇన్ ఛార్జ్ కమీషనరు మహమ్మద్ తక్విద్దీన్, ప్రొ.లక్ష్మీ లింగం, ప్రొ.ఎం.ఎల్.కాంతారావు, సి.డి.పి.&.ఎ సెంటర్ హెడ్ సూర్యనారాయణ రెడ్డి, ఎన్.ఐ.ఆర్.డి. ప్రొఫెసర్ పుష్పేంద్రసింగ్, కోర్సు కో ఆర్డినేటర్లు డా.వి.శివశంకర ప్రసాద్, పి.నరేంద్రబాబులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు కోర్సు గురించి వ్యక్తంచేసిన అభిప్రాయాలను వారిమాటల్లోనే క్రింద పొందుపర్చటమైనది.



**ఎ.సరళ**
యం.పి.డి.ఓ,
ఉదయగిరి
నెల్లూరు జిల్లా

కేవలం డబ్బే అన్ని సమస్యలకీ పరిష్కారం కాదనీ, అభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ పథకాలను అమలు చేయటం వల్ల మాత్రమే రాదని పలుఅంశాలపై ప్రజలను చైతన్యపరచటం ద్వారా, జాగృతపర్చటం ద్వారా సాధించవచ్చని తెల్సుకున్నాను. ప్రతి యం.పి.డి.ఓకి పోస్టింగ్ ఇచ్చేముందు ఇటువంటి శిక్షణ ఇవ్వాలి.



**జి.నరేందర్ రెడ్డి**
యం.పి.డి.ఓ,
నర్కట్‌పల్లి
నల్లగొండ జిల్లా

మానవ మనుగడలో భూమి, నీరు, అడవులలాంటి సహజవనరుల పాత్ర, వీటి వినియోగంలో వస్తున్న మార్పులు ఫలితంగా సంభవించిన పరిణామాలు, జీవనోపాధులపై చూపుతున్న తీవ్ర ప్రభావాలు, గూర్చి విశదంగా నేర్చుకున్నాను. సుస్థిర అభివృద్ధికి సహజవనరుల పరిరక్షణ ఆవశ్యకత అర్థం అయ్యింది. Spass/Devinfo వంటి సాఫ్ట్‌వేర్‌లు ఎలా ఉపయోగపడుతాయో నేర్చుకున్నాను.



**కె. హేమ సుందరరావు**
యం.పి.డి.ఓ
హీరమండలం
శ్రీకాకుళం జిల్లా

ప్రజా సమస్యలను అర్థం చేసుకోవటంలో సామాజిక చిత్రపటం, వనరుల చిత్రపటం, గ్రూపు చర్చలు, పాదయాత్రలు, రాత్రిబస ఏవిధంగా ఉపయోగపడతాయో స్వీయ అనుభవంతో నేర్చుకున్నాను. ప్రజలలో ఒక్కడిగా కలిసిపోతే వచ్చే లాభాలేమిటో తెల్సివచ్చాయి.



**ఎమ్. కిరణ్ కుమార్**
యం.పి.డి.ఓ
లావేరు
శ్రీకాకుళం జిల్లా

"వాల్యూ చెయిన్" విశ్లేషణ ద్వారా రైతాంగానికి జరుగుతున్న నష్టాన్ని గూర్చి తెల్సుకున్నాను. బృందంలో ఒక్కడుగా ఎలా మెలగాలో తెల్సింది. నిర్వహణా సామర్థ్యాలను మెరుగుపర్చుకున్నాను.



**కె. మాధురి**
యం.పి.డి.ఓ
అమన్‌గల్
మహబూబ్‌నగర్ జిల్లా

ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ బాగా ఉపయోగపడ్డాయి. ప్రజలకు నాణ్యమైన సేవలందించటం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో తెల్సుకున్నాను.



**యం. సత్తయ్య**
యం.పి.డి.ఓ
బంట్వారం (మం)
రంగారెడ్డి జిల్లా

అభివృద్ధి కార్యక్రమాల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా సాధించాలో నేర్చుకున్నాను.



**ఎ. గవర్రాజు**
ఫాకల్టి, ఇ.టి.సి.,
రాజేంద్ర నగర్
రంగారెడ్డి జిల్లా

క్షేత్ర స్థాయిలో పథకాలను అమలుపరచటంలో గల ఇబ్బందులను గూర్చి తెలుసుకోవటం జరిగింది.



**ఎ. మమత**
ఓపెన్ స్టూడెంట్
చైతన్యపురి
హైదరాబాదు

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టమైన అవగాహన వచ్చింది. విషయ పరిజ్ఞానంతోపాటు, క్షేత్ర పర్యటనవల్ల గ్రామీణ ప్రజల జీవన సరళులను గూర్చి తెలుసుకున్నాను. గ్రామీణాభివృద్ధికి/సహజవనరుల యాజమాన్యంలో రిమోట్ సెన్సింగ్, జి.ఐ.ఎస్ ఏ విధంగా ఉపయోగపడతాయో నేర్చుకున్నాను.



**ఎమ్. ఎన్. శివలీల**
యం.పి.డి.ఓ
నిమ్మలపల్లి
చిత్తూరు జిల్లా

అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యాన్ని ఏ విధంగా సాధించాలో నేర్చుకున్నాము. బృంద నిర్మాణం, ఉమ్మడి లక్ష్యసాధనకు బృందంలో పనిచేయవల్సిన తీరు, బృంద సభ్యులను సమన్వయపరిచే విధానం, తదితర నైపుణ్యాలను నేర్చుకున్నాను.



**జి. రాధ**
యం.పి.డి.ఓ
వికారాబాద్
రంగారెడ్డి జిల్లా

స్థానిక సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకటంలో ప్రజల పారంపర్య విజ్ఞానం ఏ విధంగా ఉపయోగపడుతుందో తెల్సుకున్నాను. పి.ఆర్.ఎ. టెక్నిక్స్ బాగా ఉపయోగపడతాయి.



**ఎమ్. కాళిందిని**
యం.పి.డి.ఓ
నల్లగొండ
నల్లగొండ జిల్లా

అభివృద్ధి కార్యక్రమాలను కేవలం అమలు పరచటమే కాక ప్రజలకు ఎలా మార్గదర్శకత్వం వహించాలో తెల్సుకున్నాను.



**జి. వి. నాయుడు**
యం.పి.డి.ఓ
బి. ఆత్మకూరు
కర్నూలు జిల్లా

గ్రామీణాభివృద్ధి వికేంద్రీకరణ ప్రణాళికలు ఏ విధంగా దోహదపడతాయో తెల్సుకున్నాను. ప్రజలతో సహానుభూతితో ప్రవర్తించటం వల్ల కలిగే లాభాలను గూర్చి కూడా తెల్సుకున్నాను.



**ఎమ్. శ్రీనివాస్**
ఓపెన్ స్టూడెంట్
నల్లగొండ జిల్లా

క్లాస్ రూమ్ శిక్షణతో పాటు క్షేత్రస్థాయి ప్రాజెక్టుల వల్ల విజ్ఞానంతోపాటు అనుభవం కూడా వచ్చింది. సహోధ్యాయుల అనుభవాల నుండి గ్రహించింది కూడా చాలా ఉపయుక్తం.



**రంభ మురళి**
యం.పి.డి.ఓ
ఓదెల
కరీంనగర్ జిల్లా

3 నెలల శిక్షణా కాలంలో నేర్చుకున్నదెంతో వున్నది. ఇతర రాష్ట్రాలలో పంచాయతీరాజ్ సంస్థలు ఎలా పనిచేస్తున్నాయో కేరళ, కర్నాటక రాష్ట్రాలకు క్షేత్ర పర్యటన ఏర్పాటు చేస్తే మరింత బాగుండేది.



**ఎస్. త్రినాథరావు**
యం.పి.డి.ఓ
సుబ్బవరం
విశాఖపట్నం జిల్లా

అధికారిగా పనిచేయటంకన్నా ప్రజాసేవకుడిగా పనిచేయడం వల్ల కలిగే లాభాలు గూర్చి తెల్సుకున్నాను.



**ఆర్. గీత**
యం.పి.డి.ఓ
దేవరుప్పల (మం)
వరంగల్ జిల్లా

సమస్యలకు మూలకారణాలను అన్వేషించటంలో ప్రజల పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రజల పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పరిష్కార మార్గాలు ఎలా కనుక్కోవాలో తెలిసింది.



**ఆర్వి. సుబ్రమణ్యం**
యం.పి.డి.ఓ
రెంజాల్
నిజామాబాద్ జిల్లా

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో దైనందిన విధుల నిర్వహణలో అవసరమైన అనేక మెళకువలను ఈ కోర్సు ద్వారా నేర్చుకొనటం జరిగింది.



**జి. సంజీవనాయుడు**
ఎస్.ఆర్.పి.,
ఎస్.ఆర్.ఇ.జి.ఎస్.,
సోషల్ ఆడిట్, ఆళ్లగడ్డ,
కర్నూలు జిల్లా

ప్రభుత్వ కార్యక్రమాల అసలు ఉద్దేశ్యాలకు క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాల అమలు జరుగుతున్న తీరులో గల వ్యత్యాసాలను గుర్తించటం జరిగింది.



**కె. తిరుపతయ్య**
యం.పి.డి.ఓ
యం.పి.డి.ఓ.
సత్తుపల్లి, ఖమ్మంజిల్లా

ఈ కోర్సు ద్వారా ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికల రూపకల్పనకు కావల్సిన నైపుణ్యాలను, వైఖరుల గురించి నేర్చుకున్నాను. భారతదేశంలలో పంచాయతీరాజ్ వ్యవస్థ పరిణామక్రమం ఇప్పటివరకూ ఈ వ్యవస్థలో వచ్చిన నిర్మాణాత్మక మార్పులు, క్షేత్రస్థాయిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలులో పంచాయతీరాజ్ సంస్థల పాత్రల గూర్చి సంపూర్ణ అవగాహన వచ్చింది.



**బి. శశిధర్**
ప్రాజెక్టు డిజైనర్
హైదరాబాద్

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో, నిర్వహణలో సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నాణ్యమైన సేవలు ఏ విధంగా అందచేయవచ్చో తెల్సుకున్నాను.



**కె.ఎస్.ఎస్. సుబ్బారావు**
యం.పి.డి.ఓ
రాయవరం
తూర్పుగోదావరి జిల్లా

క్షేత్ర పర్యటన, రాత్రివేళ గ్రామాలలో బస చేయటంతో నిజమైన పేదరికం అంటే ఏమిటో తెలిసింది. యం.పి.డి.ఒ. ఒక ఫెసిలిటేటర్‌గా ఎలా వ్యవహరించాలో తెలిసింది.



**కె. పద్మశ్రీ**
యం.పి.డి.ఓ
చెరుకుపల్లి
గుంటూరు జిల్లా

బడ్జెట్, తలసరి వ్యయం, దేశ, రాష్ట్ర ఎకానమి తదితర ఆర్థిక అంశాల ప్రాముఖ్యాన్ని గూర్చి తెల్సుకోవటం జరిగింది. గత 10 సం॥ల సర్వీస్‌లో నేర్చుకోలేని విషయాలెన్నో ఈ కోర్సుద్వారా నేర్చుకున్నాను. ఈ కోర్సును ప్రతి ఒక్క యం.పి.డి.ఒ.కు తప్పని తప్పనిసరి చేయాలి.



# ప్రగతికి బాటలు వేస్తున్న మన పొదుపు సంఘాలు

పొదుపు పట్ల మక్కువ ఆంధ్రప్రదేశ్‌లో 61.70 లక్షల మహిళలను ఒక చోటకు చేర్చింది. రోజుకి ఒక్క రూపాయి పొదుపు 156.90 కోట్ల రూపాయలను చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 4.65 లక్షల పొదుపు సంఘాలు ఏర్పడ్డాయి. 1993లో ప్రారంభమయిన ఈ పొదుపు పథకం మహిళా చైతన్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది. పేదరికం వంకతో ఎన్నో ఏళ్ళ గా నిర్లక్ష్యం చేసిన ఆరోగ్యం, పోషకాహారం, పిల్లల చదువులను అత్యవసరాలుగా గుర్తించేటట్లు చేసింది. మహిళలకు గౌరవాన్ని, వారి శక్తికో గుర్తింపును తెచ్చిపెట్టింది. ఎవరో వస్తారు, ఏదో చేస్తారనే ఎదురుచూపులు మాని ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడాలనే భావనను ఈ పొదుపు ఉద్యమం మహిళల్లో తీసుకువచ్చింది. సమాజంలో మార్పు ఎవరో తెస్తారని ఇంతవరకూ ఎదురు చూసింది. కాని ఇప్పుడు పొదుపు ఉద్యమం ఇలా పది చేతులు కలిస్తే ఏమవుతుందో చూస్తున్నాం. ఇంతటి శక్తివంతమైన మహిళ ఒక ప్రణాళికా వేత్తలాగా ఆలోచిస్తుంది. మొక్క పాదులో పోసిన నీటిని వేరు పీల్చుకొని, కొమ్మలకు, ఆకులకు, పువ్వులకు, కాయలకు, పండుకు అందించిన రీతిగా మహిళ కూడా పొదుపు చేసిన దానితో బిడ్డలకు టీకాలిప్పించడం, చదువు చెప్పించడం, పిల్లలకు తిండి, పోషణ, పెళ్ళిళ్లు అలా ఒకటేమిటి కుటుంబంలో ప్రతి అవసరానికి ఆ డబ్బు ఉపయోగిస్తుంది. ఈ పొదుపు ఉద్యమం మహిళల్లో చైతన్యానికి కారణమైందని చెప్పడానికి ఉదాహరణ స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు 10,000 మంది డ్వాక్రా మహిళలు వివిధ స్థాయిల్లో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారు.

### పొదుపు సంఘం ఇలా ఉండాలి

- ఒకే సాంఘిక ఆర్థిక స్థాయికి చెందిన 10 – 20 మంది కలిసి ఒక పొదుపు సంఘంగా ఏర్పడవచ్చు.
- సంఘానికి ఒక పేరు పెట్టుకోవాలి.
- క్రమశిక్షణ, చొరవ, ధైర్యం కలిగిన ఇద్దరు సభ్యులను లీడర్లుగా ఎన్నుకోవాలి.
- ఇద్దరు లీడర్ల పేరు మీద జాయింట్‌గా బ్యాంకులో పొదుపు ఖాతా తెరవాలి.
- రోజూ ఒక్క రూపాయి దాచుకొని, నెలకు ఒకసారి 30రూపాయలు సంఘానికి జమ చేయాలి.
- జమ చేసిన డబ్బు నుండి అవసరాల కోసం అప్పు తీసుకొని సంఘంలో నిర్ణయించిన విధంగా వడ్డీతో చెల్లించాలి. ఈ మొత్తాన్ని కూడా తిరిగి ఖాతాలో వేసుకోవాలి.
- నెలకు ఒకసారి సమావేశం కావాలి. ఆ సమావేశంలో అకౌంట్స్

**62 లక్షలమంది మహిళలను ఒక్కటి చేసిన పొదుపు ఉద్యమం**

**గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయం అంటున్నాం కాబట్టి గ్రామంలో ఉన్న పొదుపు సంఘాలను చైతన్య పరుచుకుంటూ కేవలం వారిని రాజకీయ మీటింగులకు సరఫరా చేయడమో లేక తన జనబలం చూపించుకోవడానికో వారిని వాడుకోకుండా సర్పంచ్, సభ్యులు ఈ క్రింది సూత్రాలను వారు పాటించేటట్లు తగిన శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి తద్వారా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి.**

వ్రాయడం, అప్పులు గురించి, మాత్రమే కాక వారు ఎదుర్కొనే సమస్యలు, వాటికి పరిష్కారాలు పొందవచ్చు.

- వారి కుటుంబ సమస్యలే కాకుండా గ్రామంలో ఇతర మహిళలు ఎదుర్కొనే సమస్యల పరిష్కార మార్గాలు కూడా ప్రయత్నించవచ్చు.
- సంఘంలోని సభ్యులు స్నేహం, ఆత్మీయతలు పంచుకుంటూ మహిళలంతా సంఘటితమై పేదరికం, అజ్ఞానం, ఒంటరితనం, నిస్సహాయత, మూఢ నమ్మకాలు అనే చీకట్లు తొలగించుకోవచ్చు.

## మంచి పొదుపు సంఘానికి ఉండవలసిన లక్షణాలు

- క్రమం తప్పకుండా సమావేశం కావడం
- సంఘంలోని సభ్యులందరూ హాజరుకావడం
- సమావేశంలో ఆర్థిక అంశాలపై చక్కగా చర్చలు
- అకౌంట్స్ ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవడం
- అభివృద్ధి అంశాలలో ప్రగతి కనబరచడం
- ఇలా ఉన్న సంఘాన్ని 'ఎ' గ్రేడు సంఘంగా నమోదు చేస్తారు. ప్రభుత్వ పథకాలు ఇచ్చేటప్పుడు 'ఎ' గ్రేడు సంఘానికి మొదట ప్రాధాన్యమివ్వడం జరుగుతుంది. ఎప్పటికీ 'ఎ' గ్రేడు సంఘంగా ఉండే ప్రయత్నం చేయాలి. ప్రతి పొదుపు సంఘం ఏ ప్రలోభానికి లోనుకాకుండా, దళారీలకు, మధ్యవర్తులకు దూరంగా, స్వయంశక్తితో పటిష్ఠంగా ఎదగాలి. నిరంతర కృషితోనే అది సాధ్యమవుతుంది.

గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయం అంటున్నాం కాబట్టి గ్రామంలో ఉన్న పొదుపు సంఘాలను చైతన్య పరుచుకుంటూ కేవలం వారిని రాజకీయ మీటింగులకు సరఫరా చేయడమో లేక తన జనబలం చూపించుకోవడానికో వారిని వాడుకోకుండా సర్పంచ్, సభ్యులు ఈ క్రింది సూత్రాలను వారు పాటించేటట్లు తగిన శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి తద్వారా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి.

- భార్య, భర్త ఇద్దరూ పొదుపు చేయమని చెప్పాలి. మహిళ ఒక్కరే రోజుకి ఒక్కరూపాయి దాచినంత మాత్రాన అనుకున్నంత త్వరగా అభివృద్ధి జరగదు.
- సంపాదించిన డబ్బును ఖర్చుపెట్టేటప్పుడు కుటుంబంలో ముందుగా ఆరోగ్య అవసరాలకు, పిల్లల చదువు ఖర్చులకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- సారా, గుట్కా, పేకాట, జూదం వంటివి ఇంటిలోని ఎవరికీ అలవాటు ఉండకూడదు.
- ఇంటిలో జరిగే శుభకార్యాలకు దుబారాగా అనవసరమైన వాటి మీద ఖర్చు చేయకూడదు.
- 5 సంవత్సరాలు దాటిన పిల్లలందరిని బడిలో చేర్పించాలి. ముఖ్యంగా ఆడపిల్లలను తప్పకుండా చేర్పించాలి.
- ఇంటిపనుల కోసమని పిల్లలను మధ్యలో బడి మాన్పించకూడదు.
- బాలకార్మికులుగా ఉంటే వారిని విడిపించి తిరిగి బడిలో చేర్పించాలి.
- రాత్రిపూట బడికి వెళ్ళి వయోజనులు తప్పకుండా అక్షరాస్యులు కావాలి.
- ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లవాడికి 21 సంవత్సరాల తరువాత పెండ్లి చేయాలి.
- గ్రామాలలో 10వ తరగతి పూర్తికాగానే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలనుకుంటారు. ఆ విధంగా కాకుండా ఆడపిల్లలను కూడా చదివించి తమను తాము పోషించుకోగలిగినప్పుడే పెళ్ళి చేయాలి.
- భర్త భార్యను మానసికంగా గాని, శారీరకంగా గాని తిట్టడం, కొట్టడం చేయకూడదు.
- వరకట్నం తీసుకోకూడదు. అంటరానితనం నేరం అని తెలియజేయాలి. అన్ని కులాల, మతాల వారు స్నేహంగా మెలగాలి.
- చిన్న కుటుంబం అలవాటును ఇద్దరు లేదా ఒక్కరు అందరూ ఆచరించాలి.
- బిడ్డ పుట్టిన తరువాత, మరో బిడ్డకు కనీసం 3 సం॥ వ్యవధి ఉండాలి.
- చంటి పిల్లలకు సకాలంలో టీకాలు, గర్భవతులకు పోషకాహారం ఇవ్వాలి.
- ప్రతి ఇంటిలో మరుగుదొడ్లు కట్టించుకోవాలి.
- మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఒక చెట్టును నాటి దానిని సంరక్షించాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.
- తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- మంచినీరు త్రాగాలి.

- మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ దోమలు, ఈగలు పెరగకుండా చూసుకోవాలి.
- అనారోగ్యం వచ్చినప్పుడు మూఢనమ్మకాలు ఆచరించకుండా వైద్యుని వద్దకు వెళ్ళాలి.

పైన చెప్పిన విషయాల పట్ల డ్వాక్రా గ్రూపులకి శిక్షణ ఇప్పిస్తే త్వరగా ఈ విషయాలు గ్రామంలోని అందరికి చేరి ఆదర్శవంతమైన గ్రామంలాగా అభివృద్ధి చెందుతుంది. ఒక మహిళ మరొక మహిళను ప్రోత్సహిస్తుంది.

## పొదుపు సంఘాలు సాధించిన విజయాలు

పొదుపు సంఘాల మహిళలు కేవలం రోజుకి ఒక్క రూపాయి దాచడం మాత్రమే కాక, ఆ గ్రామంలో జరిగే అన్యాయాలను ధైర్యంగా అందరూ ఒక్కటిగా నిలబడి ఎదుర్కొని మిగతా వారికి ఆదర్శంగా నిలిచారు. మనకందరకూ తెలిసిన సారా వ్యతిరేక ఉద్యమం. ఇంకా చిన్నవీ పెద్దవీ ఎన్నో విజయాలూ. . .

- ఘట్‌కేసర్ మండలం బోడుప్పల్ గ్రామంలో ఫాతిమాబేగం, సామ్యూల్‌ల మధ్య ప్రేమ వ్యవహారం నడిచింది. పెళ్ళి చేసుకుందామని వాగ్దానం చేసుకున్నారు. ఫాతిమా గర్భవతి కాగానే అతను ఆమెను పెళ్ళి చేసుకోవడానికి నిరాకరించాడు. ఈ విషయాన్ని విన్న చిన్నంగుల యాదమ్మ, కూశ శకుంతలమ్మలు ఫాతిమా బేగంకు ధైర్యం చెప్పి, మరో 10 మంది మహిళలను వెంటబెట్టుకొని సామ్యూల్ ఇంటికి వెళ్ళి నిలదీశారు. పెళ్ళి చేసుకోవడానికి కొంత వ్యవధి ఇవ్వమని కోరి, ఆ వ్యవధిలో వేరే పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. దాంతో యాదమ్మ బృందం పోలీసుస్టేషనులో ఫాతిమా బేగంతో కేసు నమోదు చేశారు. ఇది విన్న సామ్యూల్ వేరే ఊరిలో ఉన్న మేనమామ ఇంట్లో దాక్కున్నాడు. అతని బంధువులు వచ్చి ఊరు వదిలిపొమ్మని ఫాతిమా బేగంను బెదిరించారు. తిరిగి యాదమ్మ బృందం పోలీసుస్టేషను కెళ్ళి, సబ్-ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి, ఊర్లో ఉన్న సామ్యూల్ తండ్రిని, అతని మేనమామను గట్టిగా నిలదీయించారు. సామ్యూల్ ఆచూకీ తెలిసింది అందరూ కలిసి చర్చించి అతనిని పెండ్లికి ఒప్పించారు. యాదమ్మ బృందం తోచినంత చందాలు వేసి పెళ్ళిని ఘనంగా జరిపించారు. మగపిల్లవాణ్ణి ప్రసవించిన ఫాతిమాబేగం, ఆమె భర్తతో తార్నాక వడ్డెర బస్తీలో సుఖంగా కాపురం చేసుకుంటుంది. బహుశ ఏ న్యాయస్థానం, ఏ పోలీసుస్టేషన్, ఏ పంచాయితీ ఇంత త్వరగా సమస్యను పరిష్కరించ లేకపోయేవేమో! ఈ విషయం తెలిసిన మణి, అండాలు అనే మరో ఇద్దరు నిరుపేద మహిళలు దరిదాపుగా ఇలాంటి సమస్యతోనే యాదమ్మ బృందాన్ని ఆశ్రయించి, తమ సమస్యను పరిష్కరించుకోగలిగారు. సామరస్యంగా, ధైర్యంగా సమస్యలను పరిష్కరించే నేర్పుగల యాదమ్మ బృందం సమస్యతో క్రుంగిపోతున్న ప్రతి మహిళకు ఒక ఊరట కేంద్రంగా మారిపోయింది.



- రాజేంద్రనగర్ మండలంలోని మణికొండ గ్రామంలో సాయినాథ్ పొదుపు జ్యోతి సంఘసభ్యులు ఎన్నో రకాల కార్యక్రమాలు చేపట్టారు. ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పడిన ఖాళీలలో విద్యావలంటీర్లుగా పక్క గ్రామంలోని వారిని నియమించుకోవడం జరిగింది. ఆ గ్రామంలోని విద్యావంతులయిన వినోద, ఇందిర, పద్మలను నియమించుకోకపోవడం గమనించిన పొదుపు సంఘం సభ్యులు ఈ విషయంపై సంబంధిత ఎం.ఆర్.ఓతో విచారణ జరిపించి, వారి గ్రామానికి చెందిన యువతులకే ఉద్యోగం వచ్చే విధంగా చూశారు. ఆడపిల్లలను కన్నదని రాధను, ఆమె భర్త మానసికంగా, శారీరకంగా హింస పెడుతుండగా సంఘ సభ్యులంతా పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసి, భయపెట్టి నచ్చచెప్పి, ఇద్దరినీ ఏకం చేయగలిగారు.
- హయత్‌నగర్ మండలంలోని గౌరెల్లి గ్రామానికి చెందిన కొంతమంది, గౌరమ్మ, లక్ష్మమ్మలు లీడర్లుగా ప్రశాంతి పొదుపు జ్యోతిగా ఏర్పడినారు. యం.వి.ఎఫ్. ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ మేనేజిమెంట్ శిక్షణను పొంది ఆ సూత్రాలకు అనుగుణంగా, 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, తృణధాన్యాలు, కూరగాయలు నాటారు. జిల్లా కలెక్టరును ఆహ్వానించి, వారు సాగు చేసిన 10 ఎకరాల భూమిని, వాటర్‌షెడ్ మేనేజిమెంటు శిక్షణ ద్వారా తాము నేర్చుకున్న విషయాలు, పాటించిన విధానాన్ని ప్రత్యక్షంగా చూపారు. ఆ సందర్భంలో వారు కంకరకొట్టే పనిని చేస్తారని తెలిసి, వారి కృషికి మెచ్చి కలెక్టరు గారు దగ్గరనున్న బండను వారికి 10 సం॥ లీజుకు ఇచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఆధునిక పనిముట్లు పొంది, మైనింగ్ కూడా చేపట్టారు.
- మేడ్చల్ మండలం జ్ఞానాపూర్ గ్రామంలోని వేలాంగిణి మాతా, నిష్కళంక మాతా పొదుపు జ్యోతి సభ్యులందరూ తాము నేర్చుకున్న విషయాలను ఆచరిస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఆ గ్రామంలో మంజూరు అయిన వాటరుట్యాంకు, కమ్యూనిటీ హాలు నిర్మించారు. మంచినీటి పంపులకు సపోర్టు గోడలు నిర్మించారు. మోరీలు కట్టారు. మంచినీటి వనరులను క్లోరినేట్ చేస్తున్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫినాయిలు చల్లి, వ్యాధి నివారణ మార్గాలు చేపట్టారు. మరియమ్మను గ్రామ ఆరోగ్య కార్యకర్తగా ఎంపిక చేసుకున్నారు. చిన్నపిల్లల కోసం బాల్వాడిని నడుపుతున్నారు. రోడ్లు, మురికి కాల్వలు, అంగన్‌వాడీ భవనాలు, పాయిఖానాల నిర్మాణం పనులను ఎక్కువశాతం పొదుపు జ్యోతి సంఘాలే చేపట్టాయి.
- మహేశ్వరం మండలంలోని ఘట్‌పల్లి గ్రామంలో ప్రగతి పొదుపు సంఘం మహిళలంతా కలిసి నాటు సారా వ్యాపారాన్ని వారి గ్రామఛాయలకు రాకుండా చేశారు. చుట్టుప్రక్కల గ్రామాలలోని సంఘాలకు స్ఫూర్తినిచ్చారు. నూరు శాతం బడిహాజరు, ఆడపిల్లల విద్యను ప్రోత్సహించడానికి ప్రతి గ్రామం నుండి ఒక సంఘం ముందుకొచ్చింది. వీరు గ్రామంలో సర్వేచేసి బాలకార్మికులను, బడికి హాజరు కాని పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులను ప్రోత్సహించి పిల్లలు బడికి వెళ్ళే విధంగా చూస్తున్నారు. జిల్లాలో ప్రత్యేకంగా ఆడపిల్లల కోసం పది బ్రిడ్జి కోర్సు క్యాంపులు నిర్వహించడానికి ప్రోత్సాహం ఇచ్చారు. పొదుపు సంఘం తెచ్చిన చైతన్యంతో గ్రామసభలలో పాల్గొని గ్రామ సమస్యలను నిర్మొహమాటంగా చర్చించి, పరిష్కరించుకొంటూ తమ సంఘాల ఉనికిని చాటుకుంటున్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను గుర్తించి పొగలేని పొయ్యిలను స్వంతంగా ఏర్పాటు చేసుకున్నారు. మొక్కలు నాటి, కంచెలు వేసి రక్షిస్తున్నారు. మంచినీటి బోరు దగ్గర బట్టలు ఉతకడం, స్నానాలు చెయ్యడం, పశువులు కడగడం వంటి పనులను మానుకున్నారు. అలా ఎవరైనా చేస్తే వారికి జరిమానా విధిస్తున్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 80% వరకు పొదుపు సంఘాల సభ్యులే నిర్వహణ బాధ్యతను తీసుకుని అమలుచేస్తూ, ఎంతో కొంత ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

**పొదుపు సంఘాల మహిళలు కేవలం రోజుకి ఒక్క రూపాయి దాచడం మాత్రమే కాక, ఆ గ్రామంలో జరిగే అన్యాయాలను ధైర్యంగా అందరూ ఒక్కటిగా నిలబడి ఎదుర్కొని మిగతా వారికి ఆదర్శంగా నిలిచారు. మనకందరకూ తెలిసిన సారా వ్యతిరేక ఉద్యమం. ఇంకా చిన్నవీ పెద్దవీ ఎన్నో విజయాలూ. .**

ఒంటరిగా సాధించలేనిది, పది మంది కలిసి సాధించవచ్చని నిరూపించాయి పొదుపు సంఘాలు. పది మంది చేయి చేయి కలపగా ఒకరి బలహీనతను వేరొకరి బలం ఆసరాగా, ఒకరి అజ్ఞానానికి వేరొకరి విజ్ఞానం తోడురాగా, ఒకరి నిస్సహాయ స్థితికి వేరొకరి ఆత్మవిశ్వాసం చేయూతగా, సమిష్టిగా స్పందించి సాధించిన విజయాలు ఎన్నో. కాబట్టి ప్రజాప్రతినిధులు పొదుపు సంఘాలను గ్రామంలో పటిష్ట పరిచి ఇలాంటి విజయాలు ఎన్నో సొంతం చేసుకొని తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు.

*– జి. సురేఖ*
ప్రధానోపాధ్యాయురాలు
బాచుపల్లి పాఠశాల, రంగారెడ్డిజిల్లా





అపార్డ్‌లో వీడియో కాన్ఫరెన్సు సదుపాయాన్ని, వెబ్‌సైట్‌ను ప్రారంభించిన గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ వట్టి వసంత్ కుమార్

# 'అపార్డ్'లో వీడియోకాన్ఫరెన్సు, వెబ్‌సైట్ ప్రారంభం

**ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీలో నూతనంగా ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్సు సదుపాయాన్ని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శ్రీ వట్టి వసంత కుమార్ జూన్ 6న ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ అధికార వెబ్‌సైట్ (http://www.apard.gov.in) ను కూడా ప్రారంభించారు.**



ఈ సందర్భంగా శ్రీ వట్టి వసంత్‌కుమార్ మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలలో పనిచేస్తున్న వివిధ అధికారులకు, పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికయిన ప్రజాప్రతినిధులకు శిక్షణ అందచేయటంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ ముందంజలో ఉన్నదని అన్నారు. క్రొత్తగా ఏర్పాటుచేసిన వెబ్‌సైట్ నుండి శిక్షణకు సంబంధించిన సకల సమాచారాన్ని, 'అపార్డు' కార్యకలాపాలను గూర్చి ప్రతి ఒక్కరికీ తెలుసుకోవటానికి వీలు కలుగుతుందని మంత్రి అన్నారు. అపార్డులో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సు సదుపాయం పనిచేసే విధానాన్ని అపార్డు కమీషనరు శ్రీ ఫణికుమార్ రాష్ట్ర మంత్రికి వివరించారు. ఈ వీడియోకాన్ఫరెన్సు సదుపాయంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో నేషనల్ ఇన్ఫర్మేటిక్సు సెంటరు వారి నెట్‌వర్కు ద్వారా నేరుగా అపార్డు శిక్షణా కార్యక్రమాలు చేపట్టవచ్చుననీ ఆయన తెలియచేసారు. అపార్డు నియంత్రణలో గల రాజేంద్రనగర్, శ్రీకాళాహస్తి, బాపట్ల, సామర్లకోట, హసన్‌పర్తి విస్తరణా శిక్షణా కేంద్రాలతో కూడా బి. ఎస్. ఎస్. ఎల్. ప్రత్యేక లైను ద్వారా వీడియో కాన్ఫరెన్సు నిర్వహించుకోవచ్చని శ్రీ ఫణికుమార్ తెలియచేసారు. వీడియో కాన్ఫరెన్సు సదుపాయంతో మంత్రి విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్సుతో సంభాషించారు. అందరికీ శుభాభివందనలు తెలియచేసారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ స్టడీస్ అడ్మినిస్ట్రేషన్, గుంటూరు వారు సంయుక్తంగా నిర్వహించిన 3 నెలల సర్టిఫికేట్ కోర్సు ఇన్ ఇంటిగ్రేటెడ్ నాచురల్ రీసోర్సెస్ డెవలప్‌మెంట్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసారు. సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో శ్రీ వట్టి వసంతకుమార్ మాట్లాడుతూ, శిక్షణ ద్వారా నేర్చుకొన్న పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను క్షేత్ర స్థాయిలో నిజాయితీతో అమలు చేసి పేద ప్రజలకు సేవచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ కె. రాజు మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మిగిలిన రాష్ట్రాలకన్నా ముందున్నదనీ, ఇందుకు ప్రధానంగా నైపుణ్యం గల సిబ్బందిని వివిధ స్థాయిలలో వినియోగించటమేనని, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా గ్రామీణాభివృద్ధి రంగంలో నిపుణులను తయారుచేయటానికి ఈ తరహా సర్టిఫికెట్ కోర్సులు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్మా డైరక్టరు ప్రొ. మాంటే, అపార్డులోని వివిధ సెంటర్లలో పనిచేస్తున్న కన్సల్టెంట్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం అధ్యయనం

ప్రాంతాలవారీగా అభివృద్ధిలో ఉన్న అసమానతలను తగ్గించటానికి కేంద్ర ప్రభుత్వం 2006-07 ఆర్థిక సంవత్సరం నుండి ప్రవేశపెట్టిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కార్యక్రమ అమలు తీరును మూల్యాంకన చేయటానికి ప్రపంచబ్యాంకు బృందం రాష్ట్రంలో జూలై 1 నుండి 6 వరకు పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా ఖమ్మం, నల్గొండ జిల్లాలలోని జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు, గ్రామపంచాయితీలను సందర్శించింది. ఈ సందర్భంగా రెండు జిల్లాల లోని జిల్లా కలెక్టర్లు, జిల్లా ప్రణాళికా కమిటీ సభ్యులు, జిల్లా పరిషత్తు అధ్యక్షులు, జిల్లా స్థాయి అధికారులు, మండల పరిషత్ సభ్యులు, మండల అధికారులు, గ్రామపంచాయితీ సభ్యులు, గ్రామస్థాయి అధికారులతోను పథకం అమలు తీరుపై విస్తృతంగా చర్చించారు.

గ్రామసభలకు హాజరయిన ప్రజలతో కూడా సంభాషించారు. ఈ బృంద సభ్యులలో ప్రపంచబ్యాంకు నుండి శ్రీ యెస్పర్ స్టీఫెన్‌సెన్, శ్రీ అమరేంద్రసింగ్, భారత్ ప్రభుత్వ పంచాయితీరాజ్ మంత్రిత్వశాఖ కన్సల్టెంట్ శ్రీమతి ఇంద్రాణి జోషి ఉన్నారు. వీరివెంట పంచాయితీరాజ్ ఉపకమీషనర్ శ్రీ రామారావు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖలోని ప్రణాళికా వికేంద్రీకరణ, పరిపాలనా కేంద్ర విభాగాధిపతి ఆర్. సూర్యనారాయణరెడ్డి, ఫ్యాకల్టీ సభ్యుడు, డా. వి. శివశంకర ప్రసాద్ ఉన్నారు.

ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ముందుగా రాష్ట్రస్థాయిలో పంచాయితీరాజ్ కమీషనర్ శ్రీ. కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ కమీషనర్ శ్రీ. ఫణికుమార్, ఐ.ఎ.ఎస్‌తోను సమావేశమై రాష్ట్రంలో బి.ఆర్.జి.ఎఫ్ అభివృద్ధి నిధి, సామర్థ్యాల పెంపుదల నిధుల వినియోగాన్ని గూర్చి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధి డా. యుంగ్మమ్ జౌ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ ద్వారా అమలు జరుగుతున్న బి.ఆర్.జి.ఎఫ్ పథకంలో ఎదురవుతున్న సమస్యలు, తెలుసుకోవటానికి, ఈ పథకాన్ని భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా అమలు చేయటానికి తీసుకొనవలసిన చర్యల గూర్చి ఈ బృందం అధ్యయనం చేయనుందని,

## వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కార్యక్రమ మూల్యాంకన కోసం

అధ్యయన ఫలితాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలియచేసారు. అదేవిధంగా సామర్థ్యాల పెంపుదల నిధులతో చేపట్టిన శిక్షణ వల్ల ప్రజాప్రతినిధులలో ఏ మేరకు అవగాహన వచ్చిందీ, శిక్షణను మరింత సమర్థవంతంగా అందచేయటానికి గల అవకాశాలను పరిశీలించనున్నట్లు శ్రీ స్టీఫెన్‌సెప్ తెలియచేసారు. శ్రీమతి ఇంద్రాణి జోషి మాట్లాడుతూ, దేశంలో 8 రాష్ట్రాలలో బి.ఆర్.జి.ఎఫ్ అమలు తీరుపై ప్రపంచబ్యాంకు అధ్యయనం చేయనున్నదని తెలియచేసారు.

ఖమ్మం, నల్గొండ జిల్లాలో పర్యటించిన బృందం జూన్ 6న పర్యటనలో గమనించిన అంశాలను, బి.ఆర్.జి.ఎఫ్ అమలులో కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాటించిన అంశాలు, పాటించని అంశాలతో కూడిన నివేదికను, భవిష్యత్తులో బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయటానికి అధిగమించవలసిన సమస్యల గూర్చి పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ యం.వి.వి.పి.సి శాస్త్రి, ఐ.ఎ.ఎస్, కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్, అపార్డు కమీషనర్ శ్రీ ఫణికుమార్, ఐ.ఎ.ఎస్, వివిధ జిల్లాల సి.ఇ.ఓలకు వివరించారు. పంచాయితీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ యం.వి.పి.సి. శాస్త్రి మాట్లాడుతూ, బృంద సభ్యులు సూచించిన అంశాలపై తగుచర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియచేసారు. 6న అపార్డు నందు జరిగిన కార్యక్రమంలో పంచాయితీరాజ్ అదనపు కమీషనర్ శ్రీ శంకరరెడ్డి, ఉప కమీషనర్ శ్రీ రామారావు, సి.డి.పి.ఎ సెంటర్‌హెడ్ ప్రొఫెసర్. సూర్యానారయణ రెడ్డి, ఫ్యాకల్టీ సభ్యుడు డా. వి. శివశంకరప్రసాద్, ఖమ్మం, అనంతపూర్, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్ సి.ఇ.ఓలు వరుసగా సత్యనారాయణ, రాజేశ్వరరావు, గురవయ్య, సత్యనారాయణ, వెంకటయ్యలు పాల్గొన్నారు. □





# దోషం లేని ఆషాఢం

ఏ నక్షత్రం పూర్ణిమనాడు చంద్రునికి దగ్గరగా ఉంటుందో దాన్ని బట్టి ఆ నెలకి ఆ నక్షత్రపు పేరుని పెట్టారు ప్రాచీనులు. ఉదాహరణకి పూర్ణిమనాడు చంద్రునికి దగ్గరగా చిత్తా నక్షత్రం ఉంటే ఆ నెలకి చైత్రమాసం అనే పేరుని పెట్టారు. అలాగే విశాఖ ఉంటే వైశాఖం, జ్యేష్ఠ ఉంటే జ్యేష్ఠం, పూర్వాషాఢ లేదా ఉత్తరాషాఢ నక్షత్రాలుంటే ఆషాఢమాసమనీ... ఇలా పేర్లు పెట్టారు.

మన సంస్కారం, సంప్రదాయం అనే వాటిని పూర్తిగా ధ్వంసం, చేసి భారతీయులకి ఏ విధమైన సంప్రదాయపు ఆస్తీ లేదని నిరూపించాలని భావించిన అప్రాచ్యుడు (పాశ్చాత్య దేశాల్లో ఉంటూండే ఆంగ్లేయుడు) మనకున్న ఆచార వ్యవహారాలనీ సంస్కార సంప్రదాయాలనీ, నృత్య నాట్యాలనీ, విశేషించి దేవతలు మాట్లాడే సంస్కృత భాషనీ ముక్కలు ముక్కలుగా నరికాడు. దాంతో తప్పనిసరిగా భారతీయులంతా అప్రాచ్యుని వేషానికీ, భాషకీ, భావజాలానికీ దాసోహం పడాల్సి వచ్చింది.

## సరే !

ఇదంతా ఎందుకంటే ఏ తెలుగునెలలో ప్రకృతి ఏ మార్పుకి గురౌతుందో దాన్ని విశదంగా తెలుసుకునే అవకాశం ఆంగ్లమాసాల ద్వారా తెలిసే వీలే లేదని చెప్పడానికే.

చైత్ర వైశాఖమాసాలు వసంత ఋతువు కాగా, ఈ రెండు నెలల్లో చెట్లన్నీ చక్కగా చిగురిస్తాయి.

జ్యేష్ఠ ఆషాఢమాసాలు గ్రీష్మఋతువు కాగా ఈ రెండు నెలల్లో కాసే తీవ్రమైన ఎండలు నేలమీదున్న నీళ్లని ఎక్కువశాతం పీల్చి మేఘాలుగా ఆకాశంలో తోరణాలు కట్టిస్తాయి.

ఇలాంటి ఆషాఢంలో ఆకాశం అకస్మాత్తుగా నల్లమబ్బుతో నిండిపోవడమే కాక చక్కని వర్షాన్ని అందిస్తుంది. అప్పటివరకూ ఇళ్ళూ ఒళ్ళూ కూడా మండిపోయే ఎండల దాటికి తట్టుకోలేని ప్రజ చక్కని చినుకు పడగానే కొత్త ప్రాణం వచ్చినంత ఆనందపడతారు.

ఆషాఢస్య ప్రథమ దివసే మేఘ మాశ్లిష్య సానుం।

వప్రక్రీడా పరిణత గజః ప్రేక్షణీయం దదర్శ॥

కాళిదాస మహాకవి చెప్పాడు ఆషాఢమాసం గురించి – వర్షపు చినుకుపడ్డ వేళ ఆ చల్లదనానికి ఎంతో ఆనందపడే ఏనుగు నదుల



ఒడ్డుకి వెళ్ళి, కుంభస్థలంతోనూ, తన బలిష్ఠమైన పాదాలతోనూ ఒడ్డుని కుమ్మి తన్ని ఆ మట్టిని నదిలో పడేలా చేసి నీళ్ళని బురద చేస్తుందట.

వ్యవసాయదారులంతా ఆకాశం నుండి వర్షపుచుక్క రాలి పడగానే మూల దాచిన నాగలికి కింద ఉండే ఇనుపకఱ్ఱుకి పదును పెట్టించి (చాటు వేయించడమంటారు వ్యవసాయ పరిభాషలో) నేలలో బలంగా దిగేలానూ, చాలా లోతుగా పడేలానూ నాగలిని సిద్ధం చేస్తారట.

వేసవికాలంలో పంటని యజమాని ఇంటికి బళ్ళమీద తెచ్చి పడేసినప్పటి నుండి బలిసిన వృషభరాజు (ఎద్దు)కి ఈ ఆషాఢ వర్షం ప్రారంభమయ్యేంత వరకూ బడికి సెలవులిచ్చిన విద్యార్థిలా తిని కూర్చోవడం తప్ప పని ఉండనే ఉండదు. అదుగో ఆ ఎద్దుమెడ మీద ఇప్పుడు నాగలిని తగిలిస్తారు. కడుపునిండా తిండీ, తాగినంత నీరూ తాగి కావలసినంతగా దుక్కిని దున్నడం ప్రారంభిస్తుందిట అది.

అలాగే జ్యేష్ఠమాసంలో వివాహమై కొన్నాళ్లపాటు కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించిన నూతన దంపతులు ఆషాఢం రాగానే అటునుండి ఆయనా, ఇటు నుండి ఈవే తమ విరహ బాధని ఆషాఢ మేఘానికి వివరించుకుంటూ తొందరగా మాసాన్ని నడిపించవయ్యా అని ఆషాఢ కాలపురుషుణ్ణి ప్రార్థిస్తారట.

## రథయాత్ర

అలా ఆషాఢమాసం తెర తీసిందో, లేదో ఆ మాసం వచ్చిన రెండవరోజున అంటే ఆషాఢశుద్ధ విదియనాడు జగన్నాథస్వామి తన చెల్లెలు సుభద్రతో సోదరుడు బలభద్రునితో కలిసి వేర్వేరు రథాలలో బయాలుదేరి పూరీలో చక్కగా భక్తులకి దర్శనమిస్తాడు.

శ్రీ మహావిష్ణువు చేతి శంఖం జారిపడిందా? అన్నట్టు శంఖాకారంగా ఉండే ఈ దేవాలయం 1070 ఎకరాల వైశాల్యం ఉన్న స్థలంలో ఉండడమే కాక, భక్తుల్ని నిరంతరం చూసేందుకు వీలుగానూ, రెప్పపాటు వేస్తే కూడ ఎక్కడ భక్తుణ్ణి ఆ క్షణం పాటు కూడ చూడ వీల్లేకుండా అయిపోతానో అనే భక్తవాత్సల్యంతో కళ్లకి రెప్పలు కూడ లేకుండా తాను దేవాలయంలో కన్పిస్తాడు.

రథయాత్ర పైకి ఎంతో ఆడంబరంగా, అట్టహాసంగా సాగినా చెప్పలేనన్ని విశేషాలు గోచరిస్తాయి ఈ రథయాత్రలో.

1. ఊరేగే ఊరిపేరు 'పూరి' కాదు 'పురి'. కాలక్రమంలో 'పూరి'గా మారింది. 'పురి' అంటే పురం, పట్టణం అని నిజానికి అర్థం. అయితే పురం అంటే శరీరం. భాగవతంలో 'పురంజన ఉపాఖ్యాన'మని ఒకటుంది. అది దేహం ధరించిన వ్యక్తిని గూర్చి సంకేతరూపంగా వివరించే ఉపాఖ్యానమే. కాబట్టి 'పురి'లో జగన్నాధుడు ఊరేగడమంటే ఈ శరీరంలో ఆ పరమేశ్వరుడు ఆనందంగా తిరుగుతూ ఉండాలని దీని భావమన్నమాట.
2. రథం బయల్దేరే ముందు ఆ మార్గాన్ని ఆ దేశపు రాజు బంగారు చీపురుతో శుభ్రపరుస్తాడు. దీన్నే ఒరియా భాషలో (అక్కడి భాష అదే) 'చేరా పహన్‌రా' అంటారు. రథం వెళ్లబోయే మార్గాన్ని శుభ్రపరచడమంటే ఏ దైవాన్ని శరీరంలో ప్రయాణింప చేయాలని భక్తుడు అనుకుంటున్నాడో భక్తుడు తన మనోమార్గాన్ని ఏ విధమైన కల్మషమూ లేకుండా శుభ్రపరుచుకోవడమన్నమాట.
3. రథానికి రెండు తాళ్లని లాగడానికి వాడతారు. ఒక త్రాడు అహంకారం. మరో త్రాడు మమకారం. ఈ రెండూ శరీరమనే రథానికి బయటే ఉండాలిగాని, శరీరంలో ఉండకూడదు. రథంలో త్రాళ్లు ఎలా ఉండవో అలాగే శరీరంలో అహంకార మమకారాలుండకూడదు. శరీరానికి వెలుపల ఇవి ఉండని పక్షంలో 'నేనేదైనా సాధించి తీరా'లనే పట్టుదల వ్యక్తికి ఉండదు – అలాగే 'నా కుటుంబాన్ని నేను పైకి తీసుకురావాలనే దీక్ష, కర్తవ్య బాధ్యతా కూడ వ్యక్తికి కలగదు. కాబట్టి

ప్రతివ్యక్తికీ శరీరానికి వెలుపల అహంకార-మమకారాలు పరిమితంగా వాండి తీరాల్సిందేనని సూచిస్తాయి ఆ త్రాళ్లు.

4. భగవంతుని దగ్గర ఎవరైనా కోరికలని తీర్చవలసిందిగా యాచించాలి తప్ప, అందరు భిక్షుకుల్లాగా అన్నాన్ని యాచించకూడదు. అందుకే ఇక్కడ 24 గంటలపాటూ భోజనం సిద్ధంగా ఉండనే వాంటుంది. ఏ వ్యక్తైనా రోజంతా పాటుపడేది ఈ అన్నం కోసమేనంటూ పరమ వైరాగ్యాన్ని తేల్చే చోటు 'పురి'. అన్నం విషయంలో ఎక్కువ తక్కువలకి స్థానం లేదని తెలియజేస్తూ ఒక గిన్నెపైన మరో గిన్నె చొప్పున పెట్టి నిరంతరం వండి వారుస్తూనే ఉంటారు. తినేవాళ్లు అలా తింటూనే ఉంటారు. ఇక్కడ ఉచ్ఛిష్టం (ఎంగిలి) అనే భావమే లేదు. అందరూ ఒక్కటే అనే సద్భావం పెంపొందించే సూత్రం ఇక్కడ కన్పిస్తుంది. 'సర్వం జగన్నాథ'మనే సామెత పుట్టింది ఈ సంఘటన కారణంగానే.

5. ఒక రథం-దానిలో అలంకారాలు - ఆ మీదట భగవంతుడు - పైన భగవద్ ధ్వజం (రెపరెపలాడే జెండా), చుట్టూ భక్తజనుల జగన్నాథ నామస్మరణ - ఎక్కడ చూసినా కోలాహలం... ఇదంతా ఆ లోపల విగ్రహాలు ఉన్నప్పుడే. విగ్రహాలని దేవాలయంలోనికి చేరుస్తున్న వేళ జనసంఖ్య తగ్గుతుంది. అంటే - రథంలో దేవుడున్నంతసేపు (భౌతికంగా ప్రాణం వాన్నంతసేపు) దానికి గౌరవం ప్రతిష్ఠా వాంటాయి - అది లేనినాడు అంతా హుళక్కే అని తెలియజేయడమన్నమాట.

6. అత్తా మామా మరదీ బావా... అనేవాళ్లు ఎప్పుడూ కలుస్తూనే ఉంటారు గాని పెళ్లికాక ముందుండే అన్నా చెల్లెళ్లలా పెళ్లయ్యాక పుట్టింట్లో కూడా ఆ అన్నాచెల్లెళ్ల బంధంతో కొన్నాళ్లుంటే ఉండే ఆనందమేదో దాన్ని గుర్తు చేసుకుంటూ ఉండాలని పరోక్షంగా జగన్నాథ సుభద్ర బలభద్ర దేవతలు మనకి తెలియజెప్పారు. ఈ వేడుక మొత్తం ఆషాఢమాసంలోనే.

## ఆషాఢశుద్ధ ఏకాదశి

ఆషాఢమాసంలో వచ్చే ఏకాదశిని 'శయనైకాదశి' అని పిలుస్తారు. శ్రీహరి ఈనాడు యోగనిద్రకి ఉపక్రమిస్తాడని శాస్త్రం చెప్తోంది. ఈ నాటి







నుండి 4 నెలలపాటు అంటే కార్తీక శుద్ధ దశమి వరకు యోగనిద్రలో ఉండి ఏకాదశినాడు మేల్కొంటాడు. ఆ రోజుని 'ఉత్థాన ఏకాదశి' అని పిలుస్తారు. సంప్రదాయం తెలిసిన సన్యాసులైతే తామున్న ఆశ్రమ ప్రాంతాన్ని వీడి వెళ్లకూడదు ఈ నాల్గు నెలలపాటూ.

ఎందుకని? ఏ భారతదేశం పూర్తి వ్యవసాయాధారమో ఆ కారణంగా ప్రతివ్యక్తీ ఆషాఢం రాగానే తొలకరి చినుకు పడగానే నాగలికట్టి దుక్కి దున్నుతూ వ్యవసాయపు పనుల్లో పడిపోతాడు. అలా తన వృత్తిధర్మాన్ని పాటించని పక్షంలో వ్యవసాయం సాగక భోజనానికి తిండిగింజలు కరువు అవుతాయి. ఇలాంటి వ్యవసాయపు పనులు అదనులో స్వాములవారి రాకగాని సాగితే, ఇటు వ్యవసాయపు పనీ - అటు స్వాములవారికి చేయవలసిన మర్యాదా కారణంగా ఏ పనికీ న్యాయం చేకూర్చ లేకపోతాడు యజమాని. అందుకని స్వాములవారికి ఈ ఆషాఢం నుండి కార్తికం వరకూ శిష్యసంచారాన్ని నిషేధించారు పెద్దలు.

ఇక ఈ నెలలో పూర్ణిమ రాగానే ఆ గురుపూర్ణిమ నాడు కచ్చితంగా వ్యాసుణ్ణి పూజించాల్సిందే. పూజించడమనగానే వ్యాసుని నారికేళాలూ, అరటిపళ్లూ, పూజలూ, పురస్కారాలూ మాత్రమే కాదు దీనర్థం.

" యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్' అని చెప్పబడిన కారణంగా తన భారతంలో ఏదుందో అదే లోకంలో జరుగుతుందని సధైర్యంగా వ్యాసుడు చెప్పిన కారణంగా వ్యాసుణ్ణి పూజించడమంటే వ్యాసుని రచనలైన భారత భాగవతాలనీ, అష్టాదశ పురాణాలనీ గౌరవించాలని దీని భావమన్నమాట!

ఈ అనుకున్న అన్ని విశేషాల ద్వారా ఆషాఢమాసం మనమనుకుంటున్నట్లుగా దోషం ఉన్న మాసంగాని, ఖిల నాశనమయ్యే మాసంగానీ, మలమాసం (ఇందాకటి అర్థమే) గాని కాదనీ అర్థం చేసుకోవాలి.

*అందుకే భారతీయ ధర్మంలో అన్నీ శుభతిథులే, అన్నీ శుభసూచనలే - శుభ శకునాలే.*

*- డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు*



# సహకార వ్యవసాయంపై సమాలోచనలు

## చొరవ తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

**దేశ వ్యవసాయ చరిత్రలోనే విప్లవాత్మకమైన మార్పులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. 1968 నాటి హరిత విప్లవం (గ్రీన్ రివల్యూషన్)లో పాల్పంచుకున్న అయిదుగురు విఖ్యాత శాస్త్రవేత్తల సమక్షంలో ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ తన ప్రతిపాదనల్ని ప్రజల ముందు ఉంచారు. డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్‌తో పాటు, నాటి హరిత విప్లవంలో గణనీయ పాత్ర పోషించిన డాక్టర్ ఎం.వి.రావు. డాక్టర్ గంగా ప్రసాదరావు, డాక్టర్ ఎస్.వి.ఎస్ శాస్త్రి, డాక్టర్ విజయ్ గుప్తాలు సహకార వ్యవసాయానికి సంబంధించి ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనల్ని స్థూలంగా స్వాగతించారు. సమావేశానికి హాజరైన నాయకుల్లో అనేకమంది కూడా ఈ ప్రతిపాదనలకు అంగీకారం తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా గడచిన అయిదేళ్ళలో 9 శాతం ఆర్థిక వృద్ధి రేటును, వ్యవసాయ రంగంలో 6.4 శాతం వృద్ధిని సాధించిన మన రాష్ట్రంలో పెరుగుతున్న జనాభా అవసరాలను, గ్రామీణ ప్రగతిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విప్లవాత్మక ప్రతిపాదనలు చేసింది.**

### గ్రామీణ సంపద పెంపే లక్ష్యం

భూకమతాలు కాలగతిలో ముక్కలు ముక్కల కింద విడిపోయి చిన్న, అతిచిన్న కమతాలుగా కుదించుకుపోయే ప్రక్రియ యాభై ఏళ్ల వ్యవధిలో నాలుగు రెట్లు వేగవంతమైంది. 1951లో మన దేశంలో మూడు కోట్ల కమతాలు ఉండగా, 2001 నాటికి అవి పన్నెండు కోట్లకు చేరుకున్నాయి. వీటిలో 80 శాతం కమతాలు సగటున రెండున్నర ఎకరాల లోపు కావడం ఒక ఎత్తయితే, అవి పేద రైతాంగానికి చెందినవి కావడం మరో ఎత్తు. ఒక్కింటికి రెండెకరాలు మించిన కమతాలు నాలుగింట మూడొంతులకుపైగా ఉండటం మూలనే, వ్యవసాయోత్పత్తి ఎదుగుదలకు నోచుకోక బొటాబొటిగా స్తబ్దంగా ఉండిపోయింది. సాంకేతికంగా వ్యవసాయ రంగంలో 1991-2001 మధ్య కాలంలో నూతన అవిష్కరణలు పెద్దగా జరగని కారణంగా వ్యవసాయ రంగంలో పెరుగుదల రేటు 2 శాతానికి పడిపోయింది.

1981-91 దశాబ్దితో పోల్చి చూస్తే ఇది 3.2 శాతం తక్కువ. వ్యవసాయ రంగంలో అదనపు ఉత్పత్తి ఈ కాలంలో ప్రపంచంలో ఎక్కడైనా సాధ్యపడిందంటే, అందుకు కారణం యాంత్రికీకరణ, సాంకేతిక నైశిత్యం. చిన్న కమతాలకు తోడు అల్పాదాయాల వలన మన దేశంలో రైతులు ఈ నూతన విధానాలను అవలంబించడంలో విఫలమయ్యారు. వ్యవసాయ రంగంతో సహా ఏ రంగమైనా మనం పెట్టే పెట్టుబడులనుబట్టే పెరుగుదల, ఆదాయాలు ఉంటాయి. వర్షాలపై ఆధారపడి పంటలను చిన్నకమతాల్లో సాగుచేసే 80 శాతం రైతాంగం వద్ద పెట్టుబడులు పెట్టడానికి డబ్బు ఎక్కడిది? వర్ధమాన దేశంలో మరో సమస్య ఏమిటంటే రైతులే కాదు. అక్కడి ప్రభుత్వాలు కూడా పేదవే. ఆశించిన మేర రైతాంగానికి అవి తమ మద్దతు అందించలేకపోవడానికి గల ఏకైక కారణం ఇదే.

వ్యవసాయోత్పత్తులను పెంచడం ద్వారా ఆహార భద్రతను మెరుగుపరచడంపైనే మన ప్రభుత్వాలు గత అరవై ఏళ్లుగా దృష్టి పెట్టాయి. రైతుల ఆదాయం పెంపు చేయడంపై ఇటీవల కాలంలో మాత్రమే అవి దృష్టిని సారిస్తున్నాయి. అందుకే, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణం చేపట్టవలసిన కార్యాలు రెండే. ఒకటి; రైతుల ఆదాయం పెరిగేలా చూడటం, రెండు వ్యవసాయోత్పత్తి పెంచడం.

దేశ జనాభా ఏటా రెండు కోట్ల మేర పెరుగుతున్న నేపథ్యంలో చిన్న కమతాలు, ముందుముందు మరింత చిన్న కమతాలుగా మారిపోక తప్పదు. అందుకే చిన్న కమతాలవలన సంక్రమించే 'తక్కువ ఆదాయం-తక్కువ పెట్టుబడులు - తక్కువ ఉత్పాదకత' అనే దుస్థితి నుంచి రైతాంగాన్ని బయట పడేయాలి. సాగుభూమి ఖండఖండాలుగా విడిపోతున్న ప్రక్రియను నివారించేందుకు తక్షణమే సహకార వ్యవసాయ విధానాన్ని అమలులోకి తేవాలి.

# అఖిలపక్ష సమావేశంలో వెల్లడైన అభిప్రాయాలు

*ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయనతో సహా, వివిధ పార్టీల నాయకులు వెల్లడించిన అభిప్రాయాలు. . .*

## చిన్నరైతుల రక్షణకే సహకార పద్ధతి

రాష్ట్రంలో ఒకప్పుడు 32 లక్షలుగా ఉన్న చిన్న కమతాలు ఇప్పుడు 1.2 కోట్లకు పెరిగాయి. ఉత్పత్తి తగ్గడానికి ఇది ప్రధాన సమస్యగా మారింది. దాదాపు 80 శాతం మందికి పైగా రెండెకరాల రైతులే. సహకార వ్యవసాయ విధానంలో సన్నకారు రైతులకు ఆదాయం పెరిగి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయి. వ్యవసాయం అంటే వర్మి కంపోస్టు, ఆర్గానిక్ ఫామ్స్ వంటి అన్ని రకాల పద్ధతులను ఉపయోగించుకుని ఉత్పత్తిని పెంచుకోవడంలో రైతులు దృష్టిని కేంద్రీకరించాలి. అలాగే, చిన్న కమతాలలో యంత్రాలను ఉపయోగించుకుని ఉత్పత్తిని పెంచుకోవడంలో రైతులు దృష్టిని కేంద్రీకరించాలి. అలాగే, చిన్న కమతాలలో యంత్రాలను ాపయోగించి ఉత్పత్తిని పెంచడం సాధ్యంకాదు. సహకార వ్యవసాయ పద్ధతిలో రెండు గ్రామాలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేసి, పెద్దపెద్ద వ్యవసాయ క్షేత్రాలను రూపొందించి అధిక ఉత్పత్తిని సాధించడమే ప్రభుత్వ సంకల్పం వెనుక దాగిన ప్రధాన ఉద్దేశం. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన రైతులతోనే ఈ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

*– వై.యస్. రాజశేఖరరెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి*

## అన్న మాట నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం

గత ఐదేళ్లుగా వ్యవసాయంలో దిగుబడులను మెరుగ్గా సాధించి దేశంలోనే ప్రత్యేకత సాధించడంలో రాష్ట్రం ప్రత్యేకతను నిలుపుకుంది. అదునులో కురిసిన వర్షాలు, రైతుల సహకారం, ప్రభుత్వం ఇచ్చిన తోడ్పాటుతో ఈ ఘనత సాధ్యమైంది. అలాగే, గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నిలుపుకుంటూనే, అన్ని పార్టీల అభిప్రాయాలకు విలువనిస్తూ అఖిలపక్ష సమావేశాలను నిర్వహిస్తోంది. ఇప్పుడు కూడా రైతులకు మేలు చేయాలన్న సత్సంకల్పంతో సహకార వ్యవసాయ విధానం అమలుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, శాసనసభలో అన్నమాట నిలబెట్టుకుంది. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్న సంప్రదాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది.

*– ఎన్. రఘువీరారెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి*

## బహుళ ప్రయోజనాలు

సహకార సేద్యం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. భవిష్యత్తులో ఆహార ధాన్యాల కొరతను నివారించాలంటే చిన్న కమతాల వల్ల సాధ్యంకాదు. అందువల్ల వాటన్నింటిని కలిపి సహకార సేద్యం కింద సాగు చేయాల్సిన అవసరం ఉంది.

*– సోమయాజులు, వ్యవసాయ టెక్నాలజీ మిషన్ వైస్ ఛైర్మన్*

## భూమి కోల్పోతామన్న భయం ఉంది

సహకార వ్యవసాయ పద్ధతిలో ఉత్పత్తిని పెంచాలని ప్రభుత్వం భావించడం మంచి ఆలోచనైనప్పటికీ, చిన్న రైతులు తమ భూమిపై హక్కును కోల్పోవడానికి అంగీకరిస్తారా అన్నది ప్రధాన సమస్య. అలాగే, భూమికి తాము శాశ్వతంగా దూరమౌతామన్న భయం రైతుల్లో ఉంది. ఇప్పటికే అమలులో ఉన్న చేనేత, కల్లు గీత లాంటి వృత్తుల వారు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుని సాగిస్తున్న ఉత్పత్తి ప్రక్రియలు అనుకున్న ఫలితాలను సాధించడంలో విఫలమయ్యాయన్న విమర్శ ఉంది. ఈ అనుభవాల దృష్ట్యా వ్యవసాయాన్ని సహకార పద్ధతుల్లో అమలు చేస్తూ ఉత్పత్తిని పెంచడం సాధ్యమవుతుందా అన్నది సందేహమే.

*– దాడి వీరభద్రరావు, టిడిపి*

## ఎన్ని చేసినా ఆగని ఆత్మహత్యలు

రైతులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆత్మహత్యలు ఆగడంలేదు. పండించిన పంటకు గిట్టుబాటు ధర అన్నది ప్రధానం. దాన్ని సాధించడంలో ఇప్పటికీ వెనుకబడే ఉన్నాం. వినియోగదారుడు రైతులు పండించిన ధాన్యాన్ని అత్యధిక ధర చెల్లిస్తేగానీ పొందలేని పరిస్థితి. ఈ దశలో ప్రభుత్వం చూపిస్తున్న చొరవ ఆహ్వానించదగ్గ పరిణామమైనప్పటికీ, హడావుడిగా కాకుండా అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.

*– ఈటెల రాజేందర్, టీ.ఆర్.ఎస్.*

## పిల్లనివ్వడానికీ ముందుకు రావడం లేదు

టిడిపి తొమ్మిదేళ్ల పాలనలోనూ, కాంగ్రెస్ గత ఐదేళ్ల పాలనలోనూ రైతులకు ఎన్నో చేశామని ఏకరువు పెడుతున్నారు. అయినా, సామాజికంగా వారి స్థితిగతుల్లో ఎలాంటి మార్పు రాలేదు. రైతు కుటుంబమంటేనే ఎవరూ పిల్లనివ్వకపోవడమే దీనికి పెద్ద ఉదాహరణ. మార్కెటింగ్, మౌలిక వసతుల కల్పన లాంటివి లేకుండా వ్యవసాయ పద్ధతుల్లో ఎన్ని మార్పులు తీసుకువచ్చినా అనుకున్న ఫలితాలు సాధించలేం.

*– కిషన్ రెడ్డి, బిజెపి*

## కుప్పంలో ప్రయోగం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు

రాష్ట్రంలో ఇప్పటికే విదేశీ పరిజ్ఞానంతో అనేక ప్రయోగాలు చేశారు. టిడిపి హయాంలో కుప్పంలో ఎంతో జరిగిపోయిందని ప్రచారం చేసినప్పటికీ, రైతులకు ఒరిగిందేమీ లేదు. విదేశీ పరిజ్ఞానం ఆ దేశాలకే ఉపయోగపడుతుంది తప్ప భారతదేశంలాంటి వెనుకబడ్డ దేశాల్లో అవే పద్ధతులను అమలు చేయడం సాధ్యంకాదు.

*– జూలకంటి రంగారెడ్డి, సిపిఎం*

## హడావుడిగా అమలు చేస్తే విఫలమే

ప్రభుత్వ సంకల్పం ఎంత గొప్పదైనా ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి కొత్త విధానాలకు రైతులు సంసిద్ధంగా లేరు. ఇలా హడావుడిగా కాకుండా రైతుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నిదానంగా అమలు చేయడమే మంచిది.

*– పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ*

## రైతుల్లో అవగాహన పెంచితే అద్భుతాలే

రైతులు పండించే పంటలకు నిలవ సౌకర్యం కలిగించి, మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకు రాగలిగితే సన్నకారు రైతులే అద్భుతాలు సృష్టిస్తారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను, వసతులను వినియోగించుకోవడంలో అవగాహన కల్పిస్తే ఉత్పత్తిని ఇప్పుడున్న పద్ధతిలో కూడా అధికం చేయగలరు. చిన్న రైతుల పొలాలను తీసుకుని వారిని ఇబ్బంది పెట్టే బదులు ప్రత్యామ్నాయాలు వెదకాలి.

*– జయప్రకాష్ నారాయణ్, లోక్‌సత్తా*

## రైతు ప్రయోజనాలకే మా మద్దతు

ఈ విధానంలో అనేక అనుమానాలు ఉన్నాయి. భూమిపై తమ హక్కును కోల్పోతామన్న భయం రైతుల్లో బలంగా ఉంది. వాటిని తొలగించే ప్రయత్నం చేయాలి. మా మద్దతు ఎప్పుడూ రైతులకే.

*–శోభానాగిరెడ్డి, పీఆర్‌పి*

# గాంధీ మాటను గుర్తుంచుకుందాం

**– ఎం.ఎస్. స్వామినాథన్**

రైతు ఆదాయం పెంచడం, మార్కెట్ భద్రత, వాతావరణంలో వస్తున్న మార్పులకు తగ్గట్టుగా రుతుపవనాల యాజమాన్యం, జీవ వైవిధ్యం లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసర ఉందని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, జాతీయ రైతు కమీషన్ మాజీ అధ్యక్షుడు శ్రీ ఎం.ఎస్. స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. సహకార సేద్యం అమలుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

వ్యవసాయ ఉత్పాదకత, దిగుబడులు పెంచడం కంటే రైతుకు వచ్చే ఆదాయం ముఖ్యమన్నారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటిని సరఫరా చేయడంతోపాటు నీటి వినియోగ సామర్థ్యం పెంచాలని సూచించారు. యువత వ్యవసాయానికి దూరంగా ఉంటోందని, వారు ఇందులోకి రావాలంటే సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. పాడి పరిశ్రమ సమాఖ్యల నుంచి కొన్ని అనుభవాలను సహకార వ్యవసాయానికి తీసుకోవాలన్నారు. కేరళలో రైతులు ఓ గ్రూపుగా ఏర్పడి పరస్పర సహకారంతో వ్యవసాయం చేస్తున్నారని, సహకార సేద్యంలో భాగస్వాములయ్యే ప్రతి రైతు ప్రయోజనం పొందాలని సూచించారు. వరదలు, కరువు, సముద్ర మట్టం పెరగడంలాంటి ఉపద్రవాల నుంచి రక్షించుకోవడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం గ్రామానికి ఇద్దరితో రిస్క్ మేనేజ్‌మెంట్ కమిటీ వేయాలని, ఇందులో ఒక మహిళ, పురుషుడు ఉండాలని సూచించారు. సన్న, చిన్నకారు రైతులు కూడా అధికాదాయం పొందాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని ముందడుగు వేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గాలంటే ఇదొక్కటే మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ఆర్థికాభ్యున్నతి దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రత పథకం, జాతీయ విత్తనాభివృద్ధి పథకాల ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధికి నిధులు కేటాయిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఆహారధాన్యాల సాగుపై రైతులకు మక్కువ పెరిగిన పరిస్థితుల్లో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే 'శ్రీ' వరి సాగు పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. సమూహాలు మాత్రమే అత్యధిక ఉత్పత్తిని చేయగలవన్న మహాత్మాగాంధీ మాటలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. దీన్నుండే చిన్న, సన్నకారు రైతులతో సహకార, సామూహిక సేద్యం వచ్చిందన్నారు. దేశంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు, మార్కెట్ సౌకర్యాలు, గోదాములు పూర్తిగా కల్పించాల్సి ఉందన్నారు. రాజీవ్ కృషి వికాస్ యోజన ద్వారా ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని స్వామినాథన్ పేర్కొన్నారు. ☆

రైతుల ఆదాయం పెంచాలన్న ఉత్పాదకతలో ఏర్పడిన స్తబ్దత తొలగాలన్నా 'సహకార' మార్గం తప్ప గత్యంతరం లేదు. గతంలో ఈ దిశగా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైన దృష్ట్యా ఇది అంత సులువైన పని కాదన్నది సుస్పష్టం. గత వైఫల్యాలకు జడిసి తిరిగి ఈ మహత్కార్యాన్ని చేపట్టక పోవడం విజ్ఞత అనిపించుకోదు. పెద్ద కమతాల్లో వ్యవసాయం చేస్తే కలిగే లాభాలేమిటో రైతులకు నచ్చచెప్పేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలి. సహకార విధానంలో రైతులకు సొంత వనరులు ఏర్పడే సావకాశం ఉంది.

చైనా, ఇజ్రాయెల్ దేశాల్లో ఈ విధానం సత్ఫలితాలకు ఇచ్చింది.

మన దేశంలో పంట భూమి రైతుకు ప్రాణంకన్నా మిన్నకావడం వలన, తన భూమిపై ప్రత్యక్ష అజమాయిషీ వదులుకోవడానికి అంత సులువుగా ఇష్టపడడు. కరీంనగర్ జిల్లా ముల్కనూర్, నిజామాబాద్ జిల్లా అంకాపూర్ సహకార సంఘాల విజయపరంపర నుంచి అటు రైతాంగం, ఇటు ప్రభుత్వం స్ఫూర్తి పొందవలసి ఉంది.

గ్రామాల్లో సంపద ఎలా పెరగాలి..? ఆ సంపద గ్రామీణ ప్రజలకే అందాలంటే ఏ విధమైన కార్యక్రమాలు చేపట్టాలి..? అన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సహకార వ్యవసాయ విధానానికి అఖిలపక్ష సమావేశంలో సానుకూల స్పందన లభించింది. "సహకార వ్యవసాయంలో ఎన్నో ఉమ్మడి ప్రయోజనాలున్నాయి. కమతాలను మరింత మెరుగ్గా ఉపయోగించుకోవచ్చు.. తక్కువ ఖర్చుతో యాంత్రీకరణ చేపట్టవచ్చు. పండిన పంటను మెరుగ్గా దాచుకోవచ్చు. రైతు మరింత మెరుగైన ధర పొందవచ్చు" అని ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి జూబ్లీహాలులో జరిగిన అఖిలపక్ష భేటీలో వివరించారు.

ఈ ఉమ్మడి సాగు పద్ధతిలో చేరాల్సిందిగా ఏ ఒక్క రైతునూ బలవంత పెట్టబోమని స్పష్టం చేశారు. "ఇచ్ఛికంగా, ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుని వచ్చే గ్రామాల రైతులతోనే సొసైటీలను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం" అని తేల్చిచెప్పారు.

వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ దేశంలో ప్రత్యేకత నిలుపుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. సహకార సాగు విధానం గురించి ఆలోచించటం ఆదర్శనీయమని జాతీయ రైతు కమీషన్ మాజీ చైర్మన్ స్వామినాథన్ అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో సహకార విధానంతో సత్ఫలితాలు వస్తున్నాయని

## బడ్జెట్ భేటీలో బిల్లు

సన్న, చిన్నకారు రైతుల ఆదాయం, ఉత్పత్తి పెంపు లక్ష్యంగా అమలు చేయతలపెట్టిన సహకార వ్యవసాయానికి సంబంధించి ప్రత్యేక చట్టం తీసుకురావాలని ముఖ్యమంత్రి వైయస్ నిర్ణయించారు. ఇందుకు సంబంధించి వ్యవసాయ, న్యాయశాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సమీకృత వ్యవసాయ, సహకార సొసైటీ పేరుతో వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన బిల్లును రూపొందించాల్సిందిగా ముఖ్యమంత్రి అధికారాలను ఆదేశించారు.

సొసైటీల్లో పొలాలున్న రైతులకు తప్ప ఇతరులకు అవకాశం ఉండరాదని.. ఎన్ని ఎకరాలున్నా ఒకరికి ఒక్క ఓటే ఉండేవిధంగా బిల్లులో పొందుపరచాలని నిర్ణయించారు. సొసైటీ పాలకమండలి ఏ విధంగా ఉండాలనే అంశంపై కూడా ప్రభుత్వం విదానాన్ని రూపొందిస్తుంది. ఏ గ్రామంలో సొసైటీలు ఆ గ్రామం పేరుతో సోసైటీలను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తారు. పూర్తిగా రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా చట్టాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ☆

## సహకార విధానంలో రైతుల ఆదాయం రెండింతలు

ఒక గ్రామంలో వెయ్యెకరాల భూమిని రైతులు సహకార పద్ధతిలో ఒకే కమతంగా మార్చారనుకుందాం... ఆ భూమి మొత్తాన్ని రైతులు హక్కులతో తమ సొసైటీకి బదలాయిస్తారు. ఇలా బదలాయించిన భూమి విలువ పది కోట్లు ఉంటుందనుకుందాం.రైతుకు ఉన్న భూమిని బట్టి, దాని మార్కెట్ రేటు ప్రాతిపదికన ఆ సొసైటీలో అతడి వాటా నిర్ణయమవుతుంది. సొసైటీకి అంతే మొత్తం (రూ.పది కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ మొత్తాన్ని పెట్టుబడిగా చూపి కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటుంది. ఈ సొసైటీని నిర్వహించుకునేదీ స్థానికులే, ఇలా సమీకరించుకున్న డబ్బుతో వ్యవసాయానికి అవసరమేన విత్తనాలు, ఎరువులు, పరికరాల వంటివి కొనుగోలు చేయటంతో పాటు.... గోదాము నిర్మాణం, వ్యవసాయాధికారుల నియామకం వంటివన్నీ సొసైటీ సొంతంగా చేపడుతుంది.

నకిలీ విత్తనాలు, డూప్లికేట్ పురుగుమందులు, నాసిరకం ఎరువులతో రైతు మోసపోకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకుంటారు. వ్యవసాయంలో ఆధునిక మెలకువలను అందిస్తారు. వ్యవసాయోత్పత్తికి అవసరమైన ఇన్‌పుట్స్ (విత్తనాలు, ఎరువులు వంటివి)తో పాటు, పండిన పంట (ఔట్‌పుట్) ను కల్లంలోనే ఎంతో కొంతకు తెగనమ్ముకోకుండా సమర్థంగా మార్కెట్ చేసుకోవటానికి సహకార విధానం అండగా ఉంటుంది.

### సంవత్సరం పొడవునా ఆదాయం...

సహకార క్షేత్రాల్లో కేవలం వరి వంటి పంటలే కాకుండా చేపలు, కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకం వంటివి చేపడతారు. అత్యుత్తమమైన సేద్య విధానాలను అనుసరిస్తారు. ఇలా భారీ ఎత్తున, పెద్ద కమతాల్లో చేపట్టే కార్యక్రమాల వల్ల.. గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు వేగాన్ని అందుకుంటాయి. స్థానిక ఉపాధికి సంవత్సరం పొడవునా హామీ లభించి వలసలకు తెరపడుతుంది. స్థానిక విద్యావంతులతో సహా అందరికీ అక్కడే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. లైవ్‌స్టాక్ పెంపకం, సెరీ కల్చర్ వంటి వాటిని నమ్ముకోవటం వల్ల వర్షాలు తక్కువ పడిన సంవత్సరాల్లో ప్రత్యామ్నాయాల ద్వారా సొసైటీ సభ్యులకు ఆదాయం లభిస్తుంది.

### కనీస జోక్యం... గరిష్ట అండ..

సహకార వ్యవసాయానికి సంబంధించి అనేక అనుమానాలు ఉన్న మాట వాస్తవమే. సహకార సంఘానికి రైతు తన భూమి మీద హక్కుల ను అప్పగించటానికి సిద్ధపడతాడా? ఈ విధానంలో సమస్యలేమిటి అనే అంశాలు చర్చించాల్సినవే. అయితే రైతుకు జరిగే మేలును కూడా విమర్శలు పరిగణనలోకి తీసుకోవాలి. గడిచిన అయిదేళ్ళలో ఉత్పాదకతను ప్రాతిపదికగా తీసుకుని, గరిష్టంగా పండిన పంట ప్రాతిపదికన రైతుకు ఏటా చెల్లించాలన్నది ప్రభుత్వ ప్రతిపాదనల్లో కీలకమైనది. అదీకాక రైతు తన వాటాను అమ్ముకోవాలనుకుంటే సొసైటీలోని సభ్యులే కొనుగోలు చేయవచ్చు. కుదరని పక్షంలో ప్రభుత్వమే ముందుగా నిర్ణయించిన మార్కెట్ రేటుకు కొనుగోలు చేస్తుంది. ఇది రైతులు ఏర్పాటు చేసుకునే సహకార పద్ధతే తప్ప, ఇదేదో మల్టీ నేషనల్ కంపెనీలు ఏర్పాటు చేసేది కాదు. ఈ పద్ధతిలో తమ జోక్యం కనీస స్థాయిలో, అండ గరిష్ట స్థాయిలో లభ్యమవుతాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ ప్రయోగంలో లోపాలుంటే సరిదిద్దుకోవచ్చు. సొంతంగా నష్టం వచ్చేటట్టయితే ఆదుకోవడానికి తానున్నానని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యంతో పాటు ఉరుముతున్న ఆహార మాంద్యానికి ఇదే సరైన పరిష్కారమని నిపుణులు అంటున్నారు. ☆

చెప్పారు. అయితే సహకార వ్యవసాయం కొనసాగించాలా.. లేదా.. అన్నది తేల్చాల్సింది రైతులేనన్నారు. మార్పు దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను అఖిలపక్ష నాయకులు అత్యధికులు ప్రశంసించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ఉమ్మడి వ్యవసాయ విధానంపై ఎక్కువమంది పెద్దగా వ్యతిరేకత వ్యక్తం చేయలేదు. కాకపోతే ఈ విధానం అమలులో చిత్తశుద్ధిపై కొందరు అనుమానాలు వ్యక్తం చేశారు. భూమిపై గల హక్కును ఎట్టి పరిస్థితులలోనూ వదులుకునేందుకు రైతులు ఒప్పుకోరని పలువురు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ శాసనసభ, శాసనమండలిలో చెప్పినట్లుగానే అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి అన్నమాట నిలబెట్టుకున్నారని అందరూ అభినందించారు.

### సహకార వ్యవసాయ విధానంలో జాగ్రత్తలు పాటిస్తాం

పేదవాళ్లకు సంబంధించిన భూములు పెద్దవాళ్ల చేతిలోకి పోతాయేమో అన్న భయం లేకుండా.. సహకార వ్యవసాయ విధానం రూపకల్పనలో జాగ్రత్తలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "సహకార విధానం వల్ల పంట రుణాలను తేలిగ్గా తెచ్చుకునే వీలుంటుంది.. నిఘా పెరిగి మేలైన విత్తనాలు, నాణ్యమైన ఎరువులు వాడకం జరుగుతుంది. పంటలను ప్రాసెస్ చేసుకునే సౌలభ్యం ఏర్పడుతుంది.. దీంతో దిగుబడి పెరిగి రైతు ఆర్థిక స్థితిలో మేలైన మార్పు వస్తుంది.." అని వివరించారు.

"సహకార వ్యవసాయం అన్నది కేవలం ఒక ఆలోచన. దీనిపై వ్యక్తమయ్యే మీ అభిప్రాయాల్లో మేలైన వాటిని విధాన రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటాం" అని ప్రతిపక్ష నేతలకు వ్యవసాయ రంగ నిపుణులకు చెప్పారు. వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించటం మాత్రమే కాదని సీఎం వ్యాఖ్యానించారు. పశువుల పెంపకం, పట్టు పరిశ్రమ, ఉద్యానవన పంటలు, మత్స్య పరిశ్రమ తదితరాల వైపు దృష్టి సారించాలన్నారు.

గత ఐదేళ్లుగా వరుణదేవుడి దయ, రైతుల సహకారం, అమలు చేసిన పథకాల వల్ల మేలైన దిగుబడి సాధించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఈ ఘనత సాధించిన దాఖలాలు లేవన్నారు. ఈ సమావేశంలో జాతీయ రైతు కమీషన్ మాజీ చైర్మన్ ఎం. ఎస్. స్వామినాథన్ ప్రత్యేక అతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పెట్టుబడులు పెరగడం, చిన్న కమతాలు ఎక్కువ కావడంతో యాంత్రీకరణ అమలు కష్టసాధ్యమన్నారు. అదే సహకార పద్ధతిలో అయితే.. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమలతో దిగుబడులుపెంచుకునే వీలుందని చెప్పారు.

సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తూ. . కార్పొరేట్ సహకారం, రుణాల సదుపాయాలను కల్పించి ప్రత్యేకంగా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అయితే సహకార సాగుపై క్షేత్రస్థాయి నిర్ణేతలు రైతులేనని స్పష్టం చేశారు.

రైతులు స్వచ్ఛందంగా ముందుకొస్తే జిల్లాకు రెండేసి గ్రామాలను ఎంపిక చేసే వీలుందని తెలిపారు. తొలుత వ్యవసాయ టెక్నాలజీ మిషన్ వైస్ చైర్మన్ సోమయాజులు సహకార వ్యవసాయ విధానం గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో ఆహ్వానితులకు వివరించారు.

ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్‌జిపి రావు, శ్రీ సిద్ధి, శ్రీ ఎస్‌వీఎస్ శాస్త్రి తదితరులు కూడా ప్రసంగించారు.

*– టి. నర్మద*


సోనియాకు అభివృద్ధి ప్రణాళికను తెలుపుతున్న సర్పంచ్


జాలిపూడి గ్రామం

# ఆ 195 గ్రామాలు ...
# కడిగిన ముత్యాలు



'నోరు బాగుంటే ఊరు బాగుంటుంది' అనేది సామెత. మరి ఊరు బాగుంటే...మనమంతా బాగుంటాం. మన పిల్లలు రోగాలు,రొచ్చులు లేకుండా ఉంటారు. భవిష్యత్ తరాలకు భరోసా ఉంటుంది. ఈ ఆలోచన వచ్చిన వెంటనే వారంతా ఉబుసుపోక కబుర్లకు ఫుల్‌స్టాప్ పెట్టి, సంపూర్ణ పారిశుధ్య ఉద్యమానికి నడుం బిగించారు.అభివృద్ధంటే రోడ్లు, డ్రెయిన్‌లే కాదు, ఆర్థికంగా బలపడటమే కాదు ... గ్రామాలు పచ్చగా వెలగాలి, స్వచ్ఛంగా పెరగాలి, పరిశుభ్రమైన గాలి నీరుతో తులతూగాలనే సదుద్దేశంతో సామూహికంగా పోటీలు పడ్డారు. ఫలితం... పశ్చిమ గోదావరి జిల్లాలో ఏకంగా 195 గ్రామపంచాయితీలు సంపూర్ణ పారిశుధ్య ఉద్యమంలో జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన నిర్మల్ గ్రామ పురస్కార్‌కు ఎంపికయ్యాయి, తమ గ్రామాలను కడిగిన ముత్యాల్లా చేసిన ఆ గ్రామస్థుల అసాధారణ ఉద్యమం గురించే ఈ వ్యాసం.

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఈ గ్రామాల్లో ఒకప్పుడు అపరిశుభ్రత అడుగడుగునా కనిపించేది. వీధుల గుండా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. బహిరంగ మల విసర్జన ఆ గ్రామాలను రోగాల బారిన పడేసేది, అంటురోగాలు, అనారోగ్యంతో గ్రామస్తులు తల్లడిల్లేవారు.

మూడేళ్ళ క్రితం....గ్రామాలు పరిశుభ్రంగా వెలిగిపోయేలా చేయాలని కేంద్ర ప్రభుత్వమే ముందుకొచ్చింది. పరిసరాల పరిశుభ్రతలో నిబంధనలు పాటిస్తే మావంతుగా ఆర్థికసాయం చేస్తామని ప్రకటించింది. 'నగదు బహుమానాన్ని అందుకునే సత్తా మీకుందా?' అంటూ గ్రామ పంచాయితీ ప్రతినిధులకు 2005లో ఒక సవాలు విసిరింది. బహిరంగ మలవిసర్జన నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతలో ఎవరైతే విజయం సాధిస్తారో వారికే గ్రామ పట్టాభిషేకం చేస్తామంటూ ఆశ చూపింది. అప్పటికీ దీనిపై అవగాహన అంత తొందరగా రాలేదు. ఇదేదో సినిమా అవార్డులా ఉంది అనుకున్నవారూ లేకపోలేదు. మొదట్లో



సృష్టించుకోగలిగారు. "మా పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటం కంటే మాకేమి కావాలనుకున్న వారంతా ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. దాదాపు ప్రతీ గ్రామంలోను ఇదే పరిస్థితి. భవిష్యత్ తరాలను రోగాల నుంచి కాపాడుకోవాలంటే సంపూర్ణ పారిశుద్ధ్యమే శరణ్యం" అని గ్రామీణ మంచి నీటి సరఫరా విభాగానికి చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు.

చూద్దాం చేద్దాం అనుకున్నవాళ్లే ఎక్కువ. నిదానంగా ఒక్కొక్కరూ కార్యరంగంలోకి దిగారు. ప్రజాప్రతినిధులు సైతం నడుంకట్టారు. మాటలతోకాదు, ఈసారి చేతల్లోచూపించారు. సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. పార్టీ రహితంగా చేయిచేయి కలిపారు. కొద్ది కాలానికే కొన్ని గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. జనమూ కలిసొచ్చారు. అందరూ కలసి ముందుకొచ్చారు. బహిరంగ మలవిసర్జన చేసేవారిపై కత్తికట్టారు. భవిష్యత్ తరాలను దెబ్బతీస్తారా అంటూ విరుచుకుపడ్డారు. అభివృద్ధి దిశగా పల్లెలు గొప్పలు చెప్పడంతోనే సరిపుచ్చిన తరానికి కొత్త పాఠం నేర్పాలని సిద్ధపడ్డారు.

## ప్రజా ప్రతినిధుల మధ్య పోటీ

నిజం చెప్పాలంటే తమ ఊరు పరిశుభ్రంగా ఉండాలని, అద్దంలా మెరిసిపోవాలని కోరుకున్న ప్రజాప్రతినిధుల మధ్య పోటీయే ఇది. తొలి అంకంలో కొందరు తమకు అంత సీనుందా అనుకున్నారు. ఏం ఎందుకులేదని మరికొందరు పట్టుదలకు దిగారు. పల్లె పట్టుదల ఏపాటిదో నిరూపిస్తామన్నారు. నిరూపించడమేకాదు మొదటి స్థానానికి ఎగబాకుతామన్నారు. ప్రజాప్రతినిధులుగా తమ హయాంలో ఎంతోకొంత జరిగిందని సరిపుచ్చుకోలేమని, గ్రామానికి ఓ ఖ్యాతంటూ సమకూర్చి తమ పాత్ర ఏపాటిదో నిరూపిస్తామని తమను తామే సవాల్ చేసుకున్నారు. ఆవిధంగానే జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ తమకు ఉన్న నిబద్ధత ఏపాటిదో నిరూపించు కున్నారు. తాము పాలిస్తున్న గ్రామాలను అద్దంలా తీర్చిదిద్దారు. బహిరంగ మల విసర్జనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం విజయవంతమై నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డులను ఏక మొత్తంగా సాధించారు. గర్వంగా తల ఎగరేసారు. సంపూర్ణ పారిశుద్ధ్యంతో ఇప్పుడు అనేక గ్రామాలు కళకళలాడుతున్నాయి. రోడ్ల వెంబడి ముక్కు మూసుకుని వెళ్ళే పరిస్థితి నుంచి హాయిగా ఆడుతూ పాడుతూ చెంగుచెంగున వెళ్లే ఒక కొత్త వాతావరణాన్ని

## అనారోగ్యంపై చైతన్యాస్త్రం

అసలు 'నిర్మల్ పురస్కార్' అంటే ఏమిటో మూడేళ్ళ క్రితం ఎవరికీ తెలియదు. ఒకరిద్దరు చదువుకున్న సర్పంచ్‌లకే దీనిపై అవగాహన ఉండేది. తమ పాలనలో తమకంటూ ఒక గుర్తింపు కావాలని తపనపడ్డవారే దీని గురించి ఆలోచించారు. వీరిలో నిరక్షరాసులైన ప్రజాప్రతినిధులు కూడా లేకపోలేదు. సర్కారు విదిల్చే నాలుగు రూపాయల నిధులతోనే అభివృద్ధి సాధ్యంకాదని గుర్తించి భవిష్యత్ తరాల అనారోగ్యాన్ని భూతంలా వాళ్ల కళ్లముందు నిలబెట్టారు. ఈ భయమూ, నిర్మల్ పురస్కార ఆశ రెంటినీ చూపెట్టి ప్రజలను కూడకట్టారు. వీరికి అధికారులు కొందరు తోడుగా నిలిచారు. నాలుగు రూపాయలు ఉంటే సరిపోదు, నాలుగు కాలాలపాటు హాయిగా ఆరోగ్యంతో ఉండాలంటే ఏమి చేయాలో ముందుగా ప్రజలకు వివరించడం మొదలుపెట్టారు. విని ఊరుకుంటే కాదు, ఆచరణలో చూపాలంటూ ఒక హుకుం జారీచేసారు. అయినప్పటికీ



హన్వాడలో సంపూర్ణ పారిశుద్ధ్యం అమలు తీరును పరిశీలిస్తున్న జిల్లా ప్రజాప్రతినిధులు

**నిబంధనలను అతిక్రమిస్తే 100 నుంచి150 రూఆయల దాకీ జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. దీనివల్ల సమస్య 80శాతం మేరకు తగ్గిందని సర్పంచ్ అద్దేపల్లి పండు తెలిపారు. క్రమక్రమంగా కమ్యూనిటీ టాయిలెట్లు కట్టించడమేగాక అక్కడ చేతులు శుభ్రం చేసుకోవడానికి సబ్బులను కూవా అందుబాటులో ఉంచారు. అనంతరం వ్యక్తిగత టాయిలెట్లను కూడా కట్టించడంద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొన్నారు.**

ప్రజాప్రతినిధులుగా తమ హయాంలో ఎంతోకొంత జరిగిందని సరిపుచ్చుకోలేమని, గ్రామానికి ఓ ఖ్యాతంటూ సమకూర్చి తమ పాత్ర ఏపాటిదో నిరూపిస్తామని తమను తామే సవాల్ చేసుకున్నారు. ఆవిధంగానే జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ తమకు ఉన్న నిబద్ధత ఏపాటిదో నిరూపించుకున్నారు.

కొన్ని చోట్ల ఎప్పటిలాగే ఆరుబయలు వ్యవహారమే సాగిపోయేది. లాభం లేదని నల్లజర్ల మండలం అనంతపురంలో ప్రజాప్రతినిధులు మరో అస్త్రం ప్రయోగించారు. బహిరంగ మలవిసర్జనకు పాల్పడేవారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరికలు చేశారు. మొదట్లో ఈ చర్యను స్థానికులు ఛీ కొట్టారు. రాను రాను పరిస్థితి వారికీ అర్థమైంది. అప్పటినుంచి తాము కూడా ఈ ఉద్యమంలో సైనికులమేనని ప్రతినపూనారు.

## ప్రతి గ్రామానిదీ ఒక్కో అనుభవం

జంగారెడ్డి గూడెం మండలంలోని పుట్లగట్లగూడెంలో గ్రామస్తులు బహిరంగ మల విసర్జనకు వెళ్తున్న ఎనిమిది ప్రాంతాలను గుర్తించి అక్కడి వారితో టీమ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతీరోజూ ఉదయం మూడు నుంచీ ఆరు గంటలదాకా సదరు టీమ్ ఎవకూ బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా కాపలా కాసేవారు. నిబంధనలను అతిక్రమిస్తే 100 నుంచి 150 రూపాయల దాకా జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. దీనివల్ల సమస్య 80శాతం మేరకు తగ్గిందని సర్పంచ్ అద్దేపల్లి పండు తెలిపారు. క్రమక్రమంగా కమ్యూనిటీ టాయిలెట్లు కట్టించడమేగాక అక్కడ చేతులు శుభ్రం చేసుకోవడానికి సబ్బులను కూడా అందుబాటులో ఉంచారు. అనంతరం వ్యక్తిగత టాయిలెట్లను కూడా కట్టించడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొన్నారు. దీంతో పుట్లగట్ల గూడెం పరిశుభ్రంగా మారి పురస్కారానికి ఎంపికైంది.

పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామంలో 3 వేల ఇళ్లుంటాయి ప్రతీ ఇంటి ముందు, వీధి చివర చెత్త కుప్పలు కనిపించేవి. కాస్త చీకటి పడగానే చెత్తను ఎవరికీ కనిపించకుండా వీధి చివరపోయటం వారికి అలవాటు. అలా చెత్తను ఇష్టమొచ్చినట్లు పారేయకుండా ఉండటానికి ఏం చేయాలో అడిగారు ఆ ఊరి సర్పంచ్ కర్రి గౌరీ సుభాషిణి. రెండు పూటలా చెత్త పారపోయడానికి రిక్షాలను పంపితే చాలని గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ 3000 ప్లాస్టిక్ డబ్బాలు కొని ప్రతీ ఇంటికి ఇచ్చారు. పొద్దున, సాయంత్రం చెత్త రిక్షాలను ఇంటింటికి పంపించేవాడు. క్రమక్రమంగా ఈ అలవాటు గ్రామస్తుల్లో మార్పు తీసుకొచ్చింది. మిగతా గ్రామాలతో పోటీపడి తమ గ్రామ పారిశుద్ధ్యానికి నడుం బిగించి నిర్మల్ పురస్కారాన్ని సాధించారు. సిద్ధాపురం సర్పంచ్ అల్లూరి రంగరాజు కూడా గ్రామంలో పరిశుభ్రత కోసం మహిళలు, పిల్లలు, ఉద్యోగులతో తరచూ ర్యాలీలు నిర్వహించేవారు. ఈ ర్యాలీలు గ్రామస్తుల్లో చైతన్యాన్ని తీసుకొచ్చాయి. ఇలా ప్రతి గ్రామానిదీ ఒక్కో అనుభవం.

## ఎంపికా ఓ పరీక్షే

సంపూర్ణ పారిశుద్ధ్యం కింద అవార్డు పొందాలంటే ఆషామాషీ కాదు. మహారాష్ట్ర, ఒరిస్సా, హర్యానా తదితర రాష్ట్రాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో జనసాంద్రత మన దగ్గరే ఎక్కువ. ఆ రాష్ట్రాల్లో మైనర్ గ్రామ పంచాయితీల్లో జనాభా 500 నుంచి వెయ్యిలోపే ఉంటుంది. అదే మన దగ్గరయితే వెయ్యినుంచి రెండు వేల దాకా ఉంటుంది. అందుకే ప్రజల భాగస్వామ్యం మన దగ్గర ఇంకా ఎక్కువ కావాల్సి ఉంటుంది. గడిచిన నాలుగేళ్ళ వ్యవధిలో ప్రజల్లో వచ్చిన చైతన్యమే ఇప్పుడు సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా ముందుకు సాగుతోంది.

నిర్మల్ గ్రామ పురస్కార్ పేరిట అవార్డు దక్కించుకోవాలంటే ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు స్థానికంగా ఉన్న అధికారులకు ఒక నామినేషన్ అందజేయాలి. మా ఊరు ఇకముందు దుర్గంధానికి, అపరిశుభ్రతకు పూర్తిగా దూరమని చెప్పాలి. ఆమేరకు ప్రయాణం చేయాలి. అసలు కథ అప్పుడే ప్రారంభమవుతుంది. ఈ నామినేషన్ల మండల స్థాయిలో ఉండే అధికారులు పరిశీలించి ఏ గ్రామం దీనికి అర్హత సాధిస్తుందో తేలుస్తారు. ఆ తరువాత ఎంపిక చేసిన గ్రామాల్లో అపరిశుభ్రతపై ఉద్యమానికి శ్రీకారం చుడతారు. నాలుగు నెలలకు పైగానే పరుశుభ్రతపై పోటీలు సాగుతాయి. గ్రామానికి గ్రామానికి మధ్య నువ్వా నేనా అనే రీతిలో ఈ పోటీ ఉంటుంది. ఒకరికి మించి ఒకరు రోడ్డు మీద చెత్తాచెదారం అనేది అదృశ్యమయ్యేలా తెల్లవారుఝామున 4.30 నుంచే కార్యరంగంలోకి



దిగుతారు. ఇలా ఏ రోజుకారోజు పరిస్థితి మెరుగుపడేలా జాగ్రత్త పడతారు.

## చెక్..చెక్..చెక్...

అంతా బాగానే చేసాం, ఓ అవార్డు పారేయండంటే నిర్మల్ పురస్కార్ రాదు. కేంద్ర స్థాయిలో ఓ టీమ్‌ను ఎంపిక చేసిన గ్రామాలకు పంపుతారు వారు అడుగడుగునా తనిఖీలు చేస్తారు. ప్రజల్లో వచ్చిన చైతన్యాన్ని అంచనా వేస్తారు. తాము వచ్చిన రోజునే ఇంత శుభ్రంగా ఉంచారా లేక ఈ ఉద్యమంపట్ల నిబద్ధతతోనే ఉంటున్నారా అనేది కనిపెడతారు.





పల్లెల్లో ఎక్కడా రోడ్లపై పేడ గాని, చెత్తకుప్పలుగాని, బహిరంగ మలవిసర్జన దాఖలాలు గాని కనిపించకూడదు. గ్రామ పంచాయితీ కార్యాలయం తదితర అన్ని చోట్లా పరిశుభ్రత ఉట్టిపడాలి.

## ఎలా గెలిచారంటే...

పశ్చిమగోదావరి జిల్లా ప్రజాప్రతినిధులు ఈ ఉద్యమంలో ఎలా గెలిచారో తెలుసుకుంటే ఆశ్చర్యం కలగకమానదు. ఇంటా బయట వ్యతిరేక, అనుకూల ప్రభావం ఉన్నా కూడా బేఖాతరు చేసి అనుకున్న లక్ష్యాలను చేజిక్కించుకున్నారు. 2006లో కేవలం ఒకే ఒక్క గ్రామం జువ్వలపాలెం సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా పేరు తెచ్చుకుని నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డు తీసుకుంది. 2007లో 28 గ్రామాలు ఈ అవార్డు దక్కించుకోవడానికి పోటీ పడ్డాయి. 2008కల్లా సీను మారింది. పోటీ పెరిగింది. రాష్ట్రంలోనే ఎందుకు తొలిస్థానంలో నిలవలేమనే పట్టుదల పెంచుకున్నారు. బరిలోకిదిగి తమ గ్రామాలను అద్దంలా మార్చేసారు. ఒకటి కాదు ఏకంగా 195 గ్రామాలను నిర్మల్ పురస్కార్‌కు ఎంపిక చేసామంటూ కేంద్రం ప్రకటించిన వెంటనే ఆగ్రామాల్లోని వారంతా ఆనందంతో చిందులు వేశారు. ఇక ముందు కూడా పారిశుధ్యం అమలులో తమదే పైచేయి కావాలని ప్రతిన పూనారు. జాతీయ స్థాయిలో ఎనిమిదవ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయిలో తొలి స్థానం దక్కించుకున్నారు. తమ గ్రామాలకు పెద్ద మొత్తాన్నే అభివృద్ధి కోసం సాదించుకోగలిగారు.

జనాభా ప్రాతిపదికన ఈ అవార్డులతో నగదు బహుమానాన్ని అందిస్తారు. వెయ్యి జనాభాకు దిగువనున్న గ్రామం ఏదైనా అవార్డుకు ఎంపికైతే 50వేల రూపాయల, వెయ్యి నుంచి రెండువేల జనాభాకు లక్ష రూపాయలు, ఆపైబడి మూడు నుంచి ఐదు లక్షల వరకు నగదు బహుమానం ఉంటుంది. బహుమతి వచ్చిందని సంబరపడితే కాదు. భవిష్యత్తులో గ్రామంలో ఎక్కడా చెత్తచెదారం లేకుండా చెత్త బుట్టల ఏర్పాటు, గ్రామశివార్లలో వేస్ట్ మేనేజ్‌మెంట్ స్కీమ్‌లను అమలు చేసుకోవాలి.



## అందరినీ కలిసారు

ఇక్కడితో సరిపెట్టుకోకుండా.... పొరుగు రాష్ట్రాల్లో అక్కడేమి జరుగుతుందో తెలుసుకోవడానికి ప్రజా ప్రతినిధులు మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రల్లో పర్యటించారు. చిన్నచిన్న పల్లెల్లో శుభ్రత ఉట్టిపడుతుంటే చూసి నివ్వెరపోయారు. ఎవరంతట వారు స్వచ్ఛందంగా తమ ఇంటి పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను చూసిన వారిలో పట్టుదల మరింత పెరిగింది. హర్యానా రాష్ట్రంలోని కర్నాల్ జిల్లాలో ఇప్పటికే అనేక పల్లెలు పూర్తి స్థాయిలో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించాయి. కర్నాల్ జిల్లాను మించి తమ జిల్లాను కూడా తీర్చిదిద్దుకోవాలనే బావనలో ఇప్పుడు పార్టీ రహితంగా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ కార్యకర్తలు ప్రతీరోజూ కొంత సమయాన్ని పారిశుద్ధ్య మెరుగుదలకు కేటాయిస్తున్నారు. “ఈ ఉద్యమం ఇక్కడితో ఆపం. ఈ ఏడాది 400 గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా చేస్తాం. ఇప్పుడు రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించామని సరిపెట్టుకోం. జాతీయ స్థాయిలోనే ఈ స్థానం కోసం పోటీ పడుతాం” అని స్వచ్ఛంధ సంస్థల సమాఖ్య చైర్మన్ ఫాదర్ మోజెస్ అన్నారు.

**జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు అందరూ చేయి చేయి కలిపితే.... గ్రామాల రూపురేఖలు మారడమేగాక, అవార్డులు, రివార్డులతో అభివృద్ధి వైపు మరింత వేగంగా దూసుకుపోవచ్చని నిర్మల్ పురస్కారం పొందిన ఈ గ్రామాలు రుజువుచేశాయి.** ♦



# సహజ వనరుల అభివృద్ధి లో సర్టిఫికెట్ కోర్సు

**సైన్సు, సాంకేతిక పరిజ్ఞానంతో వస్తున్న అభివృద్ధి, ప్రజల దైనందిన అవసరాలు పెరుగుతుండటం సహజ వనరుల సుస్థిరతకు, ప్రజల నాణ్యమైన జీవనశైలికి అపార ముప్పు కలిగిస్తున్నాయి. ప్రజలు, ముఖ్యంగా నిస్సహాయులు అందుబాటులో వున్న సహజ వనరుల పరిధిలో తమ అవసరాలను తీర్చుకోగలిగేలా చేయటమే ప్రస్తుతం దేశంలో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల లక్ష్యం. సమగ్ర విజ్ఞానం, సామర్థ్యం ద్వారా కమ్యూనిటీ స్థాయిలో సహజ వనరుల పెంపు, వినియోగం సహజ వనరుల సుస్థిరత, గ్రామీణాభివృద్ధి మార్పులను ప్రభావితం చేస్తాయి.**

ప్రస్తుతం అమల్లో వున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్.ఆర్.ఇ.జి.ఎస్), సమీకృత వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమం (ఐ.డబ్ల్యు.డి.పి), సమగ్ర భూ అభివృద్ధి పథకం వంటి కార్యక్రమాల రూపకల్పన, అమలులో ప్రజా సమూహాలు చురుకుగా పాల్గొనవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఈ నేపథ్యంలో సహజ వనరుల పెంపుదల వినియోగ ప్రక్రియలో ప్రజలు పాల్గొనేందుకు తోడ్పడటానికి బహుళ అధ్యయనాంశాల్లో వృత్తి నిపుణులను తయారుచేసి అందుబాటులో వుంచాలనే ఉద్దేశ్యంతో 2009 లో సమగ్ర సహజ వనరుల అభివృద్ధి (సి.ఐ.ఎన్.ఆర్.డి) లో సర్టిఫికెట్ కోర్సును ప్రవేశపెట్టారు. సి ఎన్ ఆర్ ఎ ఎమ్ – ఎ ఎమ్ ఆర్ – అపార్డ్, ఎన్ఆర్ఎస్‌ల, ఇక్రిశాట్, సిఆర్ఐఎస్‌లు, ఎన్జీవోలు చెందిన నిపుణుల బృందం ఈ కోర్సును డిజైను చేశారు.

### కోర్సు ముఖ్యాంశాలు :

1. సహజ వనరుల గురించి పరిచయం 2. వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ 3. వెజిటెటివ్ స్ట్రక్చర్లు 4. స్ట్రక్చరల్ చర్యలు 5. ఉత్పత్తి చర్యలు 6. సంరక్షణ చర్యలు 7. కంప్యూటర్ ఫండమెంటల్స్ 8. సర్వేయింగ్, లెవలింగ్ 9. వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్‌లో రిమోట్ సెన్సింగ్, జిఐఎస్ 10. ఏరియా అభివృద్ధి ఉపాధి కార్యక్రమాలు 11. బెంచ్ మార్క్ సర్వే, రిసోర్స్ ఇన్‌వెంటరైజేషన్ 12. ఎన్ఆర్ఇజిఎస్– ఎపి, సిఎల్‌డిపి మరియు వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయి సంస్థల పాత్ర

### సిఐఎన్ఆర్‌డి కోర్సుకు రిసోర్స్ పర్సన్స్

| సంఖ్య | రిసోర్స్ పర్సన్ పేరు | హోదా | డిపార్ట్‌మెంటు |
|---|---|---|---|
| 1. | ఇ.ఆర్.హెచ్. కూర్మారావు, ఎమ్.టెక్. (సాయిల్ & వాటర్ ఇంజనీరింగ్), ఎం.బి.ఎ | సెంటర్ హెడ్ | సిఎన్ఆర్ఎమ్, ఎఎమ్ఆర్ – అపార్డ్ |
| 2. | డా॥ కె.వి. రావు, ఎమ్.టెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), పిహెచ్.డి | సీనియర్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 3. | డా॥ కె. శ్రీనివాస్, ఎమ్.ఎస్‌సి (అగ్రికల్చర్), పి.హెచ్.డి | సీనియర్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 4. | డా॥ సిహెచ్. శ్రీనివాసరావు ఎమ్.ఎస్ (అగ్రికల్చర్), పిహెచ్.డి | ప్రిన్సిపల్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 5. | డా॥ కె.ఎస్. రెడ్డి ఎమ్.టెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో పిహెచ్.డి) | ప్రిన్సిపల్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 6. | డా॥ మహమ్మద్ ఉస్మాన్, ఎమ్.ఎస్‌సి (అగ్రి), పిహెచ్.డి | ప్రిన్సిపల్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 7. | డా॥ జె.వి.ఎన్.ఎస్ ప్రసాద్ ఎమ్.ఎస్‌సి (అగ్రి), పిహెచ్.డి | సీనియర్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 8. | డా॥ ఎమ్.వి. పద్మనాభన్ ఎమ్.టెక్ (అగ్రి ఇంజనీరింగ్), పిహెచ్.డి | ప్రిన్సిపల్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |

| | | | |
|---|---|---|---|
| 9. | డా॥ జి. ప్రతిభ, ఎమ్.ఎస్‌సి (అగ్రి), పిహెచ్.డి | సీనియర్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 10. | డా॥ గోపినాథ్, ఎమ్.ఎస్‌సి (అగ్రి), పిహెచ్.డి | సీనియర్ సైంటిస్ట్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 11. | ఇఆర్.బి. నర్సింహులు, ఎమ్.టెక్ (అగ్రి ఇంజనీరింగ్) | టెక్నికల్ ఆఫీసర్ | సిఆర్ఐడిఎ, హైదరాబాదు |
| 12. | ఇఆర్.డి. ప్రతాప్ రెడ్డి, ఎమ్.ఇ, ఎమ్.ఐ.ఇ | డిప్యూటి డైరెక్టర్, (రిటైర్డ్) | భూగర్భ జల విభాగం |
| 13. | డా॥ దుర్గారావు, బాలానగర్ | సైంటిస్ట్ | ఎన్ ఆర్ ఎస్ ఎ, |
| 14. | డా॥ బాలన్, బాలానగర్ | సైంటిస్ట్ | ఎన్ ఆర్ ఎస్ ఎ, |
| 15. | డా॥ విజయన్, బాలానగర్ | సైంటిస్ట్ | ఎన్ ఆర్ ఎస్ ఎ, |
| 16. | హకీం, బాలానగర్ | సైంటిస్ట్ | ఎన్ ఆర్ ఎస్ ఎ |
| 17. | డా॥ నరేంద్రనాథ్ | సిస్టం అనలిస్ట్ | ఎఎమ్ ఆర్ – అపార్డ్ |
| 18. | శ్రీ వెంకటేశ్వరరావు | కన్సల్టెంట్ | ఎఎమ్ఆర్ – అపార్డ్ |
| 19. | డా॥ సుధాకర్‌రెడ్డి ఎమ్.ఎస్‌సి (అగ్రి) | ఫాకల్టీ | వాలాంతరై |
| 20. | ఇఆర్. ఎమ్. శివప్రసాద్ ఎమ్.టెక్ (సివిల్ ఇంజనీరింగ్) కార్యాలయం | డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ | కమీషనర్ గ్రామీణాభివృద్ధి శాఖ |
| 21. | డా॥ ఎస్. వి. రత్నాచార్యులు ఎమ్.ఎస్‌సి (హార్టికల్చర్) | హార్టికల్చర్ అధికారి | హార్టికల్చర్ కమీషనర్ కార్యాలయం, హైదరాబాదు |
| 22. | ప్రొ॥ డి. మంతి | డైరెక్టర్ | ఐఆర్ఎస్ఎ |
| 23. | ప్రొ॥ మణి | అసోసియేట్ ప్రొఫెసర్ | గాంధి గ్రామ గ్రామీణ, విశ్వవిద్యాలయం, తమిళనాడు |
| 24. | డా॥ చిన్నదొరై | అసిస్టెంట్ ప్రొఫెసర్ | ఎన్ఐఆర్‌డి, హైదరాబాద్ |
| 25. | డా॥ అన్నామలై | అసోసియేట్ | ఎన్ఐఆర్‌డి, హైదరాబాద్ |
| 26. | డా॥ ధీరజ | అసిస్టెంట్ ప్రొఫెసర్ | ఎన్ఐఆర్‌డి, హైదరాబాద్ |
| 27. | డా॥ భాస్కరరావు | అసిస్టెంట్ ప్రొఫెసర్ | ఎన్ఐఆర్‌డి, హైదరాబాద్ |
| 28. | శ్రీ టి. డి. జాన్ | మానసిక నిపుణుడు | హైదరాబాద్ |

ఎన్ఆర్ఇజిఎస్, వాటర్‌షెడ్ తరహా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో ఓపెన్ కేటగిరిలో పాల్గొనేవారిని నియమించుకోవచ్చు. ఎన్‌జిఓ సెక్టారులో కూడా వారు చేరవచ్చు.

## కోర్సులో పాల్గొన్నవారి వివరాలు

| క్రమసంఖ్య | అభ్యర్థి పేరు | హోదా | విద్యార్హతలు | వయస్సు |
|---|---|---|---|---|
| 1. | ఆర్. వెంకటరావు | ఎమ్.పి.డి.ఒ | ఎమ్ఎ, బి.ఇడి | 45 |
| 2. | డా॥ ఎ. నిర్మలాదేవి | ఎమ్.పి.డి.ఒ | పిహెచ్.డి (ఎకనామిక్స్) | 32 |
| 3. | టి. ఉషారాణి | ఎమ్.పి.డి.ఒ | బి.కామ్, బి.ఇడి | 35 |
| 4. | ఎస్.వి. ప్రసాద్ | ఎమ్.పి.డి.ఒ | ఎమ్.ఎ, ఎమ్‌హెచ్ ఆర్ ఎమ్ | 33 |
| 5. | బి.కె. రేవతమ్మ | ఎమ్.పి.డి.ఒ | బి.ఎస్సి | 48 |
| 6. | పి. సింహాచలం | పంచాయితీ కార్యదర్శి | ఎమ్.ఎ, బి.ఇ.డి | 39 |
| 7. | జి. ఎన్.వి..ఎస్. కుమారి | టెక్నికల్ అసిస్టెంట్ | సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లమా | 30 |
| 8. | డి. శ్రీనివాసు | టెక్నికల్ అసిస్టెంట్ | సివిల్, ఇంజనీరింగ్‌లో డిప్లమా | 39 |
| 9. | ఎమ్. హైమావతి | టెక్నికల్ అసిస్టెంట్ | బి.ఎస్సి, బి.ఇడి | 29 |
| 10. | జె. వెంకటేశ్వరరావు | టెక్నికల్ అసిస్టెంట్ | బి.ఎస్సి | 29 |
| 11. | కె. రామారావు | టెక్నికల్ అసిస్టెంట్ | బి.ఎస్సి | 27 |
| 12. | పి. సూర్యనారాయణ | టెక్నికల్ అసిస్టెంట్ | ఇంటర్ వొకేషనల్ | 33 |
| 13. | సి. హెచ్. శివాజి | టెక్నికల్ అసిస్టెంట్ | బి.ఎస్సి | 36 |
| 14. | వై. క్రిష్ణయ్య | టెక్నికల్ అసిస్టెంట్ | బి.ఎస్సి | 35 |
| 15. | కె.రాజు | టెక్నికల్ అసిస్టెంట్ | బి.ఎస్సి | 28 |
| 16. | కె.సురేష్ | టెక్నికల్ అసిస్టెంట్ | ఎమ్.ఎ, బి.ఇడి | 26 |
| 17. | బి. దుర్గా ప్రసాద్ | ఓపెన్ అభ్యర్థి | బి.ఎస్సి | 23 |
| 18. | ఆర్. చక్రవర్తి | ఓపెన్ అభ్యర్థి | బి.ఎ | 23 |
| 19. | సిహెచ్. శివనాగరాజు | ఓపెన్ అభ్యర్థి | బి.ఎస్సి | 31 |
| 20. | సిహెచ్. సాయిక్రిష్ణ | ఓపెన్ అభ్యర్థి | బి.ఎస్సి (సిఎబిఎమ్) | 22 |
| 21. | జి. వెంకటేష్ | ఓపెన్ అభ్యర్థి | బి.ఎస్సి (సిఎబిఎమ్) | 22 |
| 22. | హెచ్. జనార్ధనరావు, డి.ఎల్.పి.ఒ (రిటైర్డ్) | ఓపెన్ అభ్యర్థి | బి.ఎ, ఎల్.ఎల్.బి | 69 |

**కోర్సు ఫీజు :** కోర్సు గురించి పెద్దగా ఆసక్తిలేని అభ్యర్థులను పక్కన పెట్టేందుకు తొలుత అభ్యర్థికి 35000 రూపాయలు చొప్పున కోర్సు ఫీజు నిర్ధారించారు. అనంతరం ఓపెన్ కేటగిరిలో ఆరుగురు అభ్యర్థులు అడ్మిషన్ తీసుకొని కోర్సు ఫీజు తగ్గించమని అభ్యర్థించారు. ఈ మేరకి కోర్సు ఫీజు 10వేల రూపాయలుగా మళ్ళీ నిర్ధారించారు.

*(అనువాదం – డి. సుప్రశాంతి దేవి)*

# బీడు భూములను



అనంతపురం జిల్లా, చెన్నేకొత్తపల్లి మండలం కేంద్రం నుండి సుమారు 36 కి.మీ. దూరంలో, నాలుగు కొండల మధ్య మారుమూల ప్రాంతంలో వున్న ఆ గ్రామం పేరే బ్రాహ్మణపల్లి. బస్సు సౌకర్యం లేదు. బస్సుస్టాపు నుండి కనీసం 2 కి.మీ. నడవాల్సిందే. గ్రామస్తులు ఏదైనా ప్రమాదానికి గాని, అనారోగ్యానికి గాని గురి అయితే, కొత్త చెరువు (31 కి.మీ.) లేదా ధర్మవరం (35 కి.మీ.) చికిత్స కోసం వెళ్ళాల్సి వుంటుంది. గ్రామంలో సుమారు 75 కుటుంబాలు బి.సి. కులానికి చెందిన వారున్నారు.

# బంగారు భూములుగా మార్చిన ఇందిరప్రభ



## ఆర్.ఐ.డి.ఎఫ్ - 9 క్రింద చేపట్టిన అభివృద్ధి వివరాలు

| గ్రామము పేరు | లబ్ధిదారుల సంఖ్య | విస్తీర్ణము (ఎకరాలు) | ప్రాజెక్టు ఖరీదు (లక్షలలో) | నిధుల విడుదల (లక్షలలో) | ఖర్చులు (లక్షలలో) |
|---|---|---|---|---|---|
| బ్రాహ్మణపల్లి | 07 | 21.83 | 6.86 | 6.33 | 6.10 |

| | | |
|---|---|---|
| కంపచెట్లు, ముళ్ళపొదల తొలగింపు | రూ. | 12,672-00 |
| రాతిచప్పట్లు, రాక్‌ఫిల్ డ్యాంలు | రూ. | 1,07,972-00 |
| భూమి లెవెలింగ్, ప్లవ్వింగ్ (18.72 ఎకరాలు) | రూ. | 24,000-00 |
| ఫార్మ్‌ఫాండు (01) | రూ. | 4,698-00 |
| రాళ్ళతొలగింపు, స్టోను బండింగ్ (1563 మీటర్లు) | రూ. | 2,63,000-00 |
| పండ్లమొక్కలు సపోట, మామిడి నాటడానికి గుంతలు, ఎరువులు, చెరువు మట్టితోలటం | రూ. | 1,83,780-00 |
| భూమి కోతకు గురికాకుండా పెరిఫెరల్ ట్రెంచ్ నిర్మాణం (453 మీటరు) | రూ. | 14,878-00 |
| **మొత్తం** | **రూ.** | **6,10,000-00** |

జీవనాధారం కేవలం వ్యవసాయం. చాలామంది దూర పట్టణాలు అనగా బెంగుళూరుకు సుమారు 50 కుటుంబాల నుండి, ఉపాధి నిమిత్తం వలస వెళ్ళేవారు. గత 20 సంవత్సరాల క్రితం 17 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, 50, 56 ఎకరాలను కొండ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని సాగు చేసుకోవడానికి ఇవ్వడం జరిగింది.

మొత్తం 50.56 ఎకరాల అసైన్డ్ భూములలో 21.83 ఎకరాలను ఒక బ్లాకుగా చేసి, 7 గురు లబ్ధిదారులను ఆర్.ఐ.డి.ఎఫ్ - 9 క్రింద, 28.63 'ఎకరాలను ఒక బ్లాకుగా చేసి ఆర్.ఐ.డి.ఎఫ్ - 10 క్రింద 10 మంది లబ్ధిదారులను కలిపి, ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమం, పేదరైతులకు వరం *'ఇందిర ప్రభ'* పథకం క్రింద ఆ భూముల సమగ్ర అభివృద్ధిని చేపట్టటానికి ప్రతిపాదించడమైనది.

*'ఇందిర ప్రభ'* పథకం క్రింద పైన తెల్పిన భూములలో అభివృద్ధి పనులు చేపట్టకమునుపు పరిస్థితి ఈ విధంగా వుంది.

- కంపచెట్లు, పెద్దపెద్ద రాళ్ళతో నిండుకొని, ముళ్ళపొదలతో కప్పబడి, కనీసం పశువులు కూడా వెళ్ళలేని పరిస్థితిలో వుండేది.
- సాగుకు ఏమాత్రం సాధ్యం లేకుండా వుండేది.
- లబ్ధిదారులందరూ వ్యవసాయ కూలీ మీద ఆధారపడి వుండటం వలన, వారి వారి భూములను అభివృద్ధి చేసుకోవడానికి చేతకాని వారుగా వుండేవారు.
- లబ్ధిదారులలో అనేకమంది ఉపాధి నిమిత్తం దూర పట్టణాలకు వెళ్ళేవారు.
- లబ్ధిదారుల కుటుంబాల జీవనాధారం దయనీయమైన స్థితిలో వుండేది.

ప్రభుత్వం పేద రైతుల అసైన్డు భూములను సాగులోకి తెచ్చి, సుస్థిరమైన జీవనాధారం కల్పించడానికి నవంబరు 19వ తేదీన 2004 సంవత్సరంలో చేపట్టిన బృహత్తర కార్యక్రమమే 'ఇందిర ప్రభ'. ఈ పథకం క్రింద, బ్రాహ్మణపల్లిలో ఆర్.ఐ.డి.ఎఫ్ - 9 క్రింద గుర్తించిన బ్లాకునకు 6.86 లక్షలు, ఆర్.ఐ.డి.ఎఫ్ - 10 క్రింద రూ.5.55 లక్షలు మంజూరు అయ్యాయి.

### *బ్రాహ్మణపల్లి బ్లాకులో 'ఇందిరప్రభ' సాధించిన విజయాలు*

- ఏ మాత్రం సాగుకు యోగ్యం కాని భూమిని సాగులోనికి తెచ్చి, కూలీలుగా వున్న వారిని రైతులుగా మార్చటం.
- వలసలు పోకుండా, వారి భూములలోనే ఉపాధి పొంది, సుస్థిరమైన జీవనోపాధిని పొందారు. 3. లబ్ధిదారులు అనగా సి.ఐ.జి. గ్రూపు మెంబర్లకు శిక్షణతో పాటు, వారి భాగస్వామ్యంతో భూమి అభివృద్ధిలో చైతన్య పరిచారు.
- సాగులోకి తెచ్చిన 20.00 ఎకరాలలో ఖరీఫ్ 2006 సం॥లో వేరుశనగ దిగుబడి, 120 బ్యాగులు (1 బ్యాగు 42 కేజీలు), కందులు 15 బ్యాగులు (1 బ్యాగు -80 కేజీలు) పొందటం (ఆదాయం వేరుశనగలో రూ. 1,06,000-00, కందిలో రూ. 18,000/-, మొత్తము ఆర్.ఐ.డి. ఎఫ్ - 9 బ్లాకులో ఆదాయం రు. 1,24,000-00).
- లబ్ధిదారులు భూ అభివృద్ధి పనులు చేపట్టి, పొందిన ఆదాయంతో, ఉమ్మడిగా ప్రభుత్వం వారు వేసిన బోరునకు, మోటారు, కరెంటు కన్నెక్షనుకు సుమారు రూ. 75,000-00 ఖర్చు పెట్టి, నీటి సదుపాయం కల్పించుకొన్నారు.
- కన్వర్జెన్సీ క్రింద 18.00 ఎకరాల విస్తీర్ణంలో ఎ.పి.ఎం.ఐ.పి.,

వాటర్‌షెడ్ ద్వారా రివాల్వింగ్ ఫండు నిధులతో డ్రిప్ వేయడానికి జులై నెలలోగా ప్రతిపాదించడమైనది.

- లబ్ధిదారులలో వ్యవసాయం మీద బ్రతుకగలమని, తమ గ్రామంలోనే ఉపాధి పొందుతామనే ఆత్మవిశ్వాసాన్ని 'ఇందిర ప్రభ' కల్పించింది.

## పేదల పాలిట వరం 'ఇందిర ప్రభ'

అనంతపురం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా నిర్వహించబడుతున్న *'ఇందిర ప్రభ'* – సమగ్ర భూ అభివృద్ధి పథకం ద్వారా అసైన్డ్ భూముల ను అభివృద్ధి చేయటం కోసం చియ్యేడు గ్రామంలో 109.00 ఎకరాల విస్తీర్ణంలో అసైన్డ్ భూమిని ఎంపిక చేయటం జరిగింది. మొత్తం లబ్ధిదారులు 26 మంది. ప్రాజెక్టు విలువ రూ. 5.77 లక్షలు.

మొదట ఎంపిక చేసిన భూమిలో కంపచెట్లు, రాళ్ళు అధికంగా వుండి, సాగుకు అనుకూలంగా వుండేది కాదు. ఈ ప్రాంతం కొండ క్రింద ప్రాంతం అవటం వలన వర్షపు తాకిడికి నేల కోతకు గురవుతూ వుండేది. వర్షపు నీరు అంతా వంకలలో కలిసి, పంటకు ఉపయోగపడకుండా వృధాగా పోతుండేది.

26 మంది లబ్ధిదారులను ఒక ఉమ్మడి ప్రయోజనాల బృందంగా (సి.ఐ.జి) ఏర్పాటు చేసి, బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేయడం జరిగింది. ఈ సి.ఐ.జి.కు సి.వి. నల్లప్ప, బి.రామచంద్రను సభ్యులందరి అంగీకారంతో గ్రూపు లీడర్లుగా ఎంపిక చేయటం జరిగింది. సి.ఐ.జి.లో తయారయిన సి.వి. నల్లప్పనే పారావర్కర్‌గా ఎంపిక చేయడం జరిగింది. సి.ఐ.జి. లీడర్లకు ఎం.డి.టి. స్థాయిలో జరిగే శిక్షణా కార్యక్రమంలో *'ఇందిర ప్రభ'* – సమగ్ర భూ అభివృద్ధి పథకం ముఖ్య ఉద్దేశ్యాలు. ఇందులో చేపట్టబడుతున్న పనుల వివరాలపై గూర్చి అవగాహన కల్గించటం జరిగింది. తిరిగి గ్రామ స్థాయిలో జరిగే సమావేశంలో చేపట్టే పనులను గూర్చి అవగాహన కల్గిస్తూ, చియ్యేడు బ్లాక్‌లో చేపట్టవలసిన పనులను గూర్చి రైతులతో చర్చించి ఒక ప్రణాళిక తయారుచేయటం జరిగింది.

రైతులతో మొదటగా బ్లాక్‌లోని కంపచెట్లను తొలగించి, రాళ్ళను తొలగించటం జరిగింది. ఇందువల్ల దాదాపుగా 5 ఎకరాల విస్తీర్ణం సాగులోనికి వచ్చింది. పెద్దరాళ్ళను పొలంలోని చిన్న గల్లీలకు అడ్డంగా పెట్టి, నేల కోతకు గురికాకుండా కొంతవరకు కాపాడుకోవటం జరిగింది.

కొండ ప్రాంతం అవటం వల్ల కొంత పైనుంచి వచ్చే నీరు అంతా పంట పొలాలపైకి వచ్చి ఎక్కువగా గల్లీలు పడుతూ వుండేవి. ఈ నీటిని ఒక మళ్ళింపు కాలువ ఏర్పాటు చేసి ఒక ప్రక్కకు మళ్ళించటం ద్వారా నేల కోతకు గురికాకుండా కాపాడుకోవటం జరిగింది. కొండ చుట్టూ వున్న సరి హద్దు కందకానికి ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేయటం వల్ల నీరు పంటపొలాల పైకి రాకుండా కాపాడటం జరిగింది.

చియ్యేడు బ్లాకులో రెండు ఇంకుడు గుంతలను త్రవ్వి, రాతితో రివిట్‌మెంట్ చేయటం జరిగినది. మళ్లింపు కాలువ నుంచి వచ్చేనీరు, వర్షపు నీటితో ఈ ఇంకుడు గుంతలు నిండుతున్నాయి. ఒక్కొక్క ఇంకుడుగుంతకి 200 ఘ.మీ. నీటిని నింపుకునే సామర్థ్యం ఉంది. ఇప్పటికి ఈ గుంతలు 5 సార్లు నిండాయి. అనగా 2000 ఘ.మీ. నీరు భూమిలోకి ఇంకింది. గతంలో చియ్యేడు బ్లాక్‌లోని బోర్లలో $1^{1/2}$ నీరు వస్తుండేది. ప్రస్తుతం 2 నుంచి $2^{1/2}$ ఇంచుల నీరు వస్తుంది.

### లబ్ధిదారుల వివరాలు

| సం. | లబ్ధిదారుని పేరు | కులము | సర్వే నెం. | విస్తీర్ణము (ఎకరాలు) |
|---|---|---|---|---|
| 1. | పెద్ద చంద్రాయుడు | బి.సి. | 21/1 | 3.00 |
| 2. | చిన్న చంద్రాయుడు | బి.సి. | 21/2 | 3.00 |
| 3. | మీసాల యల్లప్ప | బి.సి. | 21/3 | 3.00 |
| 4. | చిల్లా మాదప్ప | బి.సి. | 22/1 | 3.83 |
| 5. | మీసాల కేశప్ప | బి.సి. | 22/3 | 3.00 |
| 6. | మీసాల శ్రీరాములు | బి.సి. | 21/4 | 3.00 |
| 7. | మీసాల వెంకట్రాముడు | బి.సి. | 21/5 | 3.00 |

బ్లాకులోని గల్లీలకు అడ్డంగా రాతికట్టలు, రాక్‌పిల్ డ్యాములు నిర్మించుకోవటం జరిగింది. దీనివల్ల ఈ గల్లీలను నియంత్రిస్తూ, పంటపొలాలు దెబ్బతినకుండా కాపాడుకోవటం జరిగింది. గతంలో దాదాపుగా మూడు నుంచి నాలుగు అడుగుల లోతు వుండే గల్లీలు, రాక్‌ఫిల్ డ్యాముల నిర్మాణం జరిగిన తర్వాత పూర్తిగా ఇసుక, సారవంతమైన మట్టితో నిండి, వ్యవసాయానికి అనుకూలంగా మారాయి.

గతంలో ఇక్కడి రైతులు మూడు, నాలుగు సంవత్సరాలకు ఒక్కసారి కూడా లోతు దుక్కులు చేసుకునే వారు కాదు. కేవలం టిల్లరింగ్ మాత్రం చేసుకుని విత్తనం వేసుకునేవారు. అందువల్ల నేల బాగా గట్టిగావుండి, నీరు సరిగా భూమిలోకి ఇంకకుండా వుండి పంట దిగుబడి తక్కువగా వుండేది. *'ఇందిర ప్రభ'* – సమగ్ర భూ అభివృద్ధి పథకం ద్వారా అందిన సహకారంతో రైతులు గత సంవత్సరం లోతు దుక్కులు చేసుకోవటం జరిగింది. ఇందువల్ల వర్షపునీరు సులభంగా భూమి లోపలి పొరల వరకు ఇంకి, అంతేకాకుండా భూసారం కొట్టుకొని పోకుండా కాపాడటం జరిగింది. ఈ పథకం ద్వారా రైతులు టిల్లరింగ్ కూడా చేసుకోవటం వల్ల వారికి చాలా వరకు ఆర్థిక భారం పెరగకుండా సహకారం అందింది.

*'ఇందిర ప్రభ'* – సమగ్ర భూ అభివృద్ధి పథకం ద్వారా వేరుశనగ పంటకు ఎకరానికి మూడు బ్యాగుల చొప్పున జిప్సం పంపిణీ చేయటం జరిగింది. ఈ జిప్సంను వేరుశనగ పంట వేర్లు దిగే సమయంలో పంటకు వేయడం జరిగింది. దీనివల్ల కాయలో నూనె శాతం కొంతవరకు పెరగటంతో పాటు గింజ పరిమాణంలో నాణ్యత కూడా పెరిగింది.

ఈ విధంగా పాటించిన నీరు, మరియు భూ సంరక్షణ పద్ధతుల ద్వారా భూమి సారం పెరగటమే కాకుండా, బోర్లలో నీరు కూడా పుష్కలంగా వస్తూ పండ్ల తోట్ల పెంపకం అభివృద్ధికి తోడ్పడింది.

ఈ గ్రామంలోని ఇతర రైతులకు ఎకరానికి మూడు బస్తాల వేరుశనగ పంట దిగుబడి వచ్చింది. అయితే *'ఇందిర ప్రభ'* – సమగ్ర భూ అభివృద్ధి పథకం ద్వారా అభివృద్ధి పరచిన భూమిలో ఎకరానికి 5 నుండి 6 బస్తాల వరకు పండించగలినందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా తమ భూముల అభివృద్ధికి సహయ సహకారాలు అందించిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. ✩





# ఇందిరమ్మ చెరువుతో అదనపు పంటలు

**విశాఖపట్నం జిల్లా, పద్మనాభం మండలం పొట్నూరు గ్రామంలో గల అతి పెద్ద నూకాంబికా చెరువును 2008-09 సంవత్సరానికి గాను ఇందిరమ్మ చెరువుగా ఎంపికచేసి పని నిర్వర్తించడం జరిగింది. పొట్నూరు గ్రామంలో గల నూకాంబికా చెరువు 112 ఎకరాలలో విస్తరించి 520 ఎకరాలకు నీరు అందిస్తుంది.**

ఈ నూకాంబికా చెరువు నుండి సుమారు 10 గ్రామాలకు నీరు అందుతుంది. గత 25 సంవత్సరాల నుండి పూడిక తీయకపోవట వలన నీటి నిల్వ తగ్గి, ఉన్న ఆయకట్టుకు నీరు అందటం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని 2008-09 సంవత్సరానికి గాను 24 లక్షలతో అంచనాలు వేసి పని నిర్వర్తించడం జరిగింది.

ఇప్పటి వరకు పొట్నూరు గ్రామంలో గల 518 కుటుంబాలు 1172 కూలీలతో జాబుకార్డులు పొందగా, ఇప్పటి వరకు 421 కుటుంబాలకు చెందిన 692 మంది కూలీలకు పని కల్పించి 4.33 లక్షలు వ్యయంతో 5175 పని దినాలు కల్పించడమైనది. వీరు కనీస వేతనం రూ. 82.87 లు పొంది సంతోషం వ్యక్తం చేసారు.

ఈ చెరువులో పూడికతీత చేసి, చెరువు లోతు చేసి, గట్టు బలోపేతం చేయటం వలన, చెరువు ఫీడరు కాలువ పూడిక తీసి లోతు, వెడల్పు చేయటం వలన అదనంగా 200 ఎకరాలలో వరి నాట్లు పడినవి. రైతులు సంతోషం వ్యక్తం చేసారు.



నూకాంబికా చెరువు గర్భంలో ఎక్కడా చెట్లు లేవు. కనుక కూలీలు తమ పిల్లలను ఉంచటానికి, వారు భోజనం చేయటానికి నీడ కరువైంది. గ్రామీణాభివృద్ధి కమీషనరు వారు పంపిన నీడ గుడారం చాల బాగా ఉంది, 15 మంది కూర్చోవడానికి నీడ కల్పించడమైంది. రైతులు ఇటువంటి నీడ గుడారాలను మండలంలోని అన్ని పంచాయితీలకు సరఫరా చేయమని కోరుతున్నారు. ◻

# చాపకింద నీరు

**శీలా వీర్రాజు**


బస్సు దిగి ఓ సారి చుట్టూ చూసింది చెంగల్వ. పదేళ్ళ కిందటి జ్ఞాపకాల్లోంచి గుడి గోపురాన్నీ, ఎత్తయిన చెరువుకట్ట మీది రావిచెట్టునూ, స్కూల్లో పొడుగ్గా ఎదిగిపోయిన పున్నాగ చెట్లనూ ఓ మారు నిదానించి చూసింది. గుడి గోపురం అలాగే వుంది. రావిచెట్టు ఒకవైపు ఎండిపోయింది. పున్నాగ చెట్లు నాలుగింటికీ రెండే ఉన్నాయి. ఊళ్ళో పెద్దగా మార్పేమీ కనిపించడంలేదు. కరెంటు తీగలు మాత్రం కొత్తగా వచ్చాయి. జనం ఇంకా అలాగే నీళ్ళ కోసం చెరువుకట్ట ఎక్కుతున్నారు. చెరువు కింద రావిచెట్టు నీడలో అప్పటిలాగే పాలేరు కుర్రాళ్ళు పశువుల్ని వొదిలేసి బిళ్ళంగోడు ఆడుకుంటున్నారు. కట్ట పక్కనే జిల్లేళ్ళ పుంతలోంచి రెండెడ్ల బళ్ళు కిర్రుకిర్రుమంటూ కదల్లేక కదులుతున్నాయి. ఈ పదేళ్ళలోనూ వూరు ఎంతగానో మారిపోయి వుంటుందని వూహించిన చెంగల్వకి పాతవూరే కనిపించింది.

చిన్నప్పుడు చెంగల్వ ఆ వూళ్ళో నాలుగేళ్ళపాటు వుంది. వాళ్ళ నాన్నగారి ఉద్యోగరీత్యా చాలా వూళ్ళు తిరిగింది. ఆమెకు వూహ తెలిసిన తర్వాత ఆడుకున్న స్థలాలూ, కలిసి పరుగెత్తిన స్నేహితులూ, చదువుకొన్న బడీ ఆ వూళ్ళోనే ఉన్నాయి. వెన్నెల కుప్పల గుర్తులూ, దాగుడుమూతల జ్ఞాపకాలూ, బొమ్మల కొలువుల స్మృతులూ ఆ వూళ్ళోనే తొలిసారిగా ఏరుకుంది. అట్లతద్దెకి ఉయ్యాల ఎక్కించి, మొగుడి పేరు చెప్పందే ఆపమంటూ ఊపేవాళ్ళు అల్లరిచేస్తే, శోకాలు పెట్టేసిన గుర్తు యిప్పటికీ తియ్యగా మనసులో మెదులుతూనే ఉంది. కార్తీక పౌర్ణమికి నోములు పట్టబోతే ఆ వార్త స్కూల్లో తెలిసి "దీనికి అప్పుడే మొగుడు ధ్యాస వచ్చేసిందేవ్" అంటూ అమ్మాయిలంతా ఏడిపించినప్పుడు కళ్ళనీళ్ళు తిరిగిన సంఘటన తలుచుకున్నప్పుడల్లా ఇప్పటికీ ముసిముసి నవ్వులు పెదాల మీద పొరలుతూనే వుంటాయి.

అందుకే ఆమె చిన్ననాటి స్మృతుల్ని నెమరేసుకుందామని, పారేసుకున్న ఆ బాల్యాన్ని వెతుక్కుందామని ఆ వూరికి వచ్చింది. అక్కడికి నాలుగు మైళ్ళ దూరంలోనే వున్న పల్లెటూళ్ళో వాళ్ళన్నయ్య మామగారి తరపు బంధువులింట్లో పెళ్ళికని వచ్చింది. అంత దగ్గరగా వచ్చిన తర్వాత చిన్ననాటి ఆ వూరిని చూడకుండా వెళ్ళాలనిపించలేదు. ప్రతి అర్ధగంటకీ బస్సులు వుండనే వున్నాయి. నాలుగు మైళ్ళంటే పావుగంట ప్రయాణం. యవ్వనంలో నిలుచుని బాల్యాన్ని చూసుకోవడం భలే సరదాగా వుంటుంది. అందుకే చెంగల్వ, ఉదయం పెళ్ళయిపోయాక, భోజనాల తతంగం ఏ రెండెంటికో ముగిసాక ఒకసారి చూసొద్దామని, వాళ్ళన్నయ్య పెదబావగారి కొడుకు పదేళ్ళ వాడిని వెంటబెట్టుకుని బయలుదేరి వచ్చింది.

ఊళ్ళో ఆనాటి వాళ్ళు ఎదురుపడి పలకరిస్తే బావుండుననిపించింది ఆమెకు. అప్పటి మనుషులు ఎవరున్నారో, వూరొదిలి వెళ్ళిపోయిన వారెవరో






తెలుసుకోకుండా పాత జ్ఞాపకాలతో వెళ్ళడం అట్టే మంచిది కాదనిపించింది. అలానే ఆ కుర్రాడిని వెంటబెట్టుకుని ముందుగా తాము అంతకు ముందున్న వీధి మీదుగా అటూ ఇటూ చూసుకుంటూ వెళ్తోంది.

ఓ యింటి అరుగుమీద సుబ్బారాయుడు కనిపించాడు. ఆమె గుర్తు పట్టింది కాని అతడు గుర్తుపట్టలేకపోయాడు. సైకిల్ చక్రంలో ఆయిల్ వేసి తుడుస్తున్న వాడల్లా చెంగల్వ కనిపిస్తే తుడపడం ఆపేసి కుతూహలంగా చూస్తున్నాడు.

చెంగల్వ అతన్ని పలకరిద్దామనుకుంది కాని అతని చూపుల్లోని సభ్యతలేని కుతూహలాన్ని చూసి ముఖం తిప్పేసుకొని వెళ్ళిపోయింది. మూడిళ్లవతల పరమేశంగారు యింటిముందు వడ్లు ఎండబెట్టిస్తూ కనిపించారు. ఆవిడని ఓ క్షణం తేరపార చూసి గుర్తుపట్టినట్టు చిన్నగా నవ్వుతూ "వెంకట్రామయ్య గారి పెద్దమ్మాయివిగదూ" అన్నారు.

''అవునండి, నేనే చెంగల్వను'' అంది ఆమె దగ్గరికి వచ్చి.

"ఎప్పుడొచ్చావ్, ఏమిటి విశేషాలు? రా లోపలికి, తులసి కూడా ఇక్కడే వుంది. పదిహేను రోజులైంది రాజమండ్రినుంచి వొచ్చి" అంటూ ఆయన "అమ్మాయ్ తులసీ! నీ గురించి ఎవరొచ్చారో యిలా వొచ్చిచూడవే'' అని యింట్లోకి కేకేశారు. కాస్సేపట్లో తులసి వచ్చింది. తండ్రితో మాట్లాడుతున్న చెంగల్వను చూసి వెంటనే గుర్తుపట్టలేకపోయింది.

"ఏమిటలా చూస్తావ్, నేనూ చెంగల్వనోయ్" అంది.

"ఏమిటేమిటీ! చెంగల్వే! దీపం సెమ్మలాగ పొడుగ్గా ఎదిగిపోతే గుర్తుపట్టలేకపోయాను సుమా! ఏమిటిలా ఎదిగిపోయావ్!" దగ్గరకొచ్చి చేతులు పట్టుకొని యింట్లోకి తీసుకుపోయింది. ఇంట్లో వాళ్ళందరికీ ఆమె వచ్చిన విషయం చెప్పి చాలా హడావుడి చేసింది. అందరి పలకరింపులూ అయిపోయాక తీరిగ్గా కబుర్లు చెప్పుకుందామని దొడ్లో వసారాలోకొచ్చి కూచున్నారు.

పదేళ్ళ క్రితం అయితే యిలా యిద్దరూ కూచుంటే ఎన్ని కబుర్లో వాళ్ళ మధ్య! ఇప్పుడు ఎదిగిపోయి, వయసుకట్టిన గూటిలోంచి వసపోసిన పిట్ట ఎగిరిపోయి, వుండి వుండి ఒకో మాటా, ఒకో జవాబు – అలా సాగుతున్నాయి వాళ్ళ కబుర్లు. యవ్వనం మనసు చుట్టూ పరదాలు కట్టి, ఆ పరదాల్లోంచి తొంగిచూడడం నేర్పుతుంది.

ఆ పదేళ్ళ తర్వాత వాళ్ళిద్దరూ దగ్గర దగ్గరగా కూచుని ఒకరి విషయాలు వొకరికి చెప్పుకుని గంటకు పైగా మాట్లాడుకున్నాక ఒకరికొకరు దూరంగానే వుండిపోయినట్టు అనిపిస్తోంది!

"అవునూ, పెళ్ళెప్పుడు చేసుకుంటావోయ్!" తులసి కుతూహలపు ప్రశ్న.

"ఏమో, నాకే తెలీదు" చెంగల్వ పరధ్యానపు సమాధానం.

"మరి నీ పెళ్ళెప్పుడటా" చెంగల్వ ప్రశ్న వెనక ఆసక్తి.

"ఎప్పుడు రాసి వుంటే అప్పుడు" తులసి పొడిపొడిగా జవాబు.

పరదాల్లోంచి చూసేవారికి తమని యితరులు చూడ్డంకన్నా యితరుల్ని తాము చూడాలన్న ఆసక్తే ఎక్కువ. అందుకే –

"సుందరి అనీ నీతో ఎప్పుడూ పోట్లాడుతుండేది కదూ శోభనాద్రిగారి అమ్మాయి – గుర్తుందా, అది ఈ మధ్య కథానాయకురాలైందిలే."

"ఏమిటి విశేషం?"

"ఉందిలే పెద్ద కథ"

"ఇంతకీ కథానాయకుడెవరో"

"మా ఊళ్ళో కథానాయకుడు సుబ్బారాయుడు. మరి రాజమండ్రిలో కూడా ఓ కథానాయకుడు వున్నాడు"

"వివరంగా చెప్పరాదూ"

''చెప్తా... ఏమోయ్! నీకిక్కడ ఏమీ తోచడం లేనట్టుంది. వెళ్ళి బాదంకాయలు కోసుకుంటావేమిటి. చూడు, చెట్టుకిందే చాలా రాలిపడినవి వున్నట్టున్నాయ్" అంది తులసి, చెంగల్వతో వచ్చిన కుర్రాడిని ఉద్దేశించి. ప్రాణం లేచొచ్చినట్టనిపించింది వాడికి. హుషారుగా బాదం చెట్టు దగ్గరికి వెళ్ళిపోయాడు.

"నాలుగేళ్ళ నాటి మాటలే. సుబ్బరాయుడి వెంటపడింది. వూరందరికీ తెలుసు ఆ విషయం."

"మరి ఆ ప్రేమ ఎందుకు విఫలమైంది."

''ఏడిచింది. ప్రేమేమిటి దానికి. ఎవరూ వెనకదిక్కు లేదని జాలిపడినందుకు సుబ్బరాయుడి వెంట పడింది పెళ్ళి చేసుకుంటాడేమోనని. అన్నట్టు సుందరి నాన్న పొలం నుంచి వస్తూ పాము కరిచి పోయాడు. వాళ్ళమ్మ నువ్వు ఇక్కడున్నప్పుడే చనిపోయిందికదూ. వేరే దిక్కులేకపోతే వూరి వాళ్ళే ఆమె దూరపు చుట్టాన్ని పిలిపించి తోడు వుండమన్నారు."

చిన్నప్పుడు సుందరికీ, చెంగల్వకూ ఓ క్షణమన్నా పడేదికాదు. ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఒకరినొకరు వుడికించుకోవడం,

పోట్లాడుకోవడం, మూతివిరుపులూ – అలా వుండేది. ఒకరంటే మరొకరి కి కిట్టకపోవడానికి పెద్ద కారణం కూడా ఏమీలేదు. స్కూల్లోని పున్నాగ చెట్ల పూలు ఏరుకోవడం దగ్గర వాళ్ళిద్దరికీ మొదట్లో తగువు వచ్చింది. కొంతమంది అమ్మాయిలు అటూ, కొంతమంది ఇటూ చేరారు. ఆ గ్రూపులు ఆ తర్వాత తర్వాత కూడా అలానే వుండిపోయాయి! క్లాసులో కూచునేప్పుడూ, బైట ఆడుకునేప్పుడూ, కలిసి తిరిగేప్పుడూ వాళ్ళదో గ్రూపూ, వీళ్ళదో గ్రూపూ తయారయ్యింది.

"ఏమిటోయ్ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?"

"ఏమీలేదు, సుందరి గురించే. అవునూ సుబ్బారాయుడు సుందరిని ఎందుకు చేసుకోలేదు?"

"సుబ్బారాయుడి యింట్లో యిష్టపడలేదు. 'అలాంటి గడుసుపిల్లని కోడల ంగా తెచ్చుకుంటే నోరూ వాయీ లేని యీ వాజమ్మ కూడా తమని తన్ని తగిలేస్తాడ'ని వాళ్ళమ్మ ఒప్పుకోలేదు. సుబ్బారాయుడ్ని మహావేధించుకు తిందట – ఎటైనా పోయి పెళ్ళి చేసుకుందాం అని. అస్తమానం అదే పాటట! ఓ నాలుగేళ్ళు ఆగమని సుబ్బారాయుడు ఎంతచెప్పినా కాదు కూడదు, యిపుడే అయిపోవాలని ఒకటే వేధించేసిందట. చివరికి అతను విసిగిపోయి నేను చేసుకోనని ఖచ్చితంగా చెప్పేశాడట.

'అయ్యో పాపం!' అనుకుంది చెంగల్వ. సుందరి అంటే చిన్నప్పుడున్న కోపం యిప్పుడు లేదు. మొదట్లో ఆ వూరు విడిచి వెళ్ళిపోయిన ఓ ఏడాది పాటు ఆమె మీద కోపం అలానే వుండిపోయింది. మెల్లమెల్లగా, వెలసిపోయిన ఆమె జ్ఞాపకంలాగే, అదీ తొలగిపోయింది. ఎప్పుడైనా గుర్తుకొచ్చినా సుందరి ని గూర్చి ఆసక్తి తప్ప కోపం వుండేది కాదు. మరీ ఈ మధ్య ఆర్నెల్ల క్రితం చెంగల్వ ఆఫీసులో కొత్తగా ఓ టైపిస్టు చేరింది. ఆమె కనిపించినప్పుడల్లా చిన్ననాటి సుందరే గుర్తుకొచ్చేది ఆమెకు. 'ఏం చేస్తోందో సుందరి, ఎపుడైనా కనిపిస్తే బావుండును సుమా' అనుకునేది.

ఇప్పుడు అనుకోకుండా సుందరిని గురించి విన్న ఈ కొత్త విషయాల వల్ల ఆమె మనసు 'అయ్యో పాపం!' అనుకుంది. సుందరి మీద జాలి కలిగింది. తులసి చెప్పిన తీరు ఆమెకు నచ్చలేదు. తులసికి సుందరి మీద యింకా కోపం పోలేనట్టే వుంది. ఏ పదోవంతే కోపమో మిగిలివుండాలి. ఈ వూరు విడిచి వెళ్ళకపోతే తనకూ ఆమె మీద కోపం వుండేదేమో!

ఒకసారి సుందరిని కలుసుకుందామని అనిపించింది చెంగల్వకు. ఆ విషయం తులసితో చెప్తే "భలేదానివే! ఇంకా ఈ వూళ్ళోనే తిష్టేసుకుని కూచుందనుకున్నావా. ఈ వూరు విడిచి ఎపుడో వెళ్ళిపోయింది. సుబ్బారాయుడు చేసుకోను పొమ్మనేసరికి యీ వూళ్ళో వుండడం యిక ఎందుకులెమ్మని అనుకుందో ఏమో, రెండెకరాల పొలం అమ్మేసుకుని రాజమండ్రి వెళ్ళిపోయింది."

"రాజమండ్రిలో ఏం చేస్తోందో?"

"ప్రేమతో ఎక్స్‌పెరిమెంట్స్ చేస్తోందోయ్" అంది తులసి నవ్వుతూ.

"ఛ, అవేం మాటలోయ్. సుందరంటే యిప్పటికీ నీకు కోపం పోలేదల్లే వుందే".

"ఊరికే, సరదాకి అన్నాను. అదంటే కోపం దేనికి. దాని దగ్గర నాకు చనువు ఎక్కువ. వారానికి ఒక్కసారన్నా కలుసుకుంటాం. ఆ చనువు వల్లే అలా అన్నాను."

చెంగల్వ వెంట వచ్చిన కుర్రాడు జేబులనిండా బాదంకాయలు వేసుకొని వచ్చాడు.

అతన్ని చూసి వెళ్ళిపోదామని లేవబోయింది చెంగల్వ.

"వెళ్ళుదువుగానిలే. కాస్సేపు కూచో. ఎండ తగ్గాక వూరంతా తిరుగుదువుగాని, నేనూ వస్తా కదా. ఎవరెవరి యిళ్ళకు వెళ్ళాలో వెళ్ళి, ఎక్కడెక్కడ తిరగాలో తిరిగి ఆఖరి బస్సుకు వెళ్ళిపోదువుగాని. నిన్ను బస్సెక్కించే పూచీ నాది, కూచో" అని బలవంతంగా కూచోబెట్టేసింది.

కోసిన బాదంకాయల్ని కొట్టుకుందామని కుర్రాడు రాయికోసం వెతుక్కుంటూ వీధిలోకి వెళ్ళాడు.

"అన్నట్టు తులసీ! సుందరి గురించి నాకు పూర్తిగా చెప్పనేలేదు నువ్వు" అంది కుతూహలంగా చెంగల్వ.

"అదంటే నీకింత ఆసక్తి ఉన్నట్టు యీసారి సుందరి కలిసినప్పుడు చెప్తాలే" అంది తులసి నవ్వుతూ. అని, మళ్ళీ యిటు తిరిగి "చెప్పమంటావా? నువ్వంటే చాలా యిష్టం. నీ రాజమండ్రి చరిత్ర తెలుసుకుందామని మహా ఆరాటపడిందనుకో. నీ భగ్న ప్రేమని గురించి విని చాలా సానుభూతి చూపించింది. పాపం! రెండు సార్లూ నీ ప్రేమ భగ్నం కావడం విని చెంగల్వకు కళ్ళు చెమ్మగిల్లాయి. చూసేవా నువ్వంటే ఎంత అభిమానమో – అని చెప్తాలే" అంది.

చెంగల్వ ఆశ్చర్యంగా చూసింది. "ఏమిటి? రెండోసారి కూడా మోసపోయిందా?" అంది.

"ఏమో, ఆ సంగతైతే నాకు తెలీదు కానీ ఆ వూరు వెళ్ళిన కొత్తలో సుబ్బారాయుడులాంటి మరో రాయుడ్నో, రావునో పట్టుకు తిరగడం మాత్రం తెలుసు. ఆయనే తోకముడిచాడో, యివిడే ముడిపించిందో మరి మొత్తం మీద బెడిసికొట్టేసింది.

"నీకెలా తెలుసు?"

"ఇటువంటివి తెలీకుండా వుంటాయా. ఆ మధ్య నాకు పెళ్ళి సంబంధాలు చూసి పెట్టమని మా నాన్నగారు నన్ను బాబాయిగారి దగ్గర అట్టేపెట్టారు. మూడు నెలలు ఖాళీగానే వుండి, వూరికే కూచోలేక ఓ ఉద్యోగానికి అప్లయ్ చేశాను. అనుకోకుండా వచ్చిందది. రెండేళ్ళబట్టీ అక్కడే వుంటున్నాను. ఈ మధ్యే మా అమ్మకి వొంట్లో బాగోలేదంటే నెలరోజులు సెలవు పెట్టి వచ్చాను. ఒకే ఊళ్ళో వుంటున్నప్పుడు ఆ మాత్రం తెలియదా. సుందరి గురించి చాలామంది చెప్పగా విన్నాను"

"సుందరి దగ్గర నీకు బాగా చనువు వుందికదా. మరి నీతో తనేం చెప్పలేదా? అయితే నువ్వు చెప్పినది యితరులు చెప్పిన కథన్నమాట! మరి ఆవిడ చెప్పిన కథని ఎందుకు చెప్పలేదు?"

"ఏమిటోయ్ యీ క్రాస్ ఎగ్జామినేషన్! కొంపతీసి ఏ లాయరుగారి వాసనలన్నా..." నవ్వేసింది తులసి. చెంగల్వ కూడా ఆమెతో పాటు నవ్వు కలిపింది.

తులసి తల్లి టిఫిను, కాఫీ పట్టుకొచ్చింది. అంతలోనే తులసి చెల్లెళ్ళిద్దరూ ప్రైవేటు నుంచి అప్పుడే వచ్చారు. వాళ్ళతో మరికాస్సేపు కబుర్లు చెప్తూ కూచుని బయలుదేరింది చెంగల్వ. ఆమెతోపాటు తులసి కూడా బయలుదేరింది.

అక్కడ తెలిసిన నలుగురైదుగురి యిళ్ళకూ వెళ్ళి పరామర్శించి, ఇంతకుముందు వాళ్ళుండిన ఇంటికి వెళ్ళి ఇంటివాళ్ళతో కాస్సేపు మాట్లాడి, ఓసారి అన్ని వీధుల్లోనూ అలా అలా తిరిగి, ఎదురుపడిన పరిచయస్తులను పలకరించి వూరంతా చుట్టివచ్చారు. సరదాగా గుళ్ళోకి వెళ్ళారు. కాసేపు మండపంలో కూర్చున్నారు. పచ్చగన్నేరులు కోసి కాడలు పీల్చి పూలతేనె తాగారు. చెరువు కట్ట మీదికొచ్చి చెరువులోకి రాళ్ళు విసురుతూ అలల్ని చూస్తూ గడిపారు. నీళ్ళలోకి దిగి ముఖం కడుక్కున్నారు. గట్టు మీద నిలుచుని అస్తమించబోతున్న సూర్యుడ్ని కరువుతీరా చూశారు. ఆ తర్వాత ఊళ్ళోకి దిగొచ్చి బళ్ళోకి వెళ్ళి పున్నాగచెట్టు కింద దొంగాట ఆడుకొంటున్న అరడజను అమ్మాయిల్నీ, వాళ్ళ ఆటనీ అక్కడే కూచుని కుతూహలంతో చూసి చాలాసేపు అలానే ఉండిపోయారు.

కూడా వచ్చిన కుర్రాడికి చెట్టంత చెంగల్వ చిన్న పిల్లలా ప్రవర్తించడం చాలా చిత్రంగా అనిపించి మాటిమాటికీ ఆమెనే ఆశ్చర్యంగా చూస్తోంటే అది గుర్తించి తనలో తనే నవ్వుకుంది చెంగల్వ. వీడికి మరో పదేళ్ళు పోతేగాని ఇది అర్థంకాదులే అనుకుంది. ఒక అనుభవం కన్నా దాని జ్ఞాపకమే మధురమైనది సుమా – అని కూడా అనుకుంది.

చీకటి పడుతుంటే బస్సు వచ్చే వేళ అయిందని బయలుదేరుతూ చటుక్కున ఆగిపోయి "సుందరికి ఎప్పుడన్నా నేను గుర్తుకొస్తానా తులసీ?" అంది.

"నిన్నెలా మర్చిపోతుందోయ్. మిత్రుల్ని మర్చిపోవడం తేలికేగాని శత్రువుల్ని అంత తేలికగా మర్చిపోతారా?"

"సుందరి ఇప్పటికీ నన్ను శత్రువుగానే భావిస్తోందా?"

"లేదులే, సరదాకి అన్నాను. నువ్వు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నట్టు అదే నాకు చెప్పింది. మీ బావకు పెళ్ళయిపోయిన విషయం, నువ్వు ఇంకా పెళ్ళి చేసుకోని విషయం సుందరి చెప్తేనే తెలిశాయి."

చెంగల్వ ఆశ్చర్యపోయింది. ఇవన్నీ ఎలా తెలిశాయి సుందరికి? తన గురించి యింతగా పట్టించుకుంటోందా? చిత్రంగా ఉందే.

ఆలోచిస్తూనే బయలుదేరింది. బస్సు ఆగేచోటికి వచ్చి నుంచున్నారు. ఆ రాత్రికి వుండిపోయి మర్నాడు పొద్దున్నే వెళ్ళదువుగానంటే చెంగల్వ ఒప్పుకోలేదు. బస్సులో వెళ్ళిపోయేముందు సుందరి అడ్రసు అడిగి తీసుకుంది. "రాజమండ్రి శానిటోరియంలో బంధువు ఒకావిడ ఉంది. ఆవిడని చూడ్డానికి వెళ్తున్నాను. వీలైతే సుందరిని కలుస్తాను" అంది.

ఆ మర్నాడే చెంగల్వ రాజమండ్రికి వెళ్ళింది. ఆమె పెత్తల్లి కూతుర్ని రాజమండ్రి ఇచ్చారు. ఆరోగ్యం దెబ్బతింటే ఈ మధ్యనే శానిటోరియంలో చేర్పించారట. వెళ్ళినరోజు శానిటోరియంకు వెళ్ళడం, ఆవిడని చూడ్డంతోనే సరిపోయింది.

మర్నాడు ఉదయం సుందరి దగ్గరకు బయలుదేరింది చెంగల్వ. ఇల్లు వెతుక్కుని వెళ్ళేసరికి స్కూలుకు వెళ్ళడానికి సిద్ధమౌతోంది. చూసిన వెంటనే ఆమె కూడా చెంగల్వను గుర్తుపట్టలేకపోయింది. కాసేపు తేరపార చూసి "చెంగల్వా నువ్వా! గుర్తుపట్టలేకపోయాను సుమా, అక్కడే నిలుచుండిపోయావేమిటి, లోపలికి రా" అంటూ ఆప్యాయంగా పలకరించి ఇంట్లోకి తీసుకెళ్ళింది. చాపపరచి కూచోబెట్టి, తనూ ఆ పక్కనే కూచుని "చాలా సంవత్సరాలైందికదూ ఒకరినొకరం చూసుకొని. పదేళ్ళు దాటిందనుకుంటాను. అన్నట్టు నేను ఇక్కడున్నట్టు నీకెలా తెలుసు?" అంది.

చెంగల్వ మెల్లగా నవ్వి "నేను హైదరాబాదులో వుంటున్నట్టు నీకెలా తెలుసో నాకూ అలానే తెలుసు" అంది. ఆ తర్వాత మళ్ళీ తనే అంది – "తులసి చెప్పింది. అక్కడినుంచే వస్తున్నాను. నువ్వు ఈ ఊళ్ళో వుంటున్నట్టు చెప్తే నీ అడ్రసు తీసుకొని వెతుక్కుంటూ వచ్చాను"

"అందుకే చెంగల్వా నువ్వంటే నాకు ఇష్టం" అంది సుందరి. ఆమె కళ్ళు కృతజ్ఞతనీ, సంతోషాన్నీ ప్రకటిస్తున్నట్టు నిండుగా వెలిగి, ఆ వెలుగులో పదేళ్ళ దూరంలో మసగ్గా కనిపించే బాల్యాన్ని చూసి, ఆలోచనలన్నిటినీ అటే తిప్పి, కొద్దిసేపు పరధ్యానంలో పడిపోయింది. ఆ తర్వాత తేరుకొని "చిన్నప్పుడు అస్తమానం పోట్లాడుకునేవాళ్ళం కదూ! ఏమిటో అర్థంపర్థంలేని పోట్లాటలూ, పట్టింపులూనూ. ఇప్పుడు ఆలోచిస్తుంటే ఆ అమాయకతనీ, తెలివితక్కువ తనానికీ నవ్వొస్తుంది." అంది.

"నిజమే ఎపుడైనా చిన్నప్పటి రోజుల్ని గురించి ఆలోచించేటపుడు మిగిలినవాళ్ళ కన్నా ముందు నువ్వే గుర్తొస్తావు. మా ఆఫీసులో బాలాత్రిపుర సుందరిని ఓ అమ్మాయి ఉంది. ఆమెతో అనేదాన్ని కూడా – చిన్నప్పుడు సుందరి అని ఓ అమ్మాయీ నేనూ ఎప్పుడూ పోట్లాడుకునేవాళ్ళం, ఇప్పుడు ఎక్కడ వుంటుందో ఏమిటో అని."

"నేనూ అంతే. మిగతా వాళ్ళను మర్చిపోయినా నువ్వు మాత్రం అస్తమానం గుర్తొస్తూనే ఉంటావు. అందుకే వాళ్ళనీ వీళ్ళనీ అడిగి నీ గురించి ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ వుండేదాన్ని."

ఆ చిన్ననాటి కబుర్లలోపడి వెన్నెల్లో దాగుడుమూతలాడుకున్నంత ఉత్సాహంతో, ఇసుకలో గుజ్జనగూళ్ళు కట్టుకున్నంత ఆనందంతో, చేతుల్ని రెక్కల్లా చాచుకొని తూనీగల వెంటపడినట్టు బాల్యం వెంటపడి కదిలిపోయారు.

"కబుర్లలోపడి కాఫీ అయినా ఇచ్చానుకాదు చూశావా! ఉండు, ఇప్పుడే వస్తాను" అని లేచివెళ్ళి అయిదు నిమిషాల్లో కాఫీకాచి పట్టుకొచ్చింది.

"ఇవాళ స్కూలుకి సెలవు పెట్టేస్తాను. నువ్వు భోంచేసి సాయంకాలం వెళ్ళదువుగాని. అహ, అదేం కుదరదు. కావాలంటే మీ చుట్టాలింటికి వచ్చి చెప్తాను" అంది. మొహమాట పెట్టి చెంగల్వ చేత 'ఊ' అనిపించింది.

ఇద్దరూ వంటింట్లో కూచుని – సుందరి వంట చేస్తోంటే చెంగల్వ సాయంచేస్తూ ఒకరి జీవితంలోకి ఒకరు తొంగిచూసి, ఒకరి విషయాలు ఒకరు తెలుసుకుని చాలా సన్నిహితుల్లా కబుర్లు చెప్పుకున్నారు. తులసిలో లేని ప్రత్యేకత ఏదో సుందరిలో ఉన్నట్టనిపించింది. తులసి గుంభనమైన మనిషిలాగా, సుందరి భోళా మనిషిలాగా అనిపించింది. అందుకే తులసికి చెప్పని విషయాల్ని కూడా సుందరికి చెప్పేసింది చెంగల్వ.

భోజనాల దగ్గర "ఏమిటో! ఆ చిన్నప్పటి రోజులే బావున్నాయి కదూ. ఇప్పటిలా ఇన్ని సమస్యలతో సతమతమవకుండా నిష్పూచీగా తిరిగిన ఆ రోజులే ఎంతో మెరుగ్గా అనిపిస్తాయి నాకు. పోట్లాడుకున్నా ద్వేషంలేని పోట్లాటలు అవి. ఇప్పుడు అలా ఉండగలమా. స్నేహంలోకూడా కుత్సితమూ, అసూయ ఇవే నిండిపోయి ఉంటాయి. అందుకే నాకు ఆ రోజులన్నా, మీ వూరన్నా చాలా ఇష్టం. నా చిన్నతనం నాలుగైదు వూళ్ళలో గడిచినా ప్రత్యేకించి మీ వూరంటేనే నాకు యిష్టం" అంది చెంగల్వ.

"నాకు మాత్రం మా ఊరంటే చాలా భయం. ఆ వూళ్ళో నాకు చాలా అన్యాయం జరిగిపోయింది చెంగల్వా..."

"అవునట పాపం తులసి అంతా చెప్పింది."

సుందరి హఠాత్తుగా తలెత్తి చెంగల్వ ముఖంలోకి చూసింది.

"మీ నాన్నగారు పోవడం, నువ్వు ఒంటరిదానివి కావడం, పొలం అమ్మేసుకుని ఇలా వచ్చేయడం అన్ని విషయాలూ తులసే చెప్పింది. పాపం ఎలా తట్టుకోగలిగావో యిన్ని కష్టాల్నీ.."

"తులసి నాగురించి యింకేమీ చెప్పలేదా?"

చెంగల్వ కాసేపు తటపటాయించి "చెప్పింది, సుబ్బరాయుడ్ని చేసుకోవాలనుకుంటే వాళ్ళింట్లో ఒప్పుకోలేదట కదా" అంది.

"చూశావా చెంగల్వా! మగదిక్కు లేదని నలుగుర్లోనూ ఎలా నన్ను నవ్వుల పాలు చేశాడో సుబ్బరాయుడు. ప్రేమిస్తున్నానని చుట్టూ తిరిగి, తీరా పెళ్ళి చేసుకొమ్మనేసరికి 'ఓ నాలుగేళ్ళు ఆగు, మా నాన్న ఆస్తి పంచి ఇచ్చాక చేసుకుంటాను' – అని తప్పుకున్నాడు. పైగా తన పేరు ఎక్కడ పాడవుతుందో అని నేనే తన వెంటపడి వేధించుకు తింటున్నట్టు వూళ్ళో ప్రచారం చేశాడు. ఇలాంటి వాళ్ళని ఏం చెయ్యాలంటావ్" అంది సుందరి.

చెంగల్వ ఏమీ మాట్లాడలేదు.

"అసలు, మగదిక్కులేని ఆడపిల్లని చూస్తేనే అందరికీ అలుసనుకుంటాను చెంగల్వా. ఒక్క సుబ్బరాయుడన్న మాటేమిటి, అందరికీ చిన్నచూపే. ఈ ఊళ్ళో కూడా మరోసారి భంగపడ్డాను...."

ముసలావిడ దగ్గుకుంటూ మంచినీళ్ళకని వంటింట్లోకి రావడంతో ఆ ప్రసంగం ఆగిపోయింది. అన్నం తినడం పూర్తయినా వూరికే మాట్లాడుతూ కూచుండిపోయారు.

ముసలామె వచ్చేసరికి చేతులు కడుక్కుని లేచిపోయారు.

"ఇంట్లో కూచుని ఏం చేస్తాం. అలా సినిమాకన్నా వెళ్దామా" అంది సుందరి.

అలాగే అని బయలుదేరింది చెంగల్వ. సినిమాకి వెళ్తున్నప్పుడు భోజనాల దగ్గర మధ్యలో ఆపేసిన విషయాన్ని గూర్చి కదిపింది.

"పోనిస్తూ. ఆ విషయం యిప్పుడు తలచుకోవడం ఎందుకు? అదో పీడకల. దాన్ని మర్చిపోవడమే మంచిది" అంది.


ఆ విషయాన్ని గూర్చి యింకేమీ ఆమె చెప్పలేదు. చెంగల్వ కూడా రెట్టించి అడిగి ఆ జ్ఞాపకాలతో ఆమెను బాధించడం యిష్టం లేక మాట్లాడుకున్నా మళ్ళీ ఈ సంగతి మాత్రం దొర్లలేదు.

సినిమానించి వొస్తూ "మళ్ళీ మనం ఎంతకాలానికి కలుసుకుంటామో ఏమో కలిసి ఫొటో తీయించుకుందాం" అని చెప్పి ఓ ఫొటో స్టూడియోకి తీసుకెళ్ళింది సుందరి. అక్కడి ఫొటో ఆల్బమ్ తిరగేస్తూ ఓ ఫొటో చూపించి "ఈ ఫొటో జాగ్రత్తగా చూడు. ఇతని గురించి తర్వాత చెప్తాను" అంది.

ఫొటో తీయించుకుని తిరిగి వస్తూ అంతసేపూ బిగపట్టుకున్న ఆశ్చర్యాన్ని ఒక్కసారిగా పేల్చేస్తున్నట్టు "ఇందాక భోజనం దగ్గర చెప్పిన మనిషి ఈయనేనా?" అని అడిగింది చెంగల్వ.

"కాదులే. ఈయన నారాయణమూర్తనీ మా అమ్మమ్మకి దూరపు బంధువు. ఆవిడే నాకు బాగా దూరపు బంధువైతే ఆవిడకి ఈయన మరీ దూరపు బంధువు. ఏడాది క్రితం యిక్కడ కాలేజికి ట్యూటర్‌గా వచ్చాడు. మొదట్లో ఓ పదిహేను రోజులపాటు రూము దొరికే వరకూ మా యింట్లోనే ఉన్నాడు. నేనంటే చాలా అభిమానం" అంది. ఆమె ఆ చివరి వాక్యం చెప్పిన తీరూ, ఆమె ఆ పెదాల మీద చిరునవ్వూ, 'అభిమానం' అన్న ఆమె మాటకి అర్థం చెప్పినట్టనిపించాయి చెంగల్వకు.

"రేపు సాయంకాలం రారాదూ, ఆయన్ని పరిచయం చేస్తాను. రూము బాగా దూరం లేకపోతే యిప్పుడే చూపించేదాన్ని. రేపు ఉదయాన్నే కాలేజికి ఫోను చేస్తాను సాయంకాలం రమ్మనమని. రేపు సాయంకాలం వస్తావు కదూ" అంది సుందరి.




"వీలుండదు సుందరీ రేపు మధ్యాహ్నమే వెళ్ళిపోతున్నాను. ఉదయం మళ్ళీ ఒకసారి శానిటోరియానికి వెళ్ళడం అదీ వుంటుంది. రేపిక కలవడం పడదు. అయినా ఫొటో చూశాను కదా, మనిషి బావున్నాడు"

"మనిషే కాదు, మనసు కూడా అలాగే వుంటుంది. తులసికి కూడా పరిచయం చేశాను. విపరీతంగా లైక్ చేసింది. నువ్వు కూడా చూస్తే బావుండును. నీ సలహా ఏమిటో తెలుసుకోవాలని వుంది."

"భలేదానివే. నీకు సలహా యిచ్చేపాటిదాన్నా నేను. జీవితమే నీకు ఎన్నో గుణపాఠాల్ని నేర్పింది. ఆ అనుభవం వల్లనే నువ్వు పొరపాటు చేయవని నా నమ్మకం. ఇంకా ఇతరుల సలహాలవీ ఎందుకు సుందరీ, నీ మనసుకు నచ్చినట్టు చెయ్యి."

"కాదు, నువ్వు చూస్తేగాని నాకు తృప్తిలేదు"

అంది సుందరి జాలిగా, ప్రేమగా.

"చూద్దునుగాని కాని రేపే వెళ్ళిపోవాలి. ఎప్పటికప్పుడు ఉత్తరాలు రాస్తుంటా కదా. ఉత్తరాల ద్వారా తెలియజేస్తుండు" అంది చెంగల్వ.

ఆమెని వాళ్ళ బంధువులింట్లో దిగబెట్టి "ఉత్తరాలకి జవాబులిస్తూ ఉండు. మీ హైదరాబాద్ చూళ్ళేదు. నీ పెళ్ళికి తప్పక వస్తాలే. ఎప్పుడు పిలుస్తావో మరి" అంది సుందరి. చెంగల్వ చేతిని అందుకుని మృదువుగా నొక్కి గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోయింది.

అనుకున్నట్టుగా ఆ మర్నాడు మధ్యాహ్నం బండికే వెళ్ళిపోయింది చెంగల్వ.

హైదరాబాదు చేరిన వెంటనే స్నేహితురాళ్ళిద్దరికీ ఉత్తరాలు రాసింది. తను వచ్చినప్పుడు వాళ్ళు చూపిన అభిమానానికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ రాసింది. వాళ్ళూ ఉత్తరాలు రాశారు. తులసి సెలవు అయిపోగానే రాజమండ్రి వచ్చేసిందట. సుందరి కూడా నారాయణమూర్తి గురించి మరి కొన్ని విశేషాలు రాసింది.

అలా నాలుగైదు నెలలు ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయి. మొదట్లోలా తరచుగా ఇప్పుడు రాసుకోకపోయినా అడపాదడపా ఒకో ఉత్తరం వస్తూనే ఉంది.

అలాంటిది, సుందరి నుంచి ఉత్తరం వచ్చి నెలరోజులు పైనే అయినా మళ్ళీ ఉత్తరం లేదు. అంతకు ముందు రాసిన ఉత్తరంలో "ఏంటో మనసంతా చికాగ్గా వుంది. ఎవరినీ నమ్మేట్టులేదు" అని రాసింది. అప్పటి నుంచీ చెంగల్వకు ఆతృతగానే వుంది. మళ్ళీ ఏమైనా జరిగిందా అని కూడా ఆందోళన పడి, చివరికి తులసి పేరున ఉత్తరం రాసింది.

నాలుగు రోజుల్లో తులసి నుంచి ఉత్తరం వచ్చింది.

"...... ఇంకా నేనే ఉత్తరం రాద్దామనుకున్నాను. ఇంతలో నీ ఉత్తరమే వచ్చింది. పాపం సుందరి ఆత్మహత్య చేసుకుంది. చిన్నప్పటినించీ అయినవాళ్ళంటూ ఎవరూ లేక ప్రేమకు దూరమైపోయి బతకడంవల్ల, తన దగ్గరకు వచ్చిన ప్రతివ్యక్తి గురించీ పెద్దపెద్ద ఆశలు పెట్టుకుని ఆలోచించడంతో యీ అనర్థం వాటిల్లివుండాలి. ఎవరో వెంటపడి, ఆయన విదిల్చుకుంటే తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని వుండొచ్చు..." అని రాసింది తులసి.

చెంగల్వ మనసు మనసులో లేదు. ఇన్నేళ్ళ తర్వాత, సుందరి సన్నిహితంగా వచ్చి, తనంటే ఎంతో అభిమానాన్నీ, గౌరవాన్నీ చూపించి ఆకస్మాత్తుగా యిలా కావడం భరించరానిదిగా వుంది. పాపం! సుందరి జీవితంలో రాజీ పడలేకపోయింది. తులసి రాసినట్టు సానుభూతితో చనువుగా ఆ నారాయణమూర్తి పలకరించేసరికి తనని ప్రేమిస్తున్నాడనుకొని తప్పుడు ఆలోచనలో పడిపోయింది గాబోలు. ఆ రోజున సుందరి ఆశించినట్టు నారాయణమూర్తిని కలిసి ఉంటే బావుండేది. తనైనా ఆమె భ్రమని తొలగించివుంటే యింత ఘోరం జరక్కపోయేదేమో. కనీసం తులసి అయినా ఆమెను హెచ్చరించి వుండాల్సింది.

అసలు విషయమేమిటో వివరంగా తెలపమని తులసికి ఉత్తరం రాద్దామనుకుంది, కాని సుందరంటే తులసికి గౌరవం వున్నట్టు అనిపించడంలేదు. మొదటినుంచీ సుందరి మీద అభిమానం వున్నట్టులేదు. మాటిమాటికీ సుందరిని యితరుల వెంటపడే మనిషిగానే చూస్తోంది. సుందరంటే తులసికి అభిమానం వుంటే వుండొచ్చుగాని సానుభూతి మాత్రం లేదు. అందువల్ల తులసి ఏం రాసినా సరిగా అర్థం చేసుకుని రాసింది కాకపోవచ్చు.

అనుకోకుండానే ఓ నెలా పదిహేను రోజులకు రాజమండ్రి వెళ్ళాల్సివచ్చింది చెంగల్వకు. వాళ్ళ పెత్తల్లి కూతురు పోయింది. ఆ అమ్మాయీ, చెంగల్వా ఒకే యీడు వాళ్ళు. చెంగల్వంటే చాలా అభిమానం చూపేది. కర్మ దినానికి వాళ్ళన్నయ్య వెళ్తానంటే తనూ వస్తానని బయలుదేరింది చెంగల్వ.

ఏడుపులూ, గోలలతో ఎటూ కదలాలనిపించలేదు చెంగల్వకు. పైగా ఎటు వెళ్ళడానికీ సమయం కూడా లేదు. అదే రోజున, అక్కడ వుండకూడదని తిరిగి వెళ్ళిపోవడానికి బయలుదేరారు.

రిక్షాలో స్టేషనుకు వెళ్తూండగా ఓ సినిమా హాలు దగ్గర తులసి కనిపించింది. చప్పున రిక్షా ఆపించి దిగివెళ్ళి పలకరించింది చెంగల్వ. తులసి ఆశ్చర్యానికి అంతులేదు. "ఇదేమిటి! యిలా చెప్పాచెయ్యకుండా వూడిపడ్డావ్. సినిమాకా? ఎవరాయన?" అంది రిక్షా వైపు చూస్తూ.

"మా అన్నయ్య, గుర్తుపట్టలేదూ. మా పెత్తల్లి కూతురు పోతే దినానికని వొచ్చాం. ఇవ్వాళే వెళ్ళిపోతున్నాం" అని ఒక్క క్షణం ఆగి –

"సుందరి అమ్మమ్మనీ, నిన్నూ కలుసుకుందామనుకున్నాను గాని వీలు పడలేదు. ఇప్పుడు అనుకోకుండా కనిపించావ్. చిత్రంగా వుంది" అంది చెంగల్వ.

సరిగ్గా అప్పుడే ఓ వ్యక్తి టిక్కెట్లు పట్టుకొనివచ్చి "లోపలికి వెళ్దామా?" అన్నట్టు చూశాడు.

"....ఆయన నారాయణమూర్తిగారనీ మా బంధువు. ఇక్కడే కాలేజీలో ఇంగ్లీషు ట్యూటరుగా పనిచేస్తున్నారు. ఆదివారం పూట యింట్లో కూచోడం చాలా బోర్‌గా వుంటుంది. అందుకని యిలా...." నవ్వుతోంది తులసి.

ఆ నవ్వు పగిలిన గాజుపెంకులా అనిపించింది.

ఆ రంగురంగుల మెరుపుల అడుగున పాదాల్లోంచి రక్తాన్ని నాకే ఆకలి వాడితనం కనిపిస్తోంది.

వెన్నుపోటు పొడిచే పిడిబాకు సూది అంచు కనిపిస్తోంది.

జీవితాలు జీవితాల్నే తన్నుకుపోయే గెద్ద కాలిగోళ్ళ పదునూ, వాడీ, బలమూ కనిపిస్తున్నాయి.

సభ్యతగా ప్రతినమస్కారం చెయ్యాలనన్నా అనిపించలేదు చెంగల్వకు.

అచేతనంగా చూస్తూ ఉండిపోయింది.

ఆమె కళ్ళముందు బితుకు బితుకుగా, దిగులుగా, అక్కడా అక్కడా ఒక్కో బియ్యపు గింజను ఏరుకునే కోడిపిల్లలా ఒదిగొదిగి జీవితాన్ని ఏరుకునే సుందరే కనిపిస్తోంది.

ఆమె ఆలోచనల తనుంచి తేరుకోనేలేదు.

"వస్తాను చెంగల్వా! సినిమాకి టైమైంది. ఉత్తరం రాస్తావు కదూ" అంటూ పక్కనున్న వ్యక్తిని చూపుల్తోనే తన్నుకుపోతూ హడావుడిగా గెద్దలా సినిమా హాలులోకి ఎగిరిపోయింది తులసి!

*(1976లో ప్రచురితమైన శీలా వీర్రాజు కథల సంకలనం 'ఊరు వీడ్కోలు చెప్పింది' నుంచి)*



## ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌పై వర్కుషాపు

**ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీలో జూన్ 1 నుండి 4 వరకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారులకు, ఇతర జిల్లాస్థాయి అధికారులకు ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌పై నిర్వహించిన వర్కుషాపు, శిక్షణా కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుధీర్ కృష్ణ, ఐ.ఎ.ఎస్ హాజరు అయ్యారు.**

# వార్తల్లో 'అపార్డ్'

భారత ప్రభుత్వ ప్రణాళికా కమీషన్ మార్గదర్శకాల ప్రకారం, జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో జిల్లా ప్రణాళికా కమిటీకి, ప్రాధాన్యతలు నిర్ణయించుకోవటంలో, ప్రణాళికీకరణకు, ఇతరత్రా అవసరమయిన సమాచార నిర్వహణకు ఉపయుక్తమయ్యేలాగా న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ వారు ఈ ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.

ఈ సాఫ్ట్‌వేర్ వినియోగించటం వల్ల గ్రామపంచాయితీ జిల్లా, మండల స్థాయిలో వివిధ ప్లానింగ్ యూనిట్లు రూపొందించే ప్రణాళికలను సమీకృతపరచటానికి, ప్రణాళికలలోని వివిధ పథకాలకు అందుబాటులోనున్న నిధులను జోడించటానికి సావకాశం ఉంటుందని సుధీర్‌కృష్ణ అన్నారు. జిల్లా, మండలం, గ్రామస్థాయిలోని సిబ్బందికి కూడా ఈ సాఫ్ట్‌వేర్ వినియోగంపై శిక్షణను సత్వరమే అందచేయాలని ఆయన కోరారు.

2009-10 బి.ఆర్.జి.ఎఫ్ ప్రణాళికలను ప్లాన్‌ప్లస్ ద్వారా ఆన్‌లైన్ నందు నిక్షిప్తం చేయాలని ఆన్‌లైన్ ద్వారా రూపొందిన ప్రణాళికకు మాత్రమే నిధులను మంజూరు చేయటం జరుగుతుందని ఆయన తెలియచేశారు. వర్కుషాపుకు హాజరయిన ముఖ్యకార్య నిర్వహణాధికారుల ను, జిల్లా అధికారులను ప్లాన్‌ప్లస్ వినియోగంలో వారికి ఏర్పడ్డ అవగాహన గురించి చెప్పవలసినదిగా ఆయన కోరగా అధికారులందరూ ఈ ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్ జిల్లా మునిసిపల్, మండల, గ్రామపంచాయతీ స్థాయిలో బహుళ ఉపయోగకారిగా ఉంటుందని తెలియచేశారు.

పంచాయితీరాజ్ కమీషనరు చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్ మాట్లాడుతూ జిల్లా ప్రణాళికలను జూన్ 15 తారీఖుకల్లా పూర్తిచేయవలసినదిగా సూచించారు. అపార్డు కమీషనరు ఫణికుమార్, ఐ.ఎ.ఎస్. మాట్లాడుతూ, సాఫ్ట్‌వేర్ ఉపయోగించి గ్రామస్థాయిలో సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయటానికి ఉన్న పరిమితుల దృష్ట్యా మండల స్థాయిలో సమన్వయపరచవలసినదిగా సూచించారు.

అనంతరం శ్రీ సుధీర్ కృష్ణ రాష్ట్రంలో బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం అమలు తీరును సమీక్షించారు. బి.ఆర్.జి.ఎఫ్ కన్సల్టెంట్ శ్రీ డి. రామకృష్ణ, ఐ.ఎ.ఎస్. (రి) సామర్థ్యాల పెంపుదల కార్యక్రమ నివేదికను సమర్పించగా, పంచాయతీ శాఖ డిప్యూటీ కమీషనర్, శ్రీ రామారావు, బి.ఆర్.జి.ఎఫ్ అభివృద్ధి నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి. ఏ. సెంటర్ హెడ్ సూర్యనారాయణ రెడ్డి, ఫ్యాకల్టీ డా.వి.శివశంకరప్రసాద్, శ్రీమతి శారదాదేవి, కన్సల్టెంట్ శ్రీపతిరావు తదితరులు పాల్గొన్నారు. ☆

## ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ డైరక్టరు జనరల్ సందర్శన

**ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ డైరక్టరు జనరల్ శ్రీమతి వీణా ఉపాధ్యాయ, ఐ.ఎ.ఎస్, మే 29 న 'అపార్డు'ను సందర్శించారు. పంచాయతీరాజ్ సంస్థలలోని ప్రజాప్రతినిధులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అసక్తిని కల్గిస్తున్నాయని లక్షలాది మంది ప్రజాప్రతినిధులకు శిక్షణ అందచేసేందుకు 'అపార్డు' అనుసరిస్తున్న వ్యూహం దేశవ్యాప్తంగా మన్ననలు పొందినదని ఆమె అన్నారు. 'అపార్డు' అనుసరిస్తున్న వ్యూహాలను గూర్చి తెలుసుకోవటానికి ప్రత్యేకించి రావటం జరిగిందన్నారు.**

ఈ సందర్భంగా 'అపార్డు' కమీషనరు, ఫణికుమార్ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులకు శిక్షణ అందచేయటానికి 'అపార్డు' బహుముఖ వ్యూహాల ను అవలంబిస్తుందని, వీటిలో ముఖ్యంగా క్షేత్రస్థాయి శిక్షకుల (టి.ఓ.టి)

ద్వారా మౌఖిక శిక్షణ, శాటిలైట్ ఆధారిత దూరవిద్యా విధానం ద్వారా శిక్షణ అందచేయటంతో పాటు గ్రామపంచాయతీ సభ్యుల సామర్థ్యాల పెంపుదలకు 'స్థానిక పాలన' అనే మాస పత్రికను ప్రచురించి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా వీడియో కాన్ఫరెన్సు సౌలభ్యంతో 22 జిల్లాలతో నేరుగా వీడియో కాన్ఫరెన్సు చేయటానికి, అన్ని రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి సంస్థలలోని విషయ నిపుణులతో సంప్రదింపుల, కొరకు ఎన్.ఐ.సి వారి సహకారంతో ఈ వీడియో కాన్ఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశామన్నారు. అంతేగాక 'అపార్డు' నుండి నేరుగా ఇ.టి.సిలతో వీడియో కాన్ఫరెన్సు సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు, ఇటువంటి ఏర్పాటు దేశంలో ప్రథమంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ మాత్రమే చేపట్టినట్లు ఆయన తెలియపర్చారు.

ఈ సందర్భంగా శ్రీమతి వీణా ఉపాధ్యాయ, ఫ్యాకల్టీ సభ్యులతో పలు శిక్షణా కార్యక్రమాల గూర్చి చర్చించారు. శ్రీ అంబరీష్, ఐ.ఎ.ఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ రెవిన్యూ అధికారులకు వృత్తిపరమైన శిక్షణతోపాటు భూమి సంబంధమైన విషయాలపై ప్రజాప్రతినిధులకు ల్యాండ్ సెల్ ద్వారా శిక్షణ అందచేస్తున్నామని తెలియచేశారు. శిక్షకులకు శిక్షణ కార్యక్రమాల ద్వారా రెండు లక్షల ఇరవై వేల మంది ప్రజా ప్రతినిధులకు శిక్షణ అందచేస్తున్న విధానాన్ని డా॥వి. శివశంకర్ ప్రసాద్ వివరించారు.

బ్రిగేడియర్ డి.వి.రావు ప్రకృతివైపరీత్యాల యాజమన్యంపై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాల గూర్చి, ఈ కార్యక్రమాల నిర్వహణలో మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ పాత్ర, 'అపార్డు' పాత్రల గూర్చి వివరించారు. శ్రీ సెబాస్టియన్ రాజు మాట్లడుతూ, ఎస్.సి/ఎస్.టి ప్రజాప్రతినిధులకు ప్రత్యేకమైన శిక్షణా కార్యక్రమాల గూర్చి సెంటర్ ఫర్ సోషల్ ఈక్విటీ ఎంపవర్‌మెంట్ తీసుకొంటున్న చర్యలను వివరించారు.

ఫ్యాకల్టీ మెంబర్ శ్రీమతి శారద మాట్లాడుతూ మహిళా ప్రజాప్రతినిధుల శిక్షణావసరాలు తీర్చటానికి ప్రత్యేకంగా, జడ్.పి.టి.సి స్థాయి నుండి వార్డు మెంబరు స్థాయి వరకు ప్రత్యేక శిక్షణ అందచేయటం జరిగిందని తెలియపర్చారు. శ్రీమతి అరుణజ్యోతి మాట్లాడుతూ, రాష్ట్రంలో జిల్లాల వారీగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల డైరెక్టరీ రూపొందిస్తున్నట్లు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డా॥కృష్ణమోహన్‌రావు, ల్యాండ్‌సెలఖ కన్సల్టెంట్ వెంకటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్ తఖీయుద్దీన్, డిప్యూటీ డైరక్టర్ కుమారరాజా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఫ్యాకల్టీ సభ్యులు సుధీర్, శైలేష్, పద్మావతి, రమేష్, ముత్యం తదితరులు తాము నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాల గూర్చి తెలియచేశారు.

ఫ్యాకల్టీ సభ్యులతో పలు విషయాలపై చర్చించిన అనంతరం శ్రీమతి వీణా ఉపాధ్యాయ మాట్లాడుతూ, అపార్డులో మంచి టీంవర్క్ జరుగుతుందని ఈ కార్యక్రమాలను ఉత్తర ప్రదేశ్‌లో కూడా అమలు పర్చటానికి ప్రయత్నిస్తానని అన్నారు. 'అపార్డు' పర్యటన తనకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుందని ఆమె అన్నారు. 'అపార్డు' అవలంభిస్తున్న శిక్షకులకు శిక్షణ వంటి కార్యక్రమాలలో మొబైల్ శిక్షకుల బృందాలను ఏర్పాటు చేసి తమ రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులను చైతన్యవంతులను చేయటానికి ప్రయత్నం చేస్తానని ఆమె అన్నారు. 'అపార్డు' కమీషనర్‌కు ప్రత్యేక అభినందనలు తెలియపర్చారు.

అనంతరం శ్రీమతి వీణా ఉపాధ్యాయ 'అపార్డు' ప్రచురణల ప్రదర్శనను తిలకించారు. ☆




# మనోహరాచారికి 'బెస్ట్ పి.ఆర్.వో' అవార్డు

**2008-09** సంవత్సరానికి బెస్ట్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌గా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె. మనోహరాచారి కి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైద్రాబాద్ వారు అవార్డును బహుకరించారు.

జాతీయ పౌర సంబంధాల దినోత్సవం సందర్భంగా 21 ఏప్రిల్, 2009 న ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ డా॥ వై. వెంకటరామరెడ్డి ఈ అవార్డును మనోహరాచారి కి బహూకరించారు.

పబ్లిక్ రిలేషన్స్ రంగంలో పితామహుడుగా పేరొందిన డా॥ సి.వి. నరసింహారెడ్డి ఏటా ఈ అవార్డును తమ పేరుపై పబ్లిక్ రిలేషన్స్ రంగంలో విశేష కృషి చేసిన వ్యక్తులకు బహూకరిస్తుంటారు. ఈ సంవత్సరం ఈ అవార్డు కోసం బి.హెచ్.ఇ.ఎల్., ఎయిర్ ఇండియా లాంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటుగా పలు కార్పోరేట్ సంస్థలు కూడా పోటీపడ్డారు. నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ అన్నీ ఎంట్రీలను పరిశీలించిన అనంతరం గామీణాభివృద్ధి శాఖలో కమ్యూనికేషన్స్ అధికారికి ఈ అవార్డును బహూకరించాలని నిర్ణయించింది.

ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కె. మనోహరాచారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించే ప్రతి పథకం పేదలకోసం రూపొందించినదేనని, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఏటా సుమారు మూడు వేల కోట్లకు పైగా పేద ప్రజలు సంక్షేమం కోసం వెచ్చించడం జరుగుతున్నదని అన్నారు. ఇందిరాక్రాంతి పథం ద్వారా ఒక కోటి మంది మహిళలు లబ్ధి పొందుతుండగా, ఉపాధి హామీ పథకం ద్వారా 60 లక్షల మంది కూలీలకు జీవనోపాధి లభించిందని, పింఛన్లు, పావలా వడ్డీ, ఇందిరప్రభ, వాటర్ షెడ్స్ తదితర కార్యక్రమాల క్రింద మరెంతో మంది పేదలకు గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పేదల లబ్ధి పొందుతున్నారని, ఆయా పథకాలపై ప్రజలకు వివిధ ప్రచార సాధనాల ద్వారా ఇంకా ఎంతో అవగాహన చేకూర్చాల్సిన అవసరం ఉందని, ఇదుకోసం కృషి చేయడం జరుగుతున్నదని అన్నారు.

ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో వివిధ సంస్థలు/శాఖలలో పనిచేస్తున్న పౌర సంబంధాల అధికార్లతో పాటుగా వేదిక పై పి.ఆర్.యస్.ఐ. కు చెందిన నర్సింహారావు, కె.ఆర్.కె.చారి, సి.వి. నర్సింహారెడ్డి, కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రఘూత్తమరావు, సింగరేణి కాలనీస్ పి.ఆర్.ఒ. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ప్రజాస్వామ్యంలో పౌర సంబంధాల పాత్రపై వెంకటరాంరెడ్డి మాట్లాడారు. ☆



# ఐ.టి. సాయంతో సుపరిపాలన

ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల తీసుకొని రావటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుండి నేటి వరకూ కోట్లాది రూపాయలు వెచ్చించి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఐతే ఈ కార్యక్రమాల ఉద్దేశ్యాలను ఎంతో ఉదాత్తంగా తయారుచేసినప్పటికీ, క్షేత్ర స్థాయిలో ఈ పథకాల అమలులో గల పలు లోపాల వల్ల ఆశించిన ఫలితాలను సాధించటం ప్రభుత్వాలకు తలకుమించిన భారంగా పరిణమించింది. మనదేశంలో అమలు అవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రపంచంలో మరే ఇతర దేశంలో అమలుకావటం లేదంటే అతిశయోక్తి కాదు. శిశువు గర్భస్థ దశలో ఉన్నప్పటినుండీ మనిషి మరణానంతరం వరకూ కూడా కుటుంబాలకు లబ్ధిచేకూరేలా పథకాలను అమలు చేయటంలో మన దేశానికి ఘనకీర్తి ఉంది.

**1951 నాటి సామాజిక అభివృద్ధి కార్యక్రమం నుండి నేటి ఉపాధి హామీ పథకం, సర్వశిక్షా అభియాన్, సమగ్ర శిశు అభివృద్ధి పథకం, గ్రామీణనీటి సరఫరా పథకం, రాజీవ్‌గాంధీ గ్రామీణ విద్యుదీకరణ పథకం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషను, జిల్లా నీటి పారిశుద్ధ్య మిషను, స్వర్ణ జయంతి గ్రామీణ సర్వరోజగార్ యోజన, ఇందిరా ఆవాస్ యోజన వంటి ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలులో నిర్దేశిత సేవలను లక్ష్యిత ప్రజలకు పారదర్శకంగా అందచేయటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెను సవాలుగా పరిణమిస్తోంది.**

భారత రాజ్యాంగపు 73 మరియు 74 సవరణల ఫలితంగా పంచాయతీరాజ్ సంస్థలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమానంగా స్థానిక ప్రభుత్వాల స్థాయిని పొందటంతో పాటు రాజ్యాంగబద్ధంగా నిర్వహించవలసిన విధులను నిర్వర్తించటంలో కీలక భూమికను పోషిస్తున్నాయి. పంచాయతీరాజ్ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో పౌరసేవలకు అదనంగా వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలయిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, 12వ ఆర్థిక సంఘం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, గ్రామీణ నీటి సరఫరా పథకం, బి.ఆర్.జి.ఎఫ్ వంటి పథకాలను ప్రణాళికా దశనుండి అమలు, పర్యవేక్షణా దశలవరకూ స్వంతత్ర్యంగా నిర్వహించచమే కాక పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాఖా పరంగా నిర్వహించే పనులను క్షేత్ర స్థాయిలో అమలుపరచటానికి ముఖ్య భూమికను పోషిస్తున్నాయి. పంచాయతీరాజ్ సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించి తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలంటే ఈ సంస్థల ద్వారా అమలు జరిగే పథకాల లావాదేవీలలో పారదర్శకత తీసుకొని రావల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో పంచాయతీరాజ్ సంస్థలను ప్రజలకు జవాబుదారీగా మలచటానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక చక్కని సాధనంగా ఉపయోగపడుతుందని గ్రహించిన భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలు, నేషనల్ ఇన్ఫర్మేటిక్సు సెంటర్ (ఎన్.ఐ.సి) వారు సంయుక్తంగా కొన్ని స్టాఫ్‌వేర్ అప్లికేషన్లు రూపొందించారు. మన రాష్ట్రంలో కూడా గ్రామీణాభివృద్ధి శాఖ టాటా

**పంచాయతీ రాజ్ సంస్థలలో**
**పారదర్శకత, జవాబుదారీతనానికి**
**ఐ.టి. వినియోగం**

**పంచాయతీల ద్వారా పౌరసేవలకు ఇన్ఫర్మేషను టెక్నాలజీని వినియోగించటం వల్ల ప్రభుత్వ సేవలను ప్రజలు సులభంగా పొందటానికి సావకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఈ కార్యక్రమం మేజర్ పంచాయతీల (గతంలో నోటిఫై చేయబడిన పంచాయతీలు)లో మాత్రమే అమలు చేయబడుతోంది. ఈ సదుపాయాన్ని మరిన్ని పంచాయతీలలో ప్రవేశపెట్టటానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కృషి చేస్తోంది.**

కన్సల్టెన్సీ సర్వీసెస్ వారితో కలిసి జాతీయ ఉపాధి హామీ పథక యాజమాన్యానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్, పంచాయతీరాజ్ శాఖ రూపొందించిన ఈ-పంచాయితీ సాఫ్ట్‌వేర్‌లు ప్రజలకు మెరుగైన సేవలందించటానికి దోహదపడుతున్నాయి.

ప్రజలకు పారదర్శకంగా సేవలందించటంతో పాటు, ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచటానికి సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొంటూ రూపొందించబడిన సాఫ్ట్‌వేర్‌లు, వాటి ఉపయోగం, సంబంధిత ప్రాజెక్టుల అమలు తీరుతెన్నుల గురించి ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది.

### ప్లాన్ ప్లస్

భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ, నేషనల్ ఇన్ఫర్మాటిక్సు సెంటర్ వారు సంయుక్తంగా రూపొందించిన ప్లాన్ ప్లస్ సాఫ్ట్‌వేర్ జిల్లా ప్రణాళికల రూపకల్పనా ప్రక్రియలో సమాచార నిర్వహణకి, గ్రామపంచాయతీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు, మునిసిపాలిటీలు తయారు చేసిన ప్రణాళికలను ఏకీకృత పరుస్తూ సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయుక్తమైనది. ఇది కేవలం సమాచార నిర్వహణకే గాక, భౌగోళిక సమాచార వ్యవస్థకు ఉండవలసిన లక్షణాలను అన్నీ కూడా కల్గి ఉన్నది. ఈ ప్లాన్ ప్లస్ ఏ ఒక్క పథకం కొరకు తయారుచేసిన సాఫ్ట్‌వేర్ వలె కాక అన్ని పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని నిక్షిప్తం చేసుకొనే లక్షణాలన్నింటినీ కల్గి ఉన్నది. ప్లాన్ ప్లస్ సాఫ్ట్‌వేర్ ద్వారా గ్రామస్థాయిలో గుర్తించిన అవసరాలను కంప్యూటరీకరించటం, అవసరాలను ప్రాధాన్యీకరించటం, ప్రాధాన్యీకరించిన అవసరాలకు వివిధ పథకాల క్రింద ప్లానింగు యూనిట్ వారీగా (గ్రామ/మండల/జిల్లా/ మునిసిపాలిటి) అందుబాటులో ఉన్న నిధులను జోడించటం వీలవుతుంది. పరిపాలనా ఆమోదం, సాంకేతిక ఆమోదం ఇవ్వటం వంటివి కూడా ఆన్‌లైన్‌లో చేయవచ్చు.

ఈ సాఫ్ట్‌వేర్‌ను పూర్తి స్థాయిలోకి వినియోగంలోకి తెస్తే వివిధ శాఖలలో తయారయ్యే ప్రణాళికలను కూడా ఏకీకృత పరిచి ఆయాశాఖల పరిధిలో గల నిధులను కూడా అభివృద్ధి ప్రణాళికలను జోడించి జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించవచ్చు. జిల్లా ప్రణాళికా కమిటీకి ఈ ప్లాన్ ప్లస్ ఒక చక్కని సాధనంగా ఉపయోగ పడుతుందనటంలో ఏమాత్రం సందేహంలేదు. ఈ ప్లాన్ ప్లస్ సాఫ్ట్‌వేర్‌ను కేరళ, కర్ణాటక, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ప్రయోగాత్మకంగా 2007లో అమలు చేసిన ఎన్.ఐ.సి 2009 నాటికి 250 బి.ఆర్.జి.ఎఫ్. జిల్లాలలో ప్రణాళికీకరణ ప్రక్రియలో ఉపయోగంలోకి తీసుకొనిరావటానికి ఇప్పటికే ప్రయత్నాన్ని ప్రారంభించింది. మరిన్ని వివరాలకు http://panchayat.gov.in/planplus వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ప్లాన్ ప్లస్ సాఫ్ట్‌వేర్ కేవలం ప్రణాళికా రూపకల్పన చేస్తున్న అధికారులకు, పంచాయతీ రాజ్ సంస్థలకే గాక సాధారణ పౌరులకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. జిల్లాల్లో వివిధ పంచాయతీలలో, మునిసిపాలిటీలలో అమలు జరుగుతున్న ప్రణాళికల వివరాలను ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ నుంచి ప్రజలు పొందవచ్చు. దీనివల్ల ప్రజలకు సమాచారం సులభంగా అందుబాటులో ఉండటమే కాక, ఈ సమాచారం ఆధారంగా ఆయా ప్రాజెక్టులలోని పనులు క్షేత్రస్థాయిలో వాస్తవంగా అమలు జరుగుతున్నవీ లేనిదీ తెల్సుకొనేందుకు వీలు కల్గుతుంది. తద్వారా పారదర్శకత, జవాబుదారీతనం రెండూ కూడా సాధించినట్లవుతుంది.

### నేషనల్ పంచాయతీపోర్టల్

దీనిని పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, నేషనల్ ఇన్ఫర్మాటిక్సు సెంటరు వారు కలిసి రూపొందించారు. ఈ పోర్టల్ నందు గ్రామ పంచాయతీ స్థాయి నుండి మండల, జిల్లా పరిషత్తుల స్థాయివరకూ ప్రతీఒక్క యూనిట్‌కూ స్థానం కల్పించారు. దేశంలో గల లక్షల గ్రామ పంచాయతీలు, మధ్యశ్రేణీ పంచాయతీలు, జిల్లా పరిషత్తులు తమ సమాచారాన్ని తమకు కేటాయించిన ప్రత్యేక వెబ్‌సైట్ నందు ఉంచటానికి సౌకర్యం ఉన్నది. ప్రతీ గ్రామ పంచాయతీ/మండల/ పరిషత్తు/జిల్లా పరిషత్తుకు కేటాయించిన ప్రత్యేక యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ ఉపయోగించి వాటికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నందు ప్రజలకు అందుబాటులో ఉంచవచ్చు. మరిన్ని వివరాలకు http://panchayat.gov.in ఉన్న రాష్ట్ర పోర్టల్‌ను క్లిక్ చేసి జిల్లాపరిషత్తు/మండల పరిషత్తు/ గ్రామ పంచాయతీల యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఉపయోగించి సమాచారాన్ని అప్‌లోడ్ చేయవచ్చు. మరింత సమాచారం కొరకు జిల్లాలోని ఎన్.ఐ.సి జిల్లా ఇన్ఫర్మాటిక్సు అధికారిని సంప్రదించవచ్చు.

### ప్రియా (PRIA) సాఫ్ట్

పంచాయతీరాజ్ సంస్థలలో ఆర్థిక పరమైన లావాదేవీలను

సమర్థవంతంగా నిర్వహించుకోవటానికి నేషనల్ ఇన్ఫర్మాటిక్సు సెంటరు వారు రూపొందించిన మరొక సాఫ్ట్‌వేర్ ఇది. పంచాయతీరాజ్ సంస్థల కొరకు ప్రవేశపెట్టిన నూతన అక్కౌంటింగు విధానానికి అనుగుణంగా రూపొందించబడిన ఈ సాఫ్ట్‌వేర్ వినియోగం వల్ల ఈ సంస్థలలో ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించవచ్చు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి ఈ-సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్రంలో వినియోగంలోకి తీసుకొనిరావటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## ఇ-పంచాయతీ

నేషనల్ ఇన్ఫర్మాటిక్సు సెంటరు, హైదరాబాదు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా రూపొందించిన ఈ-పంచాయతీ పోర్టల్ గ్రామ పంచాయతీల ద్వారా మెరుగైన పౌర సేవలను త్వరితగతిన అందచేయటానికి ఉద్దేశించబడినది. రాష్ట్రంలో మొత్తం 475 గ్రామ పంచాయతీలలో ఈ-పంచాయతీ కార్యక్రమం అమలుచేయబడుతోంది. ఈ-పంచాయతీ ద్వారా ప్రజలకు లభ్యమయ్యే సేవలలో ప్రధానంగా :

1) ఇంటి పన్ను, నీటి పన్నులు చెల్లింపులు
2) జనన మరణ నమోదులు, ధృవీకరణ పత్రాలు పొందటం
3) లైసెన్సులు, ఫీజులు చెల్లించటం
4) పంచాయతీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల సమాచార నిర్వహణ
5) గ్రామ పంచాయతీ ఆస్థుల వివరాలు పొందటం వంటివి ముఖ్యమైనది.

పంచాయతీల ద్వారా పౌరసేవలకు ఇన్ఫర్మేషను టెక్నాలజీని వినియోగించటం వల్ల ప్రభుత్వ సేవలను ప్రజలు సులభంగా పొందటానికి సావకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఈ కార్యక్రమం మేజర్ పంచాయతీల (గతంలో నోటిఫై చేయబడిన పంచాయతీలు)లో మాత్రమే అమలు చేయబడుతోంది. ఈ సదుపాయాన్ని మరిన్ని పంచాయతీలలో ప్రవేశపెట్టటానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కృషి చేస్తోంది.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల్లో జాతీయ ఉపాధి హామీ కార్యక్రమం ఒకటి. ఈ కార్యక్రమం క్రింద 2007 సం. లో సుమారు రూ. 8000ల కోట్లు, 2008-09 ఆర్థిక సం.లో రూ. 16000 కోట్లు ఖర్చు కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 30000 కోట్లు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ ఈ ఆర్థిక సంవత్సరంలో క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా అమలు చేసి సుపరిపాలన ఫలాలను ప్రజలకు అందించాలనే సంకల్పంతో కేంద్రప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, నేషనల్ ఇన్ఫర్మాటిక్సు సెంటరు వారు జాతీయ స్థాయిలో జాతీయ ఉపాధి కార్యక్రమానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను http://nrega.nic.in రూపొందించి ఈ కార్యక్రమానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉంచారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మరో అడుగు ముందుకు వేసి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌తో కల్సి రాష్ట్రానికై ప్రత్యేకమైన జాతీయ గ్రామీణాభివృద్ధి కార్యక్రమ వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఈ వెబ్‌సైట్ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలు, కార్యక్రమాన్ని అమలు పరిచే ఇతర ఏజన్సీలు నిరంతరం సమాచారాన్ని నిర్వహించటానికి, కార్యక్రమ అమలు తీరుతెన్నులను పర్యవేక్షించటానికి వీలవుతుంది. ఈ సాఫ్ట్‌వేర్ / వెబ్‌సైట్ ద్వారా కూలీలకు జాబ్ కార్డుల జారీ, పనులకు అంచనాలు తయారుచేయటం, పనుల ప్రారంభానికి ఉత్తర్వులు జారీ, కూలీలకు వేతన చెల్లింపు ఉత్తర్వులు జారీ, వేతన స్లిప్‌లు జారీ చేయటం వంటి విధుల సులభంగా నిర్వహించవచ్చు.

జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమ అమలులోని వివిధ ప్రక్రియలను కంప్యూటరీకరించటం వల్ల ప్రజలకు సేవలు త్వరిత గతిన అందటమే కాక సేవల్లో పారదర్శకత కూడా సాధ్యమయింది. ఈ సేవలను అంతర్జాతీయంగా గుర్తింపు లభించి 2008 అంతర్జాతీయ స్టాక్‌హోమ్ ఛాలెంజ్ అవార్డును ఈ వెబ్‌సైట్‌కు ప్రదానం చేసారు. ఈ వెబ్‌సైట్‌ను గూర్చి మరిన్ని వివరాలకు http://nrega.ap.gov.in ను సందర్శించండి.

## ముగింపు

73వ రాజ్యాంగ సవరణ నేపథ్యంలో పంచాయతీరాజ్ సంస్థలను గ్రామీణాభివృద్ధి సాధనలో తప్పనిసరిగా భాగస్వాములను చేయవలసిన ఆవశ్యకత నేడు ఏర్పడింది. సమ్మిళిత అభివృద్ధి సాధనకు మానవ అభివృద్ధి రంగంలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందచేయుటానికి పంచాయతీరాజ్ సంస్థలను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని, ప్రణాళికల తయారు,అమలు, మదింపులో ప్రజలకు పంచాయతీరాజ్ సంస్థలకు తప్పనిసరిగా భాగస్వామ్యం కల్పించాలని 11వ పంచవర్ష ప్రణాళికా పత్రంలో కూడా ప్లానింగు కమీషను అభిప్రాయపడింది.

పంచాయతీరాజ్ సంస్థలకు కీలకమైన పథకాలను అమలు చేసే బాధ్యతలను బదలాయిస్తే ఆ పథకాల ఉద్దేశ్యాలు నెరవేరే అవకాశాలు తక్కువగా ఉంటాయని, పంచాయతీరాజ్ సంస్థలలో అవినీతి ఎక్కువనీ, పథకాల అమలులో పారదర్శకత లోపించి ప్రజలకు జవాబుదారీగా ఈ సంస్థలు పనిచేయవనీ పలు రకాలయిన కారణాలను చూపించే వారికి ఈ సంస్థలలో కంప్యూటరైజేషన్‌ని ప్రోత్సహించి, ఇన్ఫర్మేషను టెక్నాలజీ వినియోగం ద్వారా ఈ అవలక్షణాలను అధిగమించే అవకాశం ఉన్నదని; పైన చర్చించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, ఈ-పంచాయతీ, ప్రియాసాఫ్ట్, ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌ల వంటి ప్రజోపయోగ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు మరిన్ని రూపొందించటం ద్వారా సేవల నాణ్యతను మెరుగుపర్చవచ్చుని ఘంటాపదంగా చెప్పవచ్చు. ఇన్ఫర్మేషను టెక్నాలజీ సహకారంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలను సుపరిపాలనా సంస్థలుగా కూడా తీర్చిదిద్దవచ్చు.

**– డా. వి. శివశంకర్‌ప్రసాద్,**
జూనియర్ ఫ్యాకల్టీ

# పంచాయితీ కార్యదర్శుల పనితీరుకి పదును

**గ్రామ స్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సేవలను ఏకీకృతం చేస్తూ 2002లో తీసుకొనివచ్చిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థ ఆశించిన రీతిలో ఫలితాలను అందించనందున మరల తిరిగి గ్రామంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలకు ప్రత్యేక సిబ్బంది విధానాన్ని ఫిబ్రవరి 2007 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టాన్ని అనుసరించి గ్రామపంచాయతీకి మంత్రిత్వ సేవలందించటంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన 34 విధులను నిర్వర్తించాల్సి ఉంది.**

మారుతున్న అవసరాల కనుగుణంగా వివిధ ప్రభుత్వ పథకాల నుండి ప్రజలకు సేవలందించటంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాత్రపై అవగాహన కల్పించటానికి, పంచాయతీ కార్యదర్శుల పనితీరును మెరుగుపర్చటానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనపరిచి చిత్తూరు జిల్లాలో డివిజను వారీగా ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని జూన్ 16 నుండి 18 వరకూ నిర్వహించింది. పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను పెంపొందించుకోవటం, గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో గ్రామ పంచాయతీ తీసుకొనవలసిన జాగ్రత్తలపై, త్రాగునీటి సరఫరాలో తీసుకొనవలసిన జాగ్రత్తలు, జనన మరణాల నమోదులో పంచాయతీ కార్యదర్శుల పాత్ర, '108', '104' సేవలను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకొని వెళ్ళటం ఎలా అన్న విషయాలను శిక్షణాంశాలుగా నిర్ణయించారు.

ఈ శిక్షణా కార్యక్రమానికి చిత్తూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరక్టరు శ్రీ మురళి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రీ శ్రీరాములు, ఇ.ఎమ్.ఆర్.ఐ జిల్లా మేనేజర్ శ్రీ జె.ఎస్.ఆర్.సి. మూర్తి, 104 జిల్లా కో–ఆర్డినేటరు శ్రీమతి శాంతి దుర్గ, జిల్లా గణాంక అధికారి శ్రీ చంద్రయ్య, డి.పి.ఓ. డా. శేషారెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగపు పర్యవేక్షక ఇంజనీరు శ్రీ కిషోర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటరు శ్రీ దామోదర నాయుడు మొదలగు వారు రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి పరిశీలించటానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ నుండి జాయింట్ డైరక్టరు శ్రీ తఖియుద్దీన్, సెంటర్‌హెడ్ శ్రీ సూర్యనారాయణ రెడ్డి, సి.డి.పి.ఎ. జూనియర్ ఫాకల్టీ డా.వి.శివశంకర ప్రసాద్ చిత్తూరు జిల్లాలో జూన్ 16 నుండి 18 వరకూ పర్యటించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో చర్చించబడిన ముఖ్య అంశాలు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమాచారం కోసం, 'స్థానిక పాలన' పాఠకుల కోసం అందచేస్తున్నాము.

జూన్ 16వ తేదిన శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టరు శ్రీ రవిచంద్ర మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదనీ, నీతి, నిజాయితీ, నియమ బద్ధతతో విధులు నిర్వర్తిస్తే గ్రామీణ ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. పంచాయితీ సెక్రటరీలకు వారు నిర్వర్తించాల్సిన విధులపై స్పష్టమైన అవగాహన కల్పించకుండా విధి నిర్వహణలో వైఫల్యాలకు వారిని బాధ్యులు చేయటం సమంజసం కాదని, వివిధ అంశాలపై అవగాహన కొరకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించామని తెలియచేసారు. ఈ శిక్షణ ద్వారా వివిధ

## చిత్తూరు జిల్లాలో శిక్షణా కార్యక్రమం

ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నియమ నిబంధనలు తెలుసుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యదర్శులకు ఉద్దేశించిన సమాచార కరదీపికను ఆవిష్కరించారు.

### 104 సేవలు

104 జిల్లా సమన్వయకర్త శ్రీమతి శాంతి దుర్గ మాట్లాడుతూ, 104 ఆరోగ్య సేవల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 3కి.మీ పైబడిన గ్రామాలలో పారామెడికల్ సిబ్బంది వివిధ గ్రామాలను ప్రతీమాసం నిర్ణీత తేదీలలో సందర్శించి పేదలకు ఉచిత వ్యాధి నిర్ధారక పరీక్షలు నిర్వహిస్తారని, అవసరాన్ని బట్టి రోగులను సంబంధిత ప్రాథమిక వైద్యాధికారి వద్దకు తదుపరి వైద్య సలహా కోసం పంపుతారని తెలియచేశారు. ప్రాథమిక వైద్యాధికారి లేదా రిఫరల్ ఆసుపత్రి వైద్యుడు రాసిన మందులు కూడా తదుపరి మాసంలో నిర్వహించే ఆరోగ్య శిబిరంలో ఉచితంగా 104 సిబ్బంది అందచేస్తారని ఆమె వివరించారు.

***ఈ 104 మొబైల్ ఆరోగ్య సేవలు ద్వారా –***

- ☆ గర్భవతుల ఆరోగ్య సమస్యల పర్యవేక్షణ, సంరక్షణ
- ☆ శిశువులు, పిల్లల ఆరోగ్య సంరక్షణ, పోషకాహార పంపిణీ
- ☆ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో సహా దీర్ఘకాల వ్యాధులకు చికిత్స
- ☆ సమగ్ర వ్యాధుల పర్యవేక్షణా కార్యక్రమం
- ☆ పాఠశాలల్లో ఆరోగ్య కార్యక్రమం వంటి సేవలను పొందవచ్చని ఆమె తెలియచేసారు. ఈ కార్యక్రమం ప్రజల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తుందని, మారుమూల గ్రామాలకు సైతం వైద్య సేవల విస్తరించటానికి దోహదం చేస్తుందని, ఈ ఆరోగ్య శిబిరాలు నిర్వహించటానికి గ్రామంలో

పంచాయితీ కార్యదర్శులు సహకరించాలని కోరారు. 104 సేవల వల్ల తల్లీబిడ్డల మరణాలను కూడా గణనీయమైన రీతిలో తగ్గించవచ్చని తెలియచేసారు. సమాచార లోపం వల్ల ఆరోగ్య శిబిరాలు నిర్వహించే విషయం ప్రజలకు విస్తృతంగా తెలియటంలేదని, ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయటంలో సహకరించవలసినదిగా ఆమె కోరారు.

## 108 సేవలు

108 జిల్లా శ్రీ మేనేజర్ జె.ఎస్.ఆర్.సి. మూర్తి మాట్లాడుతూ, ఇ.ఎమ్. ఆర్.ఐ. అందచేస్తున్న సేవలలో 108 అంటే ప్రజలలో అంబులెన్సు సేవలు మాత్రమేనన్న అపోహ ఉందని, 108 కి ఫోన్ చేయటం ద్వారా అంబులెన్సు సేవలు, పోలీసు సేవలు, అగ్నిమాపక సేవలను మూడింటిని పొందవచ్చని వివరించారు. 108 ఆందించే సేవలలో రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం సేవలు మెడికల్, 18 శాతం పోలీసు, 2 శాతం అగ్నిమాపక సంబంధ సేవలఉన్నాయని ఆయన అన్నారు.

జి.ఐ.ఎస్, జి.పి.ఎస్, వంటి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం ద్వారా ప్రజలకు త్వరిత గతిన సేవలందించటానికి వీలున్నదని ఆయన తెలియచేసారు. రాష్ట్ర వ్యాప్తంగా 802 అంబులెన్సులు సేవలందిస్తునాయని, రాష్ట్రంలో లక్షలాది మందికి అంబులెన్సు సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలియచేశారు.

108 సేవలలో ప్రసూతి సేవలకు, చిన్న పిల్లల సేవలకు, ప్రమాదాల కేసులకు ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని వివరించారు. రోజుకు 64 వేల ఫోన్ కాల్సును అందుకోవటం జరుగుతోందని, ఐతే 108కి వచ్చే ఫోన్ కాల్సులో ఎక్కువ సంఖ్యలో ఆకతాయిలు చేసేవి ఉన్నాయని, ఇటువంటి కాల్స్‌కు విలువైన సమయం వృధా అవుతుందని, ఈ విపరీత పోకడల పట్ల ప్రజలను అప్రమత్తం చేసి 108 సదుపాయాన్ని సద్వినియోగ పరిచేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకొనవలసినదిగా ఆయన కోరారు.

## త్రాగునీటి సరఫరా

గ్రామీణనీటి సరఫరా విభాగపు పర్యవేక్షక ఇంజనీరు శ్రీ కిషోర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో వచ్చే జబ్బులలో 80 శాతం నీటి ద్వారానే సంక్రమిస్తున్నాయని, నీటి సరఫరా విషయంలో పంచాయతీ కార్యదర్శులు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని తెలియచేశారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా అందచేసే త్రాగునీటిని క్లోరినేషన్ చేసే విధానాన్ని వివరించారు. నీటిలో ఒ.హెచ్.ఎస్.ఆర్ వద్ద క్లోరిన్ శాతం 2 పి.పి.ఎమ్ ఉండాలని, చివరి నీటి సరఫరా పాయింట్ వద్ద 0.2 పి.పి. ఎమ్ ఉండాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలియచేశారు. ప్రతీ 1000 లీ. నీటికి 2.5 గ్రా. నుండి 4.00 గ్రాముల బ్లీచింగు పౌడరు కలపాలని, ఐ.ఎస్.ఐ మార్కు గల బ్లీచింగు పౌడరు మాత్రమే వాడాలని ఆయన తెలియచేశారు. ప్రతీ 15 రోజులకొకసారి మంచినీటి ట్యాంకును శుభ్రపరచాలని, గ్రామంలో పిట్ ట్యాపు కనక్షన్లను వెంటనే తొలగించాలని తెలియచేశారు.

ప్రతీ గ్రామ పంచాయతీకి నీటి నాణ్యతా పరీక్షలు జరపటానికి ప్రత్యేకమైన కిట్లను అందచేయటం జరిగిందని, బుతుపవనాల ప్రారంభానికి

**108 సేవలలో ప్రసూతి సేవలకు, చిన్న పిల్లల సేవలకు, ప్రమాదాల కేసులకు ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని వివరించారు. రోజుకు 64 వేల ఫోన్ కాల్సును అందుకోవటం జరుగుతోందని, ఐతే 108కి వచ్చే ఫోన్ కాల్సులో ఎక్కువ సంఖ్యలో ఆకతాయిలు చేసేవి ఉన్నాయని, ఇటువంటి కాల్స్‌కు విలువైన సమయం వృధా అవుతుందని, ఈ విపరీత పోకడల పట్ల ప్రజలను అప్రమత్తం చేసి 108 సదుపాయాన్ని సద్వినియోగ పరిచేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకొనవలసి ఉంది.**

ముందు, తరువాత నీటి నాణ్యతను పరీక్షించి ఆ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేలా గ్రామ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని పర్యవేక్షక ఇంజనీరు తెలియచేశారు. గ్రామాలను 'నిర్మల' గ్రామాలుగా తీర్చిదిద్దటానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఆయన సూచించారు.

## ప్రజారోగ్య సంరక్షణ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ, ఆరోగ్య సేవల విస్తరణలో పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ కనపరచాలని, గ్రామంలో దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, గ్రామాలలోని లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూడాలని తెలియచేశారు. దోమల ద్వారా సంక్రమించే మలేరియా, ఫైలేరియా, మెదడువాపు, చికున్ గున్యా, డేంగ్యూ మొదలైన వ్యాధుల లక్షణాల గూర్చి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కలుగచేశారు. కలుషిత నీరు, ఆహారాన్ని సేవించటం వల్ల అతిసార, కలరా వ్యాధులు ప్రబలే అవకాశం వున్నదని, గ్రామంలో త్రాగునీటి విషయంలో అత్యంత శ్రద్ధ కనపరచాలని ఆయన తెలియచేశారు.

## జాతీయ గ్రామీణ హామీ పథకం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు శ్రీ మురళి మాట్లాడుతూ, జిల్లాలో తమ సంస్థ ప్రధానంగా ఉపాధి హామీ పథకాన్ని, నీటి పరీవాహక ప్రాంత అభివృద్ధి కార్యక్రమాన్ని, సమగ్ర భూ అభివృద్ధి పథకాన్ని, వాల్టా చట్టానికి సంబంధించిన కార్యక్రమాలని అమలు చేస్తోందని తెలియచేశారు. ఉపాధి హామీ పథకం అమలులో గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్వర్తించాల్సిన బాధ్యతల గూర్చి వివరించారు. ఎక్కువ సంఖ్యలో కూలీలకు ఉపాధి కల్పించటం ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేయవలసినదిగా ఆయన కోరారు. ఉపాధి హామీ పథకం, వాటర్ షెడ్, సి.ఎల్.డి.పి. ల ద్వారా జిల్లాలో సాధించిన విజయాలను గూర్చి విశదీకరించారు.

## పంచాయతీ పరిపాలన

జిల్లా పంచాయతీ అధికారి శ్రీ శేషారెడ్డి మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శులుగా పంచాయతీరాజ్ శాఖ స్వంత సిబ్బందితోబాటుగా ఇతర శాఖలనుండి పంచాయతీరాజ్ శాఖకు బదలాయించబడిన సిబ్బంది, కాంట్రాక్టుపై పనిచేస్తున్న సిబ్బంది పనిచేస్తుండటం వల్ల విధుల నిర్వహణలో ఒక పంచాయతీకి మరొక పంచాయతీకి పోలిక ఉండటం లేదని, అందరి

గ్రామ కార్యదర్శుల పనితీరు ఒకే విధంగా ఉండాలంటే సంబంధిత అంశాలలో శిక్షణ అవసరమని గ్రహించిన జిల్లా కలక్టరు పంచాయతీ సెక్రటరీల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించారని తెలియచేశారు. ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల ద్వారా అందచేయబడే పౌరసేవలను పారదర్శకతతో జవాబుదారీతనంతో ఎలా అందచేయవచ్చో వివరించారు.

**'స్థానిక పాలన' మాసపత్రికలో పంచాయతీ రాజ్ సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు ఉపయుక్తమయ్యేలా వివిధ అంశాలను పొందుపరుస్తున్నామని, ప్రతీ గ్రామపంచాయితీకి ఈ పత్రికను వచ్చేనెల నుండి చేరేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలియచేశారు. 'అపార్డు' జాయింట్ డైరక్టరు శ్రీ తయుద్దీన్ మాట్లాడుతూ, పౌరులకు నాణ్యమైన సేవలను అందించటానికి పంచాయితీరాజ్ సంస్థల సామర్థ్యాలను పెంపొందించటానికి రాష్ట్రంలో బి.ఆర్.జి.ఎఫ్, ఆర్.జి.ఎస్.వై. కార్యక్రమాల క్రింద సమగ్ర శిక్షణా కార్యక్రమాలను అమలు పరుస్తున్నట్లు 'అపార్డు' కమీషనర్ శ్రీ ఫణికుమార్ తెలియచేశారు.**

పంచాయతీ ఆదాయాలను ఏ విధంగా పెంపొందించవచ్చో తెలియచేస్తూ బిల్డింగు లే అవుట్ ఫీజు, ఇళ్ళ స్థలాల లే అవుట్లు అనుమతించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వసూలు చేయవలసిన ఫీజులు, అడ్వర్టయిజ్‌మెంట్ టాక్సును ఏవిధంగా వసూలు చెయ్యవచ్చో వివరించారు. కొత్త అక్కౌంటింగ్ విధానంలో గ్రామ పంచాయతీలలో లెక్కల నిర్వహణ చేసేందుకు జిల్లాలో ప్రత్యేకంగా రూపొందించిన మాన్యువల్ ద్వారా 80 శాతం పంచాయతీలలో నగదు పుస్తకాన్ని నిర్వహిస్తున్నారని ఆయన తెలియచేశారు.

## జనన మరణాల నమోదు

జిల్లా గణాంక అధికారి మాట్లాడుతూ, సివిల్ రిజిస్ట్రేషన్ 1969 ప్రకారం జనన మరణాల నమోదు తప్పనిసరి అనీ, సివిల్ రిజిస్ట్రేషను అధికారిగా గ్రామపంచాయతీ కార్యదర్శి తప్పనిసరిగా ఈ విధులు నిర్వర్తించాలని తెలియచేసారు. కానీ గత రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీల నుండి రిజిస్ట్రేషన్లు సక్రమంగా నమోదు కావటంలేదని, దీనికి కారణం గ్రామ రెవెన్యూ అధికారుల నుండి ఈ విధులు పంచాయితీ సెక్రటరీకి బదలాయించబడటమేనని తెలియచేసారు. బదలాయించబడిన విధులకు తగినట్లుగా సెక్రటరీలు బాధ్యతలు గుర్తెరిగి నిర్వర్తించాలని కోరారు.

శిక్షణా కార్యక్రమానికి జూన్ 18వ తేదీన ముఖ్య అతిధిగా హాజరయిన జిల్లా కలక్టరు శ్రీ శేషాద్రి మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో వివిధ శాఖల ద్వారా అమలు అవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర అవగాహనను ఏర్పరచుకొని గ్రామీణ పేదప్రజలకు సేవలందించటంలో పంచాయతీ సెక్రటరీలు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని పిలుపునిచ్చారు. భవిషత్తులో కూడా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శుల సామర్థ్యాలు మెరుగుపరుస్తామని ఆయన అన్నారు.

శిక్షణా కార్యక్రమానికి పరిశీలకులుగా వ్యవహరించిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ ప్రొఫెసర్ ఆర్. సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, చిత్తూరు జిల్లాలో చేపట్టిన శిక్షణా కార్యక్రమ నిర్వహణకు 'అపార్డు' పూర్తి సహాయ సహకారాలను అందచేస్తుందని, 'అపార్డు' కమీషనరు శ్రీ ఫణికుమార్ ఐ.ఎ.ఎస్. ప్రత్యేక శ్రద్ధ కనపరిచి ఈ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించటానికి తమ బృందాన్ని చిత్తూరుకు పంపారని, ఈ శిక్షణాంశాలను మరింత మెరుగుపర్చి మిగిలిన జిల్లాలలో కూడా అమలు చేస్తామని తెలియచేశారు.

పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధులు, సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించటానికి నిరంతర శిక్షణా కార్యక్రమం క్రింద దూరవిద్యా విధానంలో 'మన టివి' ద్వారా వివిధ అంశాలలో మండల పరిషత్తు కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టి.వి.ల ద్వారా హైదరాబాదు స్టూడియో నుండి ప్రసారాలను ప్రతి శుక్రవారం శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలియచేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాప్రతినిధులను ప్రేరేపించి ఈ శిక్షణా కార్యక్రమాలకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


'స్థానిక పాలన' మాసపత్రికలో పంచాయతీ రాజ్ సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు ఉపయుక్తమయ్యేలా వివిధ అంశాలను పొందుపరుస్తున్నామని, ప్రతీ గ్రామపంచాయితీకి ఈ పత్రికను వచ్చేనెల నుండి చేరేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలియచేశారు. 'అపార్డు' జాయింట్ డైరక్టరు శ్రీ తయుద్దీన్ మాట్లాడుతూ, పౌరులకు నాణ్యమైన సేవలను అందించటానికి పంచాయితీరాజ్ సంస్థల సామర్థ్యాలను పెంపొందించటానికి రాష్ట్రంలో బి.ఆర్.జి.ఎఫ్, ఆర్.జి.ఎస్.వై. కార్యక్రమాల క్రింద సమగ్ర శిక్షణా కార్యక్రమాలను అమలు పరుస్తున్నట్లు తెలియచేశారు.

'అపార్డు' ఫ్యాకల్టీ డా.వి.శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ, 73 మరియు 74వ రాజ్యాంగ సవరణల నేపధ్యంలో పంచాయతీరాజ్ సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా సేవలందించాల్సిన తరుణం ఆసన్నమయిందని ఆర్టికల్ 243 జి ప్రకారం స్థానిక ప్రాంతాల ఆర్థిక అభివృదిద్ధి, సామాజిక న్యాయ సాధనకు ప్రణాళికలను రూపొందించాలని తెలియచేశారు. ప్రభుత్వం కూడా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మత్స్య, మహిళా శిశుసంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, షెడ్యూల్డు కులాల సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా, వైద్యా ఆరోగ్య శాఖ, పశుసంవర్ధక, విద్య వంటి 10 శాఖలలో వివిధ అధికారాలను పంచాయతీలకు బదలాయించినదనీ, ఈ విధులను నిర్వర్తించాలంటే పంచాయతీ కార్యదర్శులు మార్పుకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని తెలియచేశారు. పంచాయతీ కార్యదర్శులకు మరింత మెరుగైన శిక్షణను విస్తరణ శిక్షణా కేంద్రాలలో అందచేయనున్నట్లు తెలియచేశారు.

శిక్షణా కార్యక్రమానికి చిత్తూరు, చంద్రగిరి, మదనపల్లి రెవెన్యూ డివిజనుల నుండి మొత్తం 607 మంది కార్యదర్శులు హాజరయ్యారు. కార్యదర్శులంతా ఈ శిక్షణా కార్యక్రమంపట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. భవిష్యత్తులో మరిన్ని అంశాలపై శిక్షణ అందచేయాల్సిందిగా కోరారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని మదనపల్లి డివిజనల్ పంచాయతీ అధికారిణి శ్రీమతి జగదీశ్వరి, చంద్రగిరి డివిజనల్ పంచాయతీ అధికారి రజాక్‌లు సమన్వయ పరిచారు.

***– డా.వి. శివశంకర ప్రసాద్***
*జూనియర్ ఫ్యాకల్టీ, సిడిపిఎ, అపార్డు*

# సమగ్రాభివృద్ధి చెందిన గుంటిమడుగు వాటర్‌షెడ్



కడప రాయచోటి మండలం కాటిమాయకుంట గ్రామపంచాయితీలోని గుంటిమడుగు, ఇతర ప్రాంతాలు కరువు కాటకాలకు లోనవుతూ పనిలేక కొంతమంది కూలీలు వలసలు వెళ్తూ ఒక రకమైన దుర్భిక్షాన్ని ఎదుర్కొంటుండేది.

**డి.పి.ఎ.పి.5వ బ్యాచ్ క్రింద 1999- 2000వ సంవత్సరంలో 'గుంటిమడుగు' వాటర్‌షెడ్ ప్రోగ్రాం నందు తీసికొనబడింది.**

దీనిలో భాగంగా 500 హెక్టార్ల విస్తీర్ణంలో గత ప్రాజెక్టు పీరియడ్ నందు భూసార సంరక్షణ, వాననీటి నిలుపుదల, పండ్లతోటల పెంపకం, వనసంరక్షణ, రోడ్డుకిరువైపుల చెట్లను నాటించటం, పశుగ్రాసాభివృద్ధి తదితర సమగ్రాభివృద్ధి పనులు చేపట్టబడ్డాయి. (48 రాతికట్టలు, 5చెక్‌వాల్స్, 40 కోనేటి గుంతలు, 9 నీటి కుంటలు,1 గేబియన్ స్ట్రక్చర్, 640 మీటర్ల కాంటూరు కందకాలు, 7403 మామిడి, చింత చెట్లు, 5 హెll వనపెంపకము, 3 కి.మీ. అవెన్యూ పాంటేషన్, సుమారు 15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టబడ్డాయి.)

గుంటిమడుగు వాటర్‌షెడ్ నందు నీటి మళ్లింపు కాలువల వలన వరద నివారణ జరిగింది. వివిధ నిర్మాణాల వలన నేడు పుష్కలంగా నీరు నిలవ చేయబడి భూగర్భ జలమట్టం చాలా పెరిగింది. భూసార సంరక్షణ జరిగింది. పంటలు వేసే విస్తీర్ణం పెరిగి దిగుబడి ఎక్కువైంది. పండ్లతోటలు, వనసంరక్షణ వలన గ్రామంలో పచ్చదనం, రైతులకు ఆదాయం చేకూరింది. పశుగ్రాసం (నేపియర్, కో-I, II తదితర రకాల గడ్డిపెంపకం) పెంచటం వలన పశువుల సంఖ్య పెరిగి పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.


ఒకప్పుడు ఇంటి అవసరాలకే సరిపోని పాల దిగుబడి ఈనాడు రోజుకు 450 లీటర్లపైనే ఇతర ప్రదేశాలకు పంపే స్థితికి ఈ గ్రామం చేరుకుంది.

కూలీలకు తగినంతపని గ్రామంలోనే వుండడం వలన వలసలు పూర్తిగా తగ్గాయి.

గ్రామాలలోని స్త్రీలందరూ డ్వాక్రా గ్రూపుల పేర స్వయం సమృద్ధిని సాధించే క్రమంలో ఉన్నారు.

ఈ గ్రామాభివృద్ధి అంతా శ్రీ పి.వి. కృష్ణారావు, పి.ఐ.ఎ. ఆధ్వర్యంలో డబ్ల్యు.డి.టి.మెంబర్లు శ్రీ వెంకటరామిరెడ్డి, ఆంజనేయులు, రంగారెడ్డి, విశ్వేశ్వర రెడ్డి పర్యవేక్షణలతో జరిగిందని గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

*– సి. శ్రీధర్‌రాజు, అదనపు కార్యక్రమ అధికారి,*
*టి. సుండుపల్లి మండలం*



# సుప్రసిద్ధుల వచన పచనం



***హా**స్య స్ఫోరకమైన అనుకరణ ధ్వని సంబంధం అయితే అది మిమిక్రీ.*

*ఒక రచయిత పద్య లేదా గద్యశైలిని హాస్యస్ఫోరకంగా అనుకరిస్తే అది పేరడీ. మిమిక్రీ కళాకారుడు ప్రసిద్ధ వ్యక్తుల గళాలను, ఎంపిక చేసుకున్నట్లే - పేరడీ ప్రయోగానికి కూడా ప్రముఖ రచయితల శైలిని మాత్రమే ఒరవడిగా తీసుకోవడం జరుగుతుంది. ఇది ఒక రకం స్తుతి వ్యాపారం కనుక అనుకర్త తన అభిమాన రచయితలనే ఎంపిక చేసుకుంటాడు.*

*వాసిగల ప్రతి రచయితకు స్వీయశైలి తప్పక ఉంటుంది. ఇలా స్వీయశైలి లేని రచయితను అనుకరించడం అసాధ్యం, ఇప్పుడు కొందరి గద్యశైలిని అనుకరించి చూపుతాను. వారి రచనలపట్ల నాకు గల గౌరవభావం వల్లనే ఈ పనికి పూనుకున్నాను. కనుక, అపార్థం చేసుకోవడం జరగదనే ఆశిస్తున్నాను.*

## శ్రీరమణ పేరడీలు

### కారాశైలి

**పాత్రికేయుని శైలికి, కథారచయిత శైలికి తేడా వుంటుంది. పాత్రికేయుడు భోగట్టా మాత్రమే ఇస్తాడు. క్లుప్తత అతనికి ముఖ్యం. చూడండి, ఇదే సన్నివేశాన్ని పాత్రికేయుడు ఎలా చిత్రిస్తాడో;**

నిర్ణీత వేళకు నిర్దేశించబడిన ప్లాట్‌ఫారంపైకి రైలు రాగానే ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌లో తన రిజర్వుడు బెర్త్ పై కూర్చున్న అతని వయసు 35 సంవత్సరాలు వుండచ్చు. అతను ఆలోచిస్తున్న మాట నిజమే కావచ్చు. కాగా, ఏమి ఆలోచిస్తున్నదీ తెలియరాలేదు. పోతే పధ్నాలుగు బోగీలు, ఒక ఇంజను గల ఈ రైలు బయలుదేరే ముందు కూత వేసింది.

☆

### చక్కని చుక్కలు

**వాకాటి పాండురంగారావుగారు చెప్పే తీరు సింబాలిక్‌గా వుంటుంది. వీరి కథల్లో అక్షరాల కన్నా చుక్కలే ఎక్కువగా వుంటాయని ఒక విమర్శ-**

పాథాలజిస్టు... మైక్రోస్కోపు.... లో .. ఎర్రటి కణాలు, ఒకటి... దాని వెనుక.. ఇంకోటి.. ఎర్రకణాల్లాంటి రైలు పెట్టెలు, చుక్కలు చుక్కలుగా.. సెలైన్.. బొట్లు.. టప్.. టప్.. ధన్.. ధన్.. నేను ఎక్కడికో.. ప్రయాణం? స్మారకానికి.. అపస్మారకానికి మధ్యన.. యమభటుల్లాంటి



ఇంజన్ డ్రైవరు ఫైర్‌మెన్... అశ్వనీ దేవతల్లాంటి నర్సులు, ఇది హాస్పిటలా, రైలా? రోగంతో నేను ప్రయాణం చేస్తున్నాను. ఇంజక్షన్ గుచ్చినట్లు రైలు కూత... మగత.. అయోమయం.. నీలంగా.. ఎర్రగా.. రక్తకణాలు.. ఒకటి.. రెండు.. అ.. యి..దు...'

### ఊహాగాయని

**'లత సాహిత్యం' తెలుగునాట మంచి ప్రాచుర్యాన్ని పొందింది. సొంత శైలిని సంతరించుకున్న కొద్దిమంది రచయిత్రులలో లత గారు ఒకరు.**

'నేనంటే ఎవరికీ గిట్టదు. దూరంగా వెళ్లి పోవాలనుకున్నాను. రైలెక్కగానే ఫస్ట్‌క్లాస్‌లో ఎక్కి కూర్చున్నాను. ఈ పరిసరాలు దాటి వెళ్ళిపోవాలి. నా జీవన స్రవంతిలో ఇదొక అనుభవతరంగం. ఆకాశవాణిలో ప్రయోక్తగా పని చేస్తున్నపుడు ముసలయ్య అనొక డ్రైవర్ ఉండేవాడు. అతను చనిపోయాక తెలిసింది వానికో ప్రేమించే మనసుందని. నేను చనిపోయాక.. నా సంగతి తెలుస్తుంది. టైమ్ అయింది కాబోలు.. రైలు కూత ఎంత మధురంగా వుంది? వంశీ మోహనుని మురళీరావంలో ఆ తన్మయత్వంలో, ఆ పరవశత్వంలో దూరంగా ఎక్కడికో, అనంత తీరాలకు వెళ్ళిపోవాలి."

### ఖరీదైన భావాలు



**సగటు పాఠకుణ్ణి ఊహాలోకాల్లో విహరింప చేసే నవలలూ, కథలూ మనకు కోకొల్లలు. హైదరాబాదులో బీచ్, వైర్‌లెస్ తీగెల మీద పక్షులు - ఇలాంటివి కూడా వీరు తమ రచనల్లో పఠితలకు చూపగలరు. వీరి నవలా నాయకుడు వచ్చి పల్లెటూళ్ళో వుంటున్నా - ఆ కుగ్రామంలో ఎంత లావు ఎక్స్‌ప్రెస్ రైలైనా ఆగడం మనం చూడవచ్చు. సరే మత్తుమందులా వుండే వారి శైలి చూడండి.**

'రైలు రాజహంసలా వచ్చి ఆగింది. ఫస్ట్‌క్లాస్ కూపేలో తన బెర్త్‌పై కూర్చున్నాడు కిరణ్.

"మే ఐ టేక్ దిస్" అన్నాడు ప్రక్కన వున్న ఫెమినా తీసుకుంటూ- "బై ఆల్ మీన్స్" అన్నది ఆమె క్లుప్తంగా, ఆ మాటలు కోటి వీణలు మీటినట్లు విన్పించినై కిరణ్‌కి. తల యెత్తి చూసింది అమె. అరడుగుల యెత్తు, గ్వాలియర్ సూటూ. ఎంబాసిడర్ బూటూ, చూపరులను ఇట్టె ఆకట్టే ముఖం- ఆమె అనిర్వచనీయమైన అనుభూతికి లోనైంది. కొద్ది క్షణాలు నిశబ్దం రాజ్యం చేసింది. కిరణ్ నుదుటిపై పడిన వుంగరాల జుత్తు రైలు కుదుపుకు అనుగుణంగా కదుల్తోంది. చేతినున్న వొమేగా వాచీలో టైం చూసుకుని, నాప్‌కిన్‌తో నుదురు తుడుచుకున్నాడు, రైలుకూతకు అమె వులిక్కిపడింది. అతను కొంటెగా చూసి చిన్నగా నవ్వాడు......'.

*(తదుపరి సంచికలో మరో సందర్భపు పేరడీలు)*

☆

*Printed & published by Phanikumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : Phani Kumar*

# పేద కూలీలకు అండ



అది˘ంగా ా్రి క లు వలస ఖ్యిన రేక లంఎల్లీ గామంల వలసలు ఖ్యిన ఎ ంర్రిదం‿ రి
ం ఎ ల ,' ఎ దివ మీ ఎద˘ర్ విద్త ము ోరిన రోజులు ఎనులు చేసుోవచ చుట్లూ
ఎసం ఋ్నని గామీణాబివ ద్ధి శ ఖావ్త ు లు శ్రీ వటిషిసంత్ క వ ర్



ఋటసినుండ విము ణ్రిలి ల ఆ బవిష్త్ బాగోగుల ోసం 5ల˘ల ం్రఎ యిల చ్ేను
అందజఋ్నని గామీణాబివ ద్ధి శ ఖావ్త ు లు శ్రీ వటిషిసంత్ ్క వ ర్

Stanika Palana

APTEL / 2009/27888

